సూక్తులు

# సంస్కృత సూక్తి రత్న కోశః - 2



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సంస్కృత సూక్తి రత్నకోశః

## ద్వితీయా మఞ్జూషా

సంకలనం తాత్పర్యం చ

డా. పుల్లెల శ్రీరామచంద్రః

సంస్కృతభాషా ప్రచార సమితి
హైదరాబాదు - 500 001

# అంకితం

1978 సంవత్సరంలో ఈ సంస్కృతభాషా ప్రచార సమితిని ప్రారంభించిన శ్రీ జి. పుల్లారెడ్డిగారి సత్సంకల్పఫలితంగా ఇలాంటి గ్రంథాల రచన ప్రచురణాదులు చేయడానికి వీలు లభించింది. శ్రీ పుల్లారెడ్డి గారు ఆర్థికంగా చాలా క్రింది స్థితి నుంచి అత్యున్నతస్థితిని సంపాదించిన నిరంతర కర్మాచరణ శీలులు, కార్యదక్షులు. అట్టి స్థితినుంచి ఇలాంటి స్థితిని సంపాదించినవారు ఇంకా ఎందరో ఉండవచ్చును గాని పరవంచన అనేది లేకుండా ధర్మైకదృష్టితో వ్యాపారం సాగించిన వారు చాలా అరుదు అనే చెప్పాలి. సంపాదించిన ధనాన్ని సద్వినియోగంచేస్తూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగు కాలేజి మొదలైన విద్యాసంస్థల నిర్వహణం ద్వారా విద్యావ్యాప్తికి నిరంతరోద్యమం నిర్వహిస్తున్న శ్రీపుల్లారెడ్డిగారిని విజ్ఞులెవ్వరూ అభినందించకుండా ఉండలేరు. ఈ గ్రంథాన్ని శ్రీ పుల్లా రెడ్డిగారికి అంకితం చేయడానికి నన్ను ప్రేరేపించినది ఏతాదృశాభినందన దృష్టియే.

దీనిని ఈ విధంగా స్వీకరించడానికి ఇష్టంలేకపోయినా నామాట కాదనలేక శ్రీ పుల్లారెడ్డిగారు అందుకు అంగీకరించినందుకు నా సంతోషాన్ని వ్యక్తీకరిస్తూ భారతీయ సంస్కృతి పరిరక్షణ బద్ధకంకణులైన ఇలాంటి పుల్లారెడ్డిగార్లను ఎందరినో భారతదేశానికి, ప్రధానంగా ఆంధ్రదేశానికి, ప్రసాదించవలసిందిగా ఆ భద్రగిరీశుణ్ణి ప్రార్థిస్తున్నాను.

**विश्वानैर्मोकनां मोदयत्याचलान् भवान् ।**
**भवन्तं मोदयन्त्वेताः [illegible]कतयो रस[illegible]प्लुताः ॥**

పుల్లెల శ్రీరామచంద్రుడు

శ్రీః

# తొలిపలుకు

సంస్కృతభాషా ప్రచార సమితి చేపట్టిన సంస్కృత ప్రచార కార్యక్రమంలో భాగంగా సంస్కృత గ్రంథాలు, సంస్కృతభాషలో అంతగా పరిచయం లేని వారికి కూడా ఉపకరించే విధంగా వ్రాసిన తెలుగు వ్యాఖ్యానువాదాలతో ప్రచురింపబడుతున్నాయి. ఇంతవరకు ప్రచురించిన పంచతంత్రం, మేఘసందేశం మొదలైన ఆంధ్రవ్యాఖ్యాది సహిత గ్రంథాలు వ్యాససంకలన రూపాలైన రామాయణసర్వస్వం వంటి గ్రంథాలు, సంస్కృత స్వబోధిని పఠితల ఆదరాన్ని చూరగొన్నాయి. 1992 వ సంవత్సరంలో సంస్కృత సూక్తి రత్నకోశం ప్రథమ మఞ్జూష ఆంధ్రానువాదంతో కూడిన 500 శ్లోకాలతో ప్రచురింపబడినది ఇప్పుడు 600 శ్లోకాలతో ఈ ద్వితీయ మఞ్జూషను ఆంధ్రపాఠక లోకానికి అందజేస్తున్నాము. దీనికి కూడా సంస్కృతాభిమానుల ఆదరణ లభించగలదని ఆశిస్తున్నాను.

పుల్లెల శ్రీరామచంద్రుడు

కులపతి

## సంక్షిప్త పద సూచి

| | | | |
|---|---|---|---|
| ఆర్యా. | ఆర్యాద్వాషష్టిక | ఉ.రా.చ. | ఉత్తరరామచరితం |
| కలివి. | కలివిడంబనం | గా.స.శ. | గాథాసప్తశతి |
| చాణక్య. | చాణక్య నీతి వాక్యాని | నీ.దీ. | నీలకంఠ దీక్షితులు |
| పు.శ్రీ.రా. | పుల్లెల శ్రీరామచంద్రుడు | భ.గీ. | భగవద్గీత |
| భ.హ. | భర్తృహరి | మ.భా. | మహాభారతము |
| మ.స్మృ | మనుస్మృతి | యక్షప్ర. | యక్షప్రశ్నలు |
| రఘు. | రఘువంశం | రామా. | రామాయణం |
| వి.నీ. | విదురనీతి | శం.ఆ. | శంకరాచార్యులు |

# సంస్కృత సూక్తి రత్నకోశః
## ద్వితీయా మఞ్జూషా

### అ

అనుష్ఠితం తు యద్దేవై ర్మునిభిర్యదనుష్ఠితమ్
నానుష్ఠేయం మనుష్యైస్తు తదుక్తం కర్మ ఆచరేత్. 1

తా. దేవతలు చేసిన పనులు, ఋషులు చేసిన పనులు మనుష్యులు చేయగూడదు. వాళ్లు చెప్పినట్లు మాత్రమే చెయ్యాలి.

అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృది దైవతమ్
ప్రతిమాస్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శినామ్. 2

తా. యజ్ఞయాగాదులు చేసే ద్విజులకు అగ్ని దేవత. మునులకు దేవుడు హృదయంలోనే ఉంటాడు స్వల్పబుద్ధులకు దేవుడు విగ్రహాలలో ఉంటాడు. సమదృష్టిగల బ్రహ్మవేత్తలకు దేవుడు అంతటా ఉంటాడు.

అనాయాసేన విత్తస్య సముపార్జనతత్పరాః
కిం కిం న తన్వతే పాపం కస్మై వా నాపకుర్వతే (పు.శ్రీ.రా.)

తా. ఏమీ శ్రమపడకుండా ధనం సంపాదించాలనుకొనేవాళ్లు చేయని పాపం ఏముంటుంది? వాళ్లు అపకారంచేయని వాళ్లు ఎవరు ఉంటారు ?

అణోరణీయాన్ మహతో మహీయాన్
మధ్యే నితమ్బశ్చ యదఙ్గనాయాః,
తదఙ్గహారిద్రనిమజ్జనేన
యజ్ఞోపవీతం పరమం పవిత్రమ్. 4

అశ్వినీ సూయతే వత్సం కామధేనుస్తురఙ్గమమ్
తథైవ సాగరో వహ్నిం యథా రాజా తథా ప్రజాః. 5

తా. ఆడగుఱ్ఱం ఆవుదూడను కంటుంది; ఆవు గుఱ్ఱాన్ని కంటుంది. సముద్రం అగ్నిని ప్రజ్వలింపచేస్తుంది. రాజును పట్టే ప్రజలూను.

అతీవ బలహీనం హి లఙ్ఘనం నైవ కారయేత్
యే గుణా లఙ్ఘనే ప్రోక్తాస్తే గుణా లఘుభోజనే. 6

తా. చాల దుర్బలంగా ఉన్నవాణ్ణి లంఖణం పడుకోపెట్టకూడదు. లంఖణంలో చెప్పిన లాభాలన్నీ లఘుభోజనంలో కూడా ఉన్నాయి.

అనార్యేణ కృతఘ్నేన సంగతిర్మే న రోచతే
వినాశమపి కాఙ్క్షన్తి జ్ఞాతీనాం జ్ఞాతయః సదా. (రామా.) 7

తా. కృతఘ్నుడైన చెడ్డవానితో కలిసి ఉండడం నాకు ఇష్టం లేదు జ్ఞాతులు ఎల్లప్పుడూ జ్ఞాతుల వినాశాన్ని కోరుకొంటూ ఉంటారు.

అజారజః ఖరరజస్తథా సంమార్జనీరజః
దీపమఞ్చకయోశ్ఛాయా శక్రస్యాపి శ్రియం హరేత్. 8

తా. మేక ఎగరగొట్టిన దుమ్ము, గాడిద దుమ్ము, చీపురు దుమ్ము దీపం నీడా, మంచం నీడా ఇంద్రుని ఐశ్వర్యాన్నికూడా పోగొడతాయి.

అవిద్యాజీవనం శూన్యం దిక్ శూన్యా చేదబాన్ధవా
పుత్రహీనం గృహం శూన్యం సర్వశూన్యా దరిద్రతా. 9

తా. చదువులేని జీవితం శూన్యం. బంధువులు లేని దిక్కు శూన్యం. పుత్రులు లేని(పిల్లలులేని ఇల్లు)శూన్యం, దారిద్ర్యం ఉంటే అంతా శూన్యమే.

అప్రాప్తయౌవనా నారీ న కామాయ న శాన్తయే
సంప్రాప్తే షోడశే వర్షే గర్దభీ చాప్సరాయతే 10

అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే (భ.గీ.) 11

తా. లోకులందరూ నిన్ను గూర్చి చెడ్డగా చెప్పుకుంటారు. ఇంత కాలమూ గౌరవించబడినవానికి అపకీర్తి అనేది మరణంకంటె కూడా చాలా చెడ్డది.

అమ్లానో బలవాన్ శూరశ్ఛాయేవానుగతః సదా
సత్యవాదీ మృదుర్దాన్తః స రాజవసతిం వసేత్. 12

తా. తొందరగా అలిసిపోనివాడు, బలవంతుడు, శూరుడు, ఎల్లప్పుడూ నీడ వలె అనుసరించి ఉండేవాడు, సత్యం పలికేవాడూ, మృదుస్వభావం కలవాడు, ఆత్మసంయమనం కలవాడు-ఇలాంటివాడే రాజసేవ చెయ్యాలి

అన్యస్మిన్ ప్రేష్యమాణే తు పురస్తాద్యః సముత్పతేత్
అహం కిం కరవాణీతి స రాజవసతిం వసేత్. 13

తా. మరొకర్ని పనిమీద పంపుతున్నప్పుడు తాను ముందుగా లేచి "నన్ను ఏమి చేయమంటారు" అని అనేవాడే రాజసేవ చెయ్యాలి.

ఆ

ఆనందనామకపురే ద్రవిడస్య గేహే
చిత్రం వసిష్ఠవనితాసమమాజ్యపాత్రమ్,
విద్యుల్లతేవ పరినృత్యతి తత్ర దర్వీ
ధారాం విలోకయతి కశ్చన యోగసిద్ధః. 14

తా. ఆనందనగరంలో ఒక అరవవాని ఇంట్లో ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమి టంటే నేతిగిన్నె అరుంధతిలా ఉంటుంది దానిలో గరిటె మెరుపల్లా నాట్యంచేస్తుంది. దాన్నుంచిపడే నేతిదారను యోగసిద్ధి కలవాడు మాత్రమే చూడకలుగుతాడు.

ఆక్రుష్టేన మతిమతా తత్త్వార్థ విచారణే మతిః కార్యా
యది సత్యం కః కోపః స్యాదనృతం కిం ను కోపేన. (ఆర్యా)

తా. "నువ్వు ఇల్లాంటివాడవు, అలాంటి వాడవు" అని ఎవరైనా తిట్టినప్పుడు బుద్ధిమంతుడు ఒకమాటు యథార్థస్థితిని గూర్చి ఆలోచించుకోవాలి. "అతడు అన్నది నిజమే అయితే నాకు కోపం ఎందుకు రావాలి? అతడు నిజమే చెపుతున్నాడు కదా! నిజం కాకపోతే కోపం ఎందుకు? అత దన్నట్లుగా చెడ్డవాడను కాదు కదా".

ఆలస్యం త్యక్తవ్యం లౌల్యం లోభః పరాపవాదశ్చ
అస్థానేషు చ కోప స్తథాతిమానశ్చ పురుషేణ. (ఆర్యా) 16

తా. పురుషుడు సోమరితనాన్ని, చాపల్యాన్ని, దురాశను, ఇతర జననిందను, అనవసరంగాకోపాన్ని, అహంకారాన్ని విడిచిపెట్టాలి.

ఆరోగ్యం విద్వత్తా సజ్జనమైత్రీ మహాకులే జన్మ
స్వాధీనతా చ పుంసాం మహదైశ్వర్యం వినాప్యర్థైః(ఆర్యా) 17

తా. ఆరోగ్యము, పాండిత్యమూ, మంచివారితో స్నేహమూ, మంచి వంశంలో పుట్టుక, పరాధీనత్వం లేకపోవడమూ. ఇవి సజ్జనులు కోరుకొనే, ధనంతో సంబంధం లేని, గొప్ప ఐశ్వర్యం.

ఆదరేణ యథా స్తౌతి ధనవన్తం ధనేచ్ఛయా
తథా చేద్విశ్వకర్తారం కో న ముచ్యేత బన్ధనాత్. 18

తా. ధనం కోసం ధనవంతుణ్ణి ఆదరంతో ఏ విధంగా స్తుతిస్తాడో ఆ విధంగా పరమాత్మను స్తుతిస్తే మోక్షం పొందనివా డెవడుంటాడు!

ఆశా నామ మనుష్యాణాం కాచిదాశ్చర్య శృఙ్ఖలా
యయా బద్ధాః ప్రధావన్తి ముక్తాస్తిష్ఠన్తి పఙ్గువత్. 19

తా. మానవులకు ఆశ అనేది ఒక ఆశ్చర్యకర మైన సంకెల దీనితో కట్టబడ్డవాళ్లు ఊరికే పరుగెడుతూ ఉంటారు. దానిని విప్పేసుకొన్నవాళ్లు కుంటివాళ్ళ వలె ఒకచోట పడి ఉంటారు.

ఆత్మానం సతతం రక్షేద్దారైరపి ధనైరపి
పునర్దారాః పునర్విత్తం న శరీరం పునః పునః. 20

తా. భార్యనైనా, ధనాన్నైనా త్యజించి తనను రక్షించుకోవాలి. భార్య మళ్లీ లభించవచ్చు, ధనం మళ్లీ లభించవచ్చు. ఈ శరీరం మళ్లీమళ్లీ రాదు కదా.

ఆపదర్థే ధనం రక్షేద్దారాన్రక్షేద్ధనైరపి
ఆత్మానం సతతం రక్షేద్దారైరపి ధనైరపి. 21

తా ఆపత్సమయంలో అక్కరకు రావడం కోసం ధనం రక్షించుకోవాలి. భార్యను ధనం త్యజించైనా రక్షించాలి. భార్యను, ధనాన్ని పరిత్యజించి అయినా తనను రక్షించుకోవాలి.

ఆపదర్థే ధనం రక్షేద్దారాన్రక్షేద్ధనైరపి
ఆత్మనాపి కులం రక్షేద్దేశం రక్షేత్కులైరపి. (వృ.శ్రీ.రా.) 22

తా. ఆపదలలో అక్కరకి రావడానికి ధనం రక్షించుకోవాలి. ధనం విడిచిపెట్టైనా భార్యను రక్షించుకోవాలి. తను ప్రాణాలు త్యజించైనా కులాన్ని రక్షించాలి. కులాన్నైనా త్యజించి దేశం రక్షించాలి.

ఆపదర్థే ధనం రక్షేత్ శ్రీమతామాపదః కుతః
సా చేదపగతా లక్ష్మీః సంచితార్థోఽపి నశ్యతి. 23

తా ఆపదలలో అక్కరకురావడానికి ధనం రక్షించుకోవాలి. ఎందుచేతనంటే లక్ష్మి ఉన్నవాళ్లకి ఆపదలు రావు. ఆ లక్ష్మి తప్పుకున్నదా- సాధించిన పనులు కూడ చెడతాయి.

ఆచారప్రభవో ధర్మో నృణాం శ్రేయస్కరో మహాన్
ఇహలోకే పరా కీర్తిః పరత్ర పరమం సుఖమ్. 24

తా. ఆచారం (సత్ప్రవర్తనం) వల్ల ధర్మం జనిస్తుంది. అది మానవులకు చాలా శ్రేయస్కరం. ఇహలోకంలో గొప్ప కీర్తి లభిస్తుంది, పరలోకంలో గొప్ప సుఖం కలుగుతుంది.

ఆదిత్యాద్యా గ్రహాః సర్వే యథా తుష్యన్తి దానతః
సర్వస్వేఽపి స తుష్యేత జామాతా దశమో గ్రహః. 25

తా. రవిమొదలైన గ్రహాలన్నీ ఆ యా దానాలు చేస్తే సంతోషిస్తాయి. కాని అల్లుడనే దశమగ్రహానికి సర్వస్వమూ ఇచ్చివేసినా సంతోషం ఉండదు.

ఆసాద్యాపి మహోదధిం న వితృషో జాతో జలైర్బాడబో
మేఘం ప్రాప్య న చాతకోఽపి చరణౌ భానుం న లేభేఽరుణః,
చన్ద్రః శంకరశేఖరేఽపి నివసన్ పక్షక్షయే క్షీయతే
ప్రాయః సజ్జనసంగతౌ హి లభతే దైవానురూపం ఫలమ్. 26

తా. బడబాగ్ని మహాసముద్రంలో ఉన్నా ఉదకంచేత దాని దప్పిక తీరలేదు. మేఘాన్ని పొందినా చాతకపక్షి దప్పిక తీరలేదు. అరుణుడు సూర్యుణ్ణి ఆశ్రయించినా ఆతనికి పాదాలు రాలేదు. శివుని శిరోభూషణంగా ఉన్నా చంద్రుడు కృష్ణపక్షాంతంలో క్షీణిస్తూనే ఉన్నాడు. సజ్జనుల సంగతి లభించినా దైవం ఇచ్చిన ఫలం మాత్రమే లభిస్తుంది కాని అంతకంటె అధికం లభించదు.

ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం రహస్యం మన్త్రమౌషధమ్
తపో దానావమానే చ నవ గోప్యాని కారయేత్. 27

తా. వయస్సు, దనము, ఇంట్లోని లోపాలు, రహస్యవిషయం, మంత్రం, ఔషధం, తపస్సు దానం, అవమానం – ఈ తొమ్మిదీ రహస్యంగా ఉంచుకోవాలి.

ఆశైవ రాక్షసీ పుంసామాశైవ విషమఞ్జరీ
ఆశైవ జీర్ణమదిరా నైరాశ్యం పరమం సుఖమ్. 28

తా మానవులకు ఆశయే రాక్షసి. ఆశయే విషపుష్పాల గుత్తి ఆశే మగ్గిన పాత మద్యం, ఆశలేకపోవడమే గొప్ప సుఖం.

ఆత్మోత్కర్షం న మార్గేత పరేషాం పరినిన్దయా
స్వగుణైరేవ మార్గేత విప్రకర్షం పృథగ్జనాత్. (మ.భా.) 29

తా. ఇతరులనుగూర్చి తేలికగా మాట్లాడి తద్వారా తాను ఏదో గొప్పవాడన్నట్లు చెప్పుకోవడానికి ప్రయత్నించకూడదు. తనలో మంచి గుణాలేవైనా ఉంటే చూపి వాటి ద్వారా ఇతరులకంటె తన కున్న గొప్ప తనాన్ని నిరూపించడంకోసం ప్రయత్నించాలి.

ఆప్తద్వేషాద్భవేన్మృత్యుః పరద్వేషాద్ధనక్షయః
రాజద్వేషాద్భవేన్నాశో బ్రహ్మద్వేషాత్కులక్షయః. 30

తా. ఆప్తులను ద్వేషిస్తే మృత్యువు కలుగుతుంది. ఇతరులతో ద్వేషం పెట్టుకుంటే ధనం క్షీణిస్తుంది. రాజును ద్వేషిస్తే నాశం కలుగుతుంది. వేదవేత్తలను ద్వేషిస్తే కులం నశిస్తుంది.

ఆచార్యాత్పాదమాదత్తే పాదం శిష్యః స్వమేధయా
పాదం సబ్రహ్మచారిభ్యః పాదం కాలక్రమేణ తు. 31

తా. శిష్యుడు నాలుగు వంతుల చదువులో ఒక వంతు గురువునుండి నేర్చుకుంటాడు; ఒక వంతు తన బుద్ధిబలంవల్ల నేర్చుకుంటాడు; ఒక వంతు సహాధ్యాయులవల్ల నేర్చుకుంటాడు; ఒక వంతు కాలంగడిచిన కొలదీ నేర్చుకుంటాడు.

## ఇ

ఇదమేవ హి పాణ్డిత్యం చాతుర్యమిదమేవ హి
ఇదమేవ సుబుద్ధిత్వమాయాదల్పతరో వ్యయః. 32

తా. రాబడికంటె ఖర్చు చాలా తక్కువగా ఉండేటట్లు చూచుకొనడమే పాండిత్యం; ఇదే నేర్పు; ఇదే మంచి తెలివితేటలు కలవాని లక్షణం

ఇతరపాపఫలాని యథేచ్ఛయా
విలిఖితాని సహే చతురానన,
అరసికేషు కవిత్వనివేదనం
శిరసి మా లిఖ మా లిఖ మా లిఖ. 33

తా. ఓ! బ్రహ్మదేవుడా! నా నొసటమీద ఇతరమైన పాపాల ఫలాలు ఎన్ని వ్రాసినా వ్రాసుకో. రసికుడు కానివాని దగ్గరికి వెళ్లి కవిత్వం చెప్ప వలసిన పరిస్థితిని మాత్రం నా నొసటిమీద వ్రాయవద్దు, వ్రాయవద్దు వ్రాయవద్దు.

ఇతో భ్రష్టస్తతో భ్రష్టః పరమేకాన్తివేషభాక్
న సంసారసుఖం తస్య నైవ ముక్తిసుఖం భవేత్. 34

తా. కేవలం సంన్యాసివేషం ధరించినవానికి సంసారసుఖమూ ఉండదు మోక్షసుఖమూ ఉండదు, అతడు రెండు విధాలా చెడినవా డవుతాడు.

ఇన్ద్రం ద్వ్యక్షిధరం త్వమన్థముదధిం పఞ్చాననం పద్మజం
చాబ్ధిం స్వాదుజలం శివం సితగలం కామం చ సద్విగ్రహమ్,
శైలాన్ పక్షధరాంస్తథైవ చ హయాన్లక్ష్మీపతిం పిఙ్గలం
దృష్టం సర్వమిదం క్వచిన్న రఘురాడ్ దత్తం స్వయం హారితమ్

తా. (విభీషణునికి ఇచ్చేసిన లంకలో ఉన్న ఏదో అపురూపమైన వస్తువును చూచి దానిని తీసికొనివెళ్లాలని బుద్ధి కలిగిన లక్ష్మణునితోనో, రామునితోనో జాంబవంతు డన్నట్లుగా చమత్కారంకోసం చెప్పే శ్లోక మిది) ఓ! రాఘవా! రెండు కళ్ల ఉన్న దేవేంద్రుణ్ణి, మథించని సముద్రాన్ని, ఐదు ముఖాలున్న బ్రహ్మదేవుణ్ణి, మధురజలం ఉన్న సముద్రాన్ని, తెల్లని కంఠం ఉన్న శివుణ్ణి, మంచి శరీరం ఉన్న మన్మథుణ్ణి, రెక్కలున్న పర్వతాలనూ, గుఱ్ఱాలనూ, పచ్చని దేహం గల విష్ణువునూ, ఇలాంటివన్నీ చూచాను కాని ఇచ్చినదానిని మళ్లీ తీసికోవడం అనేది మాత్రం నే నెక్కడా చూడలేదు.

ఇక్షుదణ్డాస్తిలాః క్షుద్రాః కాన్తా హేమం చ మేదినీ
చందనం దధి తామ్బూలం మర్దనం గుణవర్ధనమ్. 36

తా. చెరకుకఱ్ఱలు, తిలలు, నీచులు, యువతి, బంగారం, భూమి, చందనం, పెరుగు, తాంబూలం వీటిని మర్దించిన కొలదీ గుణం పెరుగుతుంది.

ఇక్షోరగ్రాత్క్రమశః పర్వణి పర్వణి యథా రసవిశేషః
తద్వత్సజ్జనమైత్రీ విపరీతానాం తు విపరీతా. 37

తా. చెరకుకఱ్ఱ చివరినుంచి ప్రతికణుపుకీ రసం అధికం అవుతూ ఉన్నట్లు సజ్జనుల మైత్రి అధికం అవుతూ ఉంటుంది. దుర్జనుల మైత్రి దీనికి విపరీతం. చెరకుకఱ్ఱ మొదటి నుండి తినడం ప్రారంభిస్తే కణుపు కణుపుకీ రసం తగ్గినట్లు ఉంటుంది ఆ స్నేహం.

ఈ

ఈర్ష్యీ ఘృణీ త్వసంతుష్టః క్రోధనో నిత్యశఙ్కితః
పరభాగ్యోపజీవీ చ షడేతే దుఃఖభాగినః. 38

తా. అసూయకలవాడు, అతిగా జాలిపడేవాడు, సంతృప్తి లేనివాడు, కోపస్వభావం కలవాడు, ఎల్లప్పుడు శంకించేవాడు, ఇతరులమీద ఆధారపడి జీవించేవాడు ఈ ఆరుగురూ దుఃఖవంతులు.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా. (భ.గీ) 39

తా. అర్జునా! పరమేశ్వరుడు హృదయంలో కూర్చుండి, సకల ప్రాణులను కూడా యంత్రంమీద ఎక్కించి తిప్పుతున్నట్లు, మాయచేత తిప్పుతూ ఉంటాడు.

## ఉ

ఉత్తమః క్లేశవిక్షోభం క్షమః సోఢుం న హీతరః
మణిరేవ మహాశాణఘర్షణం న తు మృత్కణః 40

తా. కష్టాలవల్ల కలిగే క్షోభకి ఉత్తముడు మాత్రమే తట్టుకొనగలడు. సానమీద ఒరపును మాణిక్యమే సహించకలదు గాని మట్టిబెడ్డ సహించగలదా?

ఉత్తమే తు క్షణం కోపో మధ్యమే ఘటికాద్వయమ్
అధమే స్యాదహోరాత్రం చాణ్డాలే మరణాన్తికః. 41

తా. ఉత్తముని కోపం క్షణకాలం మాత్రమే ఉంటుంది. మధ్యముని కోపం రెండు ఘడియలు (48ని.) ఉంటుంది. అధముని కోపం ఒక రోజంతా ఉంటుంది. అధమాధముని కోపం చచ్చేవరకూ ఉంటుంది.

ఉత్థాయోత్థాయ బోద్ధవ్యం మహద్భయముపస్థితమ్
మరణవ్యాధిశోకానాం కిమద్య నిపతిష్యతి 42

తా. ప్రతిరోజూ లేవగానే-ఈ రోజు మహాభయం ఏది రాబోవుచున్నది మరణమా, వ్యాధియా, శోకమా అని ఆలోచించుకోవాలి.

ఉత్సవే వ్యసనే చైవ దుర్భిక్షే శత్రువిగ్రహే
రాజద్వారే శ్మశానే చ యస్తిష్ఠతి స బాన్ధవః. 43

తా. ఉత్సవాల సమయంలోను, కష్టాలు వచ్చినప్పుడు, దుర్భిక్షంలోను, శత్రువులతో విరోధం వచ్చినప్పుడూ, రాజద్వారంలోను (రాజగౌరవం పొందుతూన్నప్పుడు), శ్మశానంలోను ఎవడు విడవకుండా ఉంటాడో వాడే బంధువు.

ఉత్సాహసంపన్నమదీర్ఘసూత్రం
క్రియావిధిజ్ఞం వ్యసనేష్వసక్తమ్,
శూరం కృతజ్ఞం ధృఢసౌహృదం చ
లక్ష్మీః స్వయం మార్గతి వాసహేతోః. 44

తా ఉత్సాహవంతుడు, తెగూ తెంపూలేని ఆలోచనలు చేయనివాడు, పనులు చేసే పద్ధతి తెలిసినవాడు, దుర్వ్యసనాలు లేనివాడు, శూరుడు, కృతజ్ఞుడు, స్థిరమైన స్నేహం ఉన్నవాడూ అయినవానిదగ్గరికి లక్ష్మి వెదకుతూ వస్తుంది.

ఉద్యమేన హి సిద్ధ్యన్తి కార్యాణి న మనోరథైః
న హి సుప్తస్య సింహస్య ప్రవిశన్తి ముఖే మృగాః 45

తా ప్రయత్నం చేస్తే పనులు సిద్ధిస్తాయి కాని ఊరికే కోరికలు ఉన్నంతమాత్రాన సిద్ధించవు. సింహం నిద్రపోతూంటే మృగాలు వచ్చి దాని నోటిలో ప్రవేశించవు కదా ?

ఉద్యోగినం పురుషసింహముపైతి లక్ష్మీ
ర్దైవేన దేయమితి కాపురుషా వదన్తి,
దైవం నిహత్య కురు పౌరుషమాత్మశక్త్యా
యత్నే కృతే యది న సిధ్యతి కోఽత్ర దోషః. 46

తా. నిరంతరమూ ప్రయత్నం చేసేవానివద్దకు లక్ష్మి వచ్చి చేరుతుంది. అంతా ఇచ్చేది దైవమే అని తెలివితక్కువవాళ్లు అంటారు: దైవాన్ని అణగద్రొక్కి నీ శక్తితో పురుషప్రయత్నం చెయ్యి; ప్రయత్నం చేసినా పనిజరగకపోతే అప్పుడు నీ తప్పు ఏమీ ఉండదు.

ఉన్నత్యై నమతి ప్రభుం ప్రభుగృహాన్ ద్రష్టుం బహిస్తిష్ఠతి
స్వద్రవ్యవ్యయమాతనోతి జడధీరాగామివిత్తాశయా,
ప్రాణాన్ ప్రాణితుమేవ ముఞ్చతి రణే క్లిశ్నాతి భోగేచ్ఛయా
సర్వం తద్విపరీతమేవ కురుతే తృష్ణాన్ధదృక్ సేవకః. 47

తా. మూఢబుద్ధీ, దురాశచేత అంధుడూ అయిన సేవకుడు పైకి లేవాలనే కోరికతో ప్రభువుకు వంగి వంగి దండాలుపెడతాడు. ప్రభువుగారి ఇల్లు చూడా లని బైటే నిలబడతాడు ఎప్పుడో ధనం రాబోతుందని చేతిలో

ఉన్న ధనం ఖర్చుపెడతాడు. బ్రతకాలనే కోరికతో యుద్ధంలో ప్రాణాలు విడిచిపెడతాడు. భోగాలు అనుభవించాలని అనుకొంటూ కష్టపడుతూంటాడు. ఈ విధంగా ప్రతిదీ అనుకొన్నదానికి విపరీతంగానే చేస్తూ ఉంటాడు

ఉపకారిణి విశ్రబ్ధే శుద్ధమతౌ యః సమాచరతి పాపమ్
తం జనమసత్యసన్ధం భగవతి వసుధే కథం వహసి 48

తా. పూజ్యురాలవైన ఓ! భూదేవీ! పరిశుద్ధమైన మనస్సుతో, విశ్వాసవంతుడై ఉపకారం చేసిన వాని విషయంలో కూడా పాపం (అపకారం)చేసిన అసత్యసంధుణ్ణి (చెడ్డవాణ్ణి) నువ్వు ఎలా మోస్తున్నావో కదా! (లేదా-నువ్వు ఎందుకు మోస్తున్నావు?)

ఉపదేశో హి మూర్ఖాణాం ప్రకోపాయ న శాన్తయే
పయఃపానం భుజఙ్గానాం కేవలం విషవర్ధనమ్. 49

తా. మూర్ఖులకు సలహాలు ఇస్తే వాళ్ల రెచ్చిపోతారు కాని శాంతించరు. పాములకు పాలు పోస్తే వాటి విషమే పెరుగుతుంది.

ఉప్పణ్ణకజ్జే అఇచన్తన్తో గుణాగుణే తమ్మి
చిరఆలమన్దపేచ్ఛిత్తణేణ పురిసో హణఇ కజ్జం,
ఉత్పన్నార్థే కార్యేఽతిచిన్తయన్ గుణాగుణౌ తస్మిన్
చిరకాలమన్దప్రేక్షిత్వేన పురుషో హన్తి కార్యమ్ (గా స.శ.)50

తా. ఒకకార్యం వల్ల ఫలితం లభించేముందు దానిలోని మంచిచెడ్డలను గూర్చి ఎక్కువగా ఆలోచిస్తూ ఆలస్యం చేసేవాడు ఆ కార్యాన్ని చెడగొడతాడు.

ఉష్ట్రాణాం చ వివాహేషు గీతం గాయన్తి గర్దభాః
పరస్పరం ప్రశంసన్తి అహో రూపమహో ధ్వనిః. 51

తా. ఒంటెలకి పెళ్లి అవుతూంటే గాడిదలు గీతాలాపనం చేస్తున్నాయట "ఆహా! ఏమి సౌందర్యము" ."ఆహా! ఏమి కంఠమాధుర్యము" అని అంటూ పరస్పరము పొగుడుకొంటున్నాయి

ఉచ్చైరుద్ఘోష్య జేతవ్యం మధ్యస్థశ్చేదపణ్డితః
పణ్డితో యది తత్రైవ పక్షపాతోఽధిరోప్యతామ్ (సు.దీ.) 52

తా వాదాలలో న్యాయనిర్ణేతగా ఉన్నవాడు తెలివితక్కువవాడైతే గట్టిగా గొడవచేసి (బల్లగుద్ది వాదించి)జయం సంపాదించాలి. ఆతడు పండితుడే అయితే "అదుగో ఆయన పక్షపాతంతో వ్యవహరిస్తున్నాడు" అని ఆరోపించాలి.

ఉద్యన్తు శతమాదిత్యా ఉద్యన్తు శతమిన్దవః
న వినా విదుషాం వాక్యైర్నశ్యత్యాభ్యన్తరం తమః. 53

తా. నూరు సూర్యులు ఉదయించనీ; నూరు చంద్రులు ఉదయించనీ; విద్వాంసుల మాటలు వినకుండా లోపల ఉన్న అంధకారం (అజ్ఞానం) నశించదు.

ఉచ్చావచం జగద్దౌస్థ్యమేకదైవ నిషేధతి
ప్రవిష్టమాత్రో నృపతిః ప్రపఞ్చమివ నః శ్రుతిః (సు.దీ) 54

తా. ఉపనిషత్తు మన ప్రపంచాన్నంతా నిషేధించినట్లు (ప్రపంచం అసత్య మని బోధించినట్లు) మంచి రాజు (పరిపాలకుడు) కార్యరంగంలో ప్రవేశించగానే లోకంలో ఉన్న దుష్ప్రవర్తనను అంతనీ ఒక్కమారుగా నివారిస్తాడు

ఉపరుద్ధన్తి శ్వాసాన్ మునయో నాశ్నన్తి న పిబన్తి
స్తూయన్తే కిం మునయః కణ్ఠే కుర్వన్తి కనకపాశమిమమ్. 55

తా. మునీశ్వరులు ప్రాణాయామం అభ్యసించి శ్వాస నిరోధిస్తారు. ఆహారం తినరు. నీళ్లు త్రాగరు. అయితే మాత్రం వీళ్లని స్తోత్రం చెయ్యడం ఎందుకు? ఎందుచేతనంటే వీళ్లు బంగారు పాశాన్ని కంఠానికి తగలుచ్చుకొంటున్నారు.

మును లనుకొనేవాళ్లు ఎంతో కష్టపడి పుణ్యం సంపాదించుకుంటున్నారు. పాపం ఏ విధంగా బంధానికి హేతువో పుణ్యం కూడా

అలాగే బంధానికి హేతువు. పాపం చేసినవాడు కష్టాలు అనుభవించడానికి మళ్లీ జన్మలు ఎత్తవలసి వస్తే పుణ్యం చేసినవాళ్లు సుఖం అనుభవించడానికి మళ్లీ జన్మలు ఎత్తవలసి వస్తుంది. అందుచేత పాపం ఇనుపసంకెళ్లు అయితే పుణ్యం బంగారు సంకెళ్లు అని మోక్షశాస్త్రజ్ఞులు చెపుతారు.

ఉత్తమేనోత్తమం సర్వం మనుష్యాణాం ప్రయత్నతః
అదృష్టమీక్ష్య సర్వేషాం వక్తవ్యం సువిచక్షణైః. 56

తా. ఉత్తమప్రయత్నం చేసినకొలదీ ఉత్తమఫలం లభిస్తుంది. అందుచేత తెలివైనవాళ్లు అందరికీ అదృష్టాన్ని గూర్చి చెప్పేటప్పుడు ఈ విషయం పరిశీలించి చెప్పాలి.

ఉద్యోగః కలహః కణ్డూర్ద్యూతః మద్యం పరస్త్రియః
ఆహారో మైథునం నిద్రా సేవనాత్తు వివర్ధతే. 57

తా. ఏదో ఒక పని (ప్రయత్నం) చేయడం, కలహం, దురద, జూదం, మద్యం, పరస్త్రీలు, ఆహారం, మైథునం, నిద్ర-ఇవి సేవిస్తూన్న కొలదీ వృద్ధి చెందుతాయి

ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనోబన్ధురాత్మైవ రిపురాత్మనః. 58

తా. తనను తానే ఉద్ధరించుకోవాలి. తనను దిగజారనీయకూడదు. తనకు బంధువు తానే. తనకు తానే శత్రువు.

ఉత్తమం ప్రణిపాతేన శూరం భేదేన యోజయేత్
నీచమల్పప్రదానేన ఇష్టం ధర్మేణ యోజయేత్. 59

తా. ఉత్తమపురుషుణ్ణి లొంగదీసుకోవడానికి నమస్కారం చెయ్యాలి. శూరుణ్ణి భేదోపాయంచేత లొంగదీసుకోవాలి. నీచుణ్ణి ఏదో కొంచెం ముట్టచెప్పి లొంగదీసుకోవాలి. ఇష్టుణ్ణి ధర్మమార్గంలో నడిపించాలి.

ఉద్యోగః ఖలు కర్తవ్యః ఫలం మార్జారవద్భవేత్
జన్మప్రభృతి గౌర్నాస్తి పయః పిబతి నిత్యశః 60

తా. మానకుండా ప్రయత్నంచేస్తూనే ఉండాలి. ఫలమా, పిల్లికి లభించినట్టు లభిస్తుంది. పుట్టినది మొదలు, దానికి ఆవు లేదు; పాలు మాత్రం రోజూ త్రాగుతూనే ఉంటుంది.

ఉత్పద్యన్తే విలీయన్తే దరిద్రాణాం మనోరథాః
బాల్యే వైధవ్యదగ్ధానాం కులస్త్రీణాం కుచావివ 61

తా. దరిద్రుల కోరికలు పుడుతూ ఉంటాయి అణిగిపోతూ ఉంటాయి!

ఉత్తమా ఆత్మనా ఖ్యాతాః పిత్రా ఖ్యాతాస్తు మధ్యమాః
మాతులేనాధమాః ఖ్యాతాః శ్వశురేణాధమాధమాః. 62

తా. తమ శక్తిచేత ప్రసిద్ధి సంపాదించినవాళ్లు ఉత్తములు. తండ్రి ద్వారా ప్రసిద్ధి చెందినవాళ్లు మధ్యములు. మేనమామను పట్టి ప్రసిద్ధి పొందిన వాళ్లు అదములు. మామగారి ద్వారా ప్రసిద్ధి పొందినవాళ్లు అధమాదములు.

ఉభౌ శుక్లౌ పక్షౌ భువి వియతి చావారితగతిః
సదా మీనం భుఙ్క్తే వసతి సకలస్థాణుశిరసి,
బకే సర్వశ్చాన్ద్రో విలసతి గుణః కించిదధికః
గుణాః స్థానే పూజ్యా నరవర న తు స్థానవికలాః. 63

తా. ఓ! రాజా! గుణాలైనంతమాత్రాన ప్రయోజనం లేదు; ఆ గుణాలు మంచి స్థానంలో ఉంటేనే పూజించదగినవి ఔతాయి కాని చెడ్డ స్థానంలో ఉంటే పూజనీయాలు కావు. చంద్రుడిలో ఉన్న గుణాలన్ని కొంగ లోనూ ఉన్నాయి; ఇంకా ఎక్కువగానే కూడా ఉన్నాయి. చంద్రునికి ఒక పక్షమే శుక్లపక్షం; కొంగకి రెండు పక్షాలూ (ఇక్కడ రెక్కలు) తెల్లవే (శుక్ల పక్షాలే). చంద్రుడు ఆకాశంమీద మాత్రమే సంచరిస్తే దీనికి ఆకాశంమీదా నేలమీదా అడ్డులేని గమనశక్తి ఉంది చంద్రుడు సంవత్సరానికి ఒకమాసం

మీనాన్ని (మీనరాశిని) అనుభవిస్తాడు. ఇది రోజూ మీనాన్ని (చేపను) తింటుంది. చంద్రుడు ఒక్క స్థాణువు (శివుని) శిరస్సుమీదనే ఉంటే ఇది అన్ని స్థాణువుల (రాతిబండల) మీద కూర్చుంటుంది. ఐతేనేం చంద్రుని కున్న పూజనీయత్వం కొంగకి ఉన్నదా ?

ఉద్యోగే నాస్తి దారిద్ర్యం జపతో నాస్తి పాతకమ్
మౌనినః కలహో నాస్తి న భయం చాస్తి జాగ్రతః. **64**

తా. ప్రయత్నం చేస్తూఉంటే దారిద్ర్యం ఉండదు. జపం చేసుకొంటే పాపాలు దరికి చేరవు మౌనంగా ఉండేవానికి ఎవరితోనూ కలహమే ఉండదు. మెలకువతో ఉండేవానికి భయం ఉండదు.

ఉత్ఫుల్లగల్లైరాలాపాః క్రియన్తే దుర్ముఖైః సుఖమ్
జానాతి హి పునః సమ్యక్ కవిరేవ కవేః శ్రమమ్. **65**

తా చెడ్డనోరువాళ్లు బుగ్గలు ఉబ్బేటట్లు నవ్వుతూ సుఖంగా కబుర్లు చెపుతూ ఉండవచ్చు. అయితే కవిత్వం వ్రాయడానికి కవి ఎంత శ్రమపడాలో అది కవికే తెలియాలి

ఉదారస్య తృణం విత్తం శూరస్య మరణం తృణమ్
విరక్తస్య తృణం భార్యా నిఃస్పృహస్య తృణం జగత్. **66**

తా. ఔదార్యవంతునికి ధనం గడ్డిపరక. శూరునికి మరణం గడ్డిపరగ వైరాగ్యవంతునికి భార్య గడ్డిపరక. ఆశ లేనివానికి జగత్తు గడ్డిపరక.

ఉర్వ్యాం కోఽపి మహీధరో లఘుతరో దోర్భ్యాం ధృతో లీలయా
తేన త్వం దివి భూతలే చ సతతం గోవర్ధనోద్ధారకః,
త్వాం త్రైలోక్యధరం వహామి కుచయోరగ్రే న తద్గణ్యతే
కిం వా కేశవ భాషణేన బహునా పుణ్యైర్యశో లభ్యతే **67**

తా. నేలమీద నిలబడి బాగా తేలికయైన ఏదో ఒక పర్వతాన్ని రెండుచేతులతోను ఎత్తి విలాసంగా మోశావట! దానితో నీకు భూలోకంలోను,

స్వర్గలోకంలోను కూడా "గోవర్ధనోద్ధారకుడు" అనే పేరు వచ్చింది. మూడు లోకాలు పొట్టలో పెట్టుకొని ఉన్న నిన్ను నేను కుచాగ్రాలమీద మోస్తున్నాను; అయినా ఎవరూ ఆ విషయం చెప్పుకోవడమే లేదు. కృష్ణా! ఎక్కువ మాటలాడి ఏం ప్రయోజనం! కీర్తి రావాలంటే పుణ్యం ఉండాలి!

ఉపమా కాళిదాసస్య భారవేరర్థగౌరవమ్
దణ్డినః పదలాలిత్యం మాఘే సన్తి త్రయో గుణాః. 68

తా. కాళిదాసు కావ్యాలలోని ఉపమాసౌందర్యం, భారవిరచనలలో ఉన్న అర్థగాంభీర్యం దండి రచనలలో ఉన్న పదలాలిత్యం ఈ మూడు గుణాలు మాఘునిలో ఉన్నాయి. లేదా కాళిదాసు ఉపమాలంకారాలు చాలా సుందరమైనవి. భారవిరచనల్లో అర్థగాంభీర్యం అధికంగా ఉంటుంది. దండి రచనలలో పదలాలిత్యం ఉన్నది. మాఘుని రచనలో ఈ మూడుగుణాలు కూడా ఉన్నాయి.

ఉపసర్గేఽన్యచక్రే చ దుర్భిక్షే చ భయావహే
అసాధుజనసంసర్గే యః పలైతి స జీవతి. 69

తా. దేశోపద్రవం కలిగినప్పుడు, శత్రువుల రాజ్యంలోను, భయంకరమైన దుర్భిక్షసమయంలోను, చెడ్డవారితో సంబంధం ఏర్పడినప్పుడు ఎవడు మరణిస్తాడో అతడే జీవించి ఉన్నవాడు (అలాంటి పరిస్థితులలో జీవించడంకంటె మరణించడమే మేలు).

ఉషఃకాలశ్చ గర్గశ్చ శకునం చ బృహస్పతిః
అఙ్గిరాశ్చ మనోత్సాహో విప్రవాక్యం జనార్దనః. 70

తా. గర్గాచార్యుని ప్రకారం ప్రయాణానికి ఉషఃకాలం మంచిది. బృహస్పతి మతం ప్రకారం మంచి శకునం చూచుకొని వెళ్లాలి. అంగిరస్సు అభిప్రాయం ప్రకారం మనస్సు ఉత్సాహంగా ఉంటే బయలుదేరడమే. జనార్దనుని మతం ప్రకారం బ్రాహ్మణవాక్యం అనుకూలంగా ఉంటే వెళ్లాలి.

ఉపాధ్యాయశ్చ వైద్యశ్చ ఋతుకాలే వరాఙ్గనా
సూతికా దూతికాచైవ కార్యాన్తే తృణవత్ స్మృతాః. 7

తా. ఉపాధ్యాయుడు, వైద్యుడు, మంత్రసాని, దూతిక వీళ్లు పని అయిపోయిన తరవాత గడ్డి పరకవంటి వాళ్లు అయిపోతారు అని చెపుతారు

ఉపాయానాం చ సర్వేషాముపాయః పణ్యసంగ్రహః
ధనార్థే యస్య తే హ్యేక స్తదన్యః సంశయాత్మకః. 7

తా. ధనం సంపాదించే ఉపాయా లన్నింటిలోకీ అమ్మడానికి సరుకు ప్రోగుచేయడం మంచి ఉపాయం. మిగిలిన ఉపాయా లన్నీ తప్పకుండా ధనార్జనకి ఉపయోగిస్తాయనే నమ్మకం లేదు.

## ఏ

ఏకం దృష్ట్వా శతం దృష్ట్వా దృష్ట్వా పఞ్చశతాన్యపి
అతిలోభో న కర్తవ్యశ్చక్రం భ్రమతి మస్తకే.

తా. ఒకటి చూచినా, వంద చూచినా, ఐదువందలు చూచినా అతి లోభం పనికిరాదు. చక్రం తలమీదనే తిరుగుచున్నది ఏ క్షణంలో తల పడుతుందో తెలియదు.

ఏకాక్షరప్రదాతారం యో గురుం నాభినన్దతి
శ్వానయోనిశతం భుక్త్వా చాణ్డాలేష్వభిజాయతే.

తా. ఒకే అక్షరం నేర్పిన గురువునైనా గౌరవించనివాడు నూరుకుక్క జన్మలు ఎత్తి మరల నీచమానవ జన్మలు ఎత్తుతాడు.

ఏకమేవాక్షరం యస్తు గురుః శిష్యం ప్రబోధయేత్
పృథివ్యాం నాస్తి తద్ద్రవ్యం యద్దత్త్వా చానృణీ భవేత్.

తా. గురువు ఒకే అక్షరం శిష్యునికి నేర్పినా ఆ గురువుకి ఏ ద్రవ్యం ఇవ్వడం చేత శిష్యుడు ఋణవిముక్తుడౌతాడో అట్టి ద్రవ్యం ఈ పృథివిలో లేదు.

ఏక స్తపో ద్విరధ్యాయీ త్రిభిర్గానం చతుష్పథః
పఞ్చ సప్త కృషిశ్చైవ సంగ్రామం బహుభిర్జనైః. 76

తా. ఒక్కడే కూర్చుని తపస్సు చెయ్యాలి. ఇద్దరు కలిసి చదువుకోవాలి. ముగ్గురు కలిసి గానం చెయ్యాలి లేదా నేర్చుకోవాలి. ఎక్కడికైనా వెళ్లేటప్పుడు నలుగురు కలిసి వెళ్లాలి. ఐదుగురు లేదా ఏడుగురు కలిసి వ్యవసాయం చెయ్యాలి. చాలామంది కలిసి యుద్ధం చెయ్యాలి.

ఏకో దేవః కేశవో వా శివో వా
ఏకా నారీ సున్దరీ వా దరీ వా,
ఏకం మిత్రం భూపతిర్వా యతిర్వా
ఏకో వాసః పత్తనే వా వనే వా. 77

తా. శివుడో కేశవుడో ఒకడే దేవుడు. అనగా సేవిస్తే శివుణ్ణి సేవించాలి లేదా కేశవుణ్ణి సేవించాలి. చేస్తే సుందరితో కాపురం చెయ్యాలి లేకపోతే గుహలో నివసించాలి. స్నేహం చేస్తే రాజుతో చెయ్యాలి అలా కాక పోతే యతితో చెయ్యాలి. నివసిస్తే నగరంలో నివసించాలి, లేకపోతే వనంలో నివసించాలి.

ఏకోఽపి గుణవాన్ పుత్రో నిర్గుణైః కిం శతైరపి
ఏకశ్చన్ద్రో జగచ్చక్షుర్నక్షత్రైః కిం ప్రయోజనమ్. 78

తా. గుణవంతుడైన పుత్రుడు ఒక్కడున్నా చాలు, గుణ విహీనులు వందమంది ఉంటే మాత్రం ఏమి ప్రయోజనం? ఒక్క చంద్రుడు జగత్తు కంతకీ నేత్రంలాగ ఉపయోగిస్తాడు. అన్ని నక్షత్రాలు ఉంటేఏమి ప్రయోజనం?

ఏకో వటుర్దర్భకుశాగ్రపాణి-
ర్వనే వనైః సిఞ్చతి బాలచూతాన్,
ఆమ్రాశ్చ సిక్తాః పితరశ్చ తృప్తా
ఏకా క్రియా ద్వ్యర్థకరీ బభూవ. 79

తా. ఒక బ్రహ్మచారి దర్భలు చేతిలో ధరించి వనంలో లేత మామిడి చెట్లకు నీళ్లు పోస్తున్నాడు. మామిడి చెట్లూ తడుస్తున్నాయి, పితృదేవతలూ తృప్తి చెందుతున్నారు. ఒకే పనివల్ల రెండు ప్రయోజనాలు లభించాయి.

ఏక ఏవ స భుఞ్జీయాద్యదిచ్ఛేచ్ఛుభమాత్మనః
ద్విత్రిభిర్బహుభిః సార్ధం భోజనం కారయేన్నరః. 80

తా. తనకి మంచి కలగాలని కోరుకొనేవాడు ఒంటరిగా తినగూడదు. మానవుడు ఇద్దరితో గాని ముగ్గురితోగాని ఇంకా చాలామందితోగాని కలిసి భోజనం చెయ్యాలి.

ఏకః స్వాదు న భుఞ్జీత నైకః సుప్తేషు జాగృయాత్
ఏకో న గచ్ఛేదధ్వానం నైకశ్చార్థాన్ ప్రచిన్తయేత్. 81

తా. మధుర పదార్థాన్ని ఒక్కడే తినకూడదు. అందరూ నిద్రపోతూ ఉంటే ఒక్కడే మేల్కొని ఉండ గూడదు. ఒంటరిగా దారిలో ప్రయాణం చెయ్యగూడదు. ఒంటరిగా విషయాలను గూర్చి ఆలోచించగూడదు.

ఏకః పాపాని కురుతే ఫలం భుఙ్క్తే మహాజనః
భోక్తారో విప్రముచ్యన్తే కర్తా దోషేణ లిప్యతే. 82

తా. ఒక్కడు పాపకార్యం చేస్తాడు; దానివల్ల వచ్చే ఫలితాన్ని చాలామంది అనుభవిస్తారు. వాళ్లకి పాపం ఏమీ అంటదు కాని ఆ పని చేసినవాడికి మాత్రమే ఆ పాపం మిగులుతుంది.

ఏకస్య కర్మ సంవీక్ష్య కరోత్యన్యోఽపి గర్హితమ్
గతానుగతికో లోకో న లోకః పారమార్థికః. 83

తా. ఒకడు చెడ్డ పని చేస్తూంటే చూచి రెండోవాడు కూడ అలాంటి పనే చేస్తాడు. ఒకడు ఎలా వెడితే అలా వెళ్లడమే కాని లోకం యథార్థాన్ని పరిశీలించదు.

ఏకేన తిష్ఠతాధస్తాదన్యేనోపరి తిష్ఠతా
దాతృయాచకయోర్భేదః కరాభ్యామేవ సూచితః. 84

తా. ఒకచెయ్యి కింద ఉంటూన్నది, మరొక చెయ్యిపైన ఉంటూన్నది. దానంచేసే వానికీ, ప్రతిగ్రహించే వానికీ ఉన్న బేధం ఈ చేతులస్థితిని పట్టే తెలుస్తుంది.

## క

కార్యా భజతే లోకే యావత్కార్యం న సిధ్యతి
ఉత్తీర్ణే చ పరే పారే నౌకాయాః కిం ప్రయోజనమ్. 85

తా. ఏదో పని కావలసినవాడు ఆ పని అవనంతవరకు సేవ చేస్తూ ఉంటాడు, అవతలి ఒడ్డుకు చేరుకొన్న తరవాత ఇంక నావ ఎందుకు ?

కార్పాసం కటినిర్ముక్తం కౌశేయం భోజనావధి
ఊర్ణవస్త్రం సదా శుద్ధం ఊర్ణా వాతేన శుధ్యతి. 86

తా. నూలుబట్ట కట్టి విడిచే వరకు మడి. పట్టుబట్ట భోజనం చేసేటంతవరకూ మడి. ఉన్నిబట్ట ఎప్పుడూ మడే. ఎందుచేతనంటే ఉన్ని గాలికి పవిత్రం అవుతుంది.

కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే
ఏతి జీవన్తమానన్దో నరం వర్షశతాదపి. (రామా) 87

తా. మనిషి జీవించి ఉంటే నూరు సంవత్సరాలకైనా ఆనందం లభిస్తుంది అనే ఈ లోకోక్తి చాల ఉత్తమమైన దని నాకు తోస్తూన్నది.

కష్టం ఖలు మూర్ఖత్వం కష్టం ఖలు యౌవనేషు దారిద్ర్యమ్
కష్టాత్కష్టతరం కిం పరగృహవాసః పరాన్నం చ. 88

తా. మూర్ఖత్వం కష్టమైనది. యౌవనంలో దరిద్రుడుగా ఉండడం కష్టమైనది. కష్టం కంటె కష్టం ఏమిటంటే పరగృహవాసమూ, పరాన్నం తినడమూను.

కలహాన్తాని హర్మ్యాణి కువాక్యాన్తం చ సౌహృదమ్
కురాజాన్తాని రాష్ట్రాణి కుకర్మాన్తం యశో నృణామ్. 89

తా. పెద్ద పెద్ద భవనాలు కలహంతో నశిస్తాయి. ఒక్క పరుష వాక్యం పలుకుతే చాలు దానితో స్నేహం ఆఖరు. చెడ్డ పరిపాలకుడు వస్తే రాష్ట్రం నశిస్తుంది, మానవుల యశస్సు ఒక్క చెడ్డ పని చేస్తే నశిస్తుంది

కస్య దోషః కులే నాస్తి వ్యాధినా కో న పీడితః,
వ్యసనం కేన న ప్రాప్తం కస్య సౌఖ్యం నిరన్తరమ్. 90

తా. ఏదో దోషం లేని కులం ఎవరిది ఉంటుంది. ? వ్యాధితో బాధ పడనివాడు ఎవడు ? ఎవరికైనా కష్టాలు రాకుండా ఉంటాయా? ఎల్లప్పుడూ సౌఖ్యమే అనుభవించేవాడు ఎవడు?

కో హి భారః సమర్థానాం కిం దూరం వ్యవసాయినామ్
కో విదేశః సువిద్యానాం కః పరః ప్రియవాదినామ్. 91

తా. సమర్థులకు చేయ శక్యం కానిదంటూ ఏదైనా ఉంటుందా? నిరంతరం ఉద్యమం చేసే వాళ్ళకి దూరం ఏమిటి ? మంచి విద్య కలవాళ్లకి విదేశం ఏమిటి ? ప్రియంగా మాటలాడే వాళ్ళకి పరాయివాడు ఎవడు ?

కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి. (భ.గీ.) 92

తా. జనకుడు మొదలైన వాళ్ళు ఎంత మహాజ్ఞానులైనా కర్మ ఆచరించడం చేతనే సిద్ధిని పొందారు. లోక సంగ్రహం కోసమైనా (లోకానికి దారి చూపడం కోసమైనా) నువ్వు కర్మ చెయ్యాలి.

కస్త్వం కోఽహం కుత ఆయాతః కా మే జననీ కో మే తాతః
ఇతి పరిభావయ సర్వమసారం సర్వం త్యక్త్వా స్వప్నవిచారమ్

తా. స్వప్న దర్శనం వంటి ఈ సంసారం అంతా సారవిహీనమైన దని తెలుసు కొని "నేను ఎవరిని" "ఎక్కడనుంచి వచ్చాను?" "నా తల్లి ఎవరు ?" "తండ్రి ఎవరు ?'' అని ఆలోచించుకో.

కర్తా కారయితా చైవ ప్రేరకో హ్యనుమోదకః
సుకృతే దుష్కృతే చైవ చత్వారః సమభాగినః. 94

తా. పుణ్యంలో అయినా పాపంలో అయినా చేసినవాడు, చేయించిన వాడు, చేయుమని ప్రోత్సహించినవాడు, "చాలా బాగా చేశావు'' అని అను మోదించినవాడు – వీళ్ల నలుగురూ ఫలాన్ని సమంగా పంచుకొంటారు.

కృతే చ రేణుకా శక్తిః త్రేతాయాం జానకీ తథా
ద్వాపరే ద్రౌపదీ శక్తిః కలౌ శక్తిర్గృహే గృహే. 95

తా. కృతయుగంలో రేణుక శక్తిరూపిణి. త్రేతాయిగంలో సీత శక్తిరూపిణి ద్వాపరయుగంలో ద్రౌపది శక్తిరూపిణి. కలియుగంలో ఇంటింటా శక్తిరూపిణు లున్నారు

కర్తుమకర్తుం శక్తః సకలం జగదేతదన్యథాకర్తుమ్
యస్తం విహాయ రామం కామం మా దేహి మానసాన్యస్మిన్.

తా. ఓ! మనస్సా! ఏ రాముడు ఈ జగత్తును సృష్టించడానికి గాని; సృష్టించకుండా ఉండడానికి గాని, మరొక విధంగా చేయడానికి గాని సమర్థుడో ఆ రాముణ్ణి కాదని మరొకరి మీద ఎవరిమీదా ఆసక్తి చూపకు

కృతే తు మానవా ధర్మాస్త్రేతాయాం గౌతమాః స్మృతాః
ద్వాపరే శఙ్ఖలిఖితౌ కలౌ పారాశరస్మృతిః. 97

తా. కృతయుగంలో మనుస్మృతిలో చెప్పిన ధర్మాలు ఆచరించేవారు. త్రేతాయుగంలో గౌతమ స్మృత్యుక్త ధర్మాలు, ద్వాపరయుగంలో శంఖ లిఖితులు వ్రాసిన స్మృతిలో చెప్పిన ధర్మాలు, కలియుగంలో పరాశర స్మృతిలో చెప్పిన ధర్మాలు ఆచరణలో ఉంటాయి.

క్వచిద్దన్తాలకో మూర్ఖః క్వచిద్గానవతీ సతీ
క్వచిత్కాలో భవేత్సాధుః ఖల్వాటో నిర్ధనః క్వచిత్. 98

తా. మంచి పలువరస ఉన్న వాళ్ళలో మూర్ఖుడు ఉండడం అరుదు. మంచి గానం చేయ గలిగిన వారిలో సతి ఉండడం, నల్లనివాడు సత్పురుషుడుగా ఉండడం, బట్టతలవాడు దరిద్రుడవడం అరుదు.

కవయః కిం న పశ్యన్తి కిం న కుర్వన్తి దుర్జనాః
మద్యపాః కిం న జల్పన్తి కిం న భక్షన్తి వాయసాః. 99

తా. కవులు చూడలేనిది ఏమున్నది ? దుర్జనులు చేయని చెడ్డ పని ఏది? మద్యం త్రాగిన వాళ్ళు ఏమి పేలరు? కాకులు తిననిది ఏమున్నది?

కాకః కృష్ణః పికః కృష్ణః కో భేదః పికకాకయోః
వసన్తసమయే ప్రాప్తే కాకః కాకః పికః పికః. 100

తా. కాకి నల్లగనే ఉంటుంది, కోకిలా నల్లగానే ఉంటుంది, కాకికీ కోకిలకు తేడా ఏమిటి ? వసంతఋతువు వచ్చినప్పుడు కాకి కాకే కోకిల కోకిలే.

కాకతాలీయవత్ప్రాప్తం దృష్ట్వాపి నిధిమగ్రతః
న స్వయం దైవమాదత్తే పురుషార్థముపేక్షతే 101

తా. కాకతాలీయంగా (అనుకోకుండా) ఏదైనా నిధి ఎదుట కనబడినా దాన్ని తీసికోవడానికి పురుష ప్రయత్నం చెయ్యాలి కాని దైవం తీసి ఇవ్వదు.

కాలః పచతి భూతాని కాలః సంహరతే ప్రజాః
కాలః సుప్తేషు జాగర్తి కాలో హి దురతిక్రమః. 102

తా. కాలం ప్రాణుల్ని వండేస్తుంది. కాలమే ప్రజల్ని సంహరిస్తుంది. అందరూ నిద్రపోతూ ఉంటే కాలం (మెళకువగా) ఉంటుంది. కాలాన్ని ఎవరూ దాటలేరు.

కావ్యశాస్త్రవినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్
వ్యసనేన తు మూర్ఖాణాం నిద్రయా కలహేన వా. 103

తా. ధీమంతులు కావ్యశాస్త్ర వినోదంతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. మూర్ఖులు దుర్వ్యసనాలతోనో నిద్రతోనో, కలహంతోనో కాలం వెళ్ళబుచ్చుతూ ఉంటారు

క్వ భిక్షా దుర్భిక్షే మిలతి, దురవస్థాః కథమృణం
లభన్తే, కర్మాణి ద్విజపరివృఢాన్ కారయతి కః,
అదత్త్వైవ గ్రాసం గ్రహపతిరసావస్తమయతే
క్వ యామః కిం కుర్మో గృహిణి గహనో జీవనవిధిః. 104

తా ఓ పత్నీ! ఈ దుర్భిక్షసమయంలో భిక్ష ఎక్కడ దొరుకుతుంది? దరిద్రులకు అప్పు ఎవరిస్తారు? బ్రాహ్మణులచేత పని ఏవరు చేయించుకుంటారు? ఆహారం చూపించకుండానే సూర్యుడు అస్తమిస్తున్నాడు. జీవన విధానం చాలా కష్టంగా ఉంది. మనం ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలి; ఏం చెయ్యాలి ?

కిం తయా సుమహత్యాపి శ్రియా దేశాన్తరస్థయా
రిపవో యాం న పశ్యన్తి సుహృద్భిర్యా న భుజ్యతే. 105

తా. దేనిని శత్రువులు చూడరో (చూచి అసూయపడరో) దేన్ని స్నేహితులు అనుభవించరో అలాంటి ఐశ్వర్యం దేశాంతరంలో ఎంత ఉంటే మాత్రం ఏమి ప్రయోజనం ?

క్రియాయాస్తు గుణాలాభే క్రియామన్యాం ప్రయోజయేత్
పూర్వస్యాం శాన్తవేగయాం న క్రియాసంకరో హితః. 106

తా. (బహుశా ఇది వైద్యానికి సంబంధించిన శ్లోకం అయి ఉంటుంది) ఒక చికిత్సవల్ల ప్రయోజనం లేకపోతే దాని వేగం తగ్గిన తరవాత మరొక చికిత్స చెయ్యాలి రెండు క్రియలు (చికిత్సలు) ఒకేసారి చెయ్యకూడదు.

కాలః సమవిషమకరః పరిభవసంమానకారకః కాలః
కాలః కరోతి పురుషం దాతారం యాచితారం చ. 107

తా. జీవితంలో ఎగుడు దిగుడులు కలిగించేది కాలమే. కాలమే అవమానాన్ని సంమానాన్ని కలగజేస్తూ ఉంటుంది. దాతగా ఉన్న పురుషుణ్ణి యాచించే వానినిగా చేస్తుంది కాలం.

కావ్యేషు నాటకం రమ్యం తత్రాపి చ శకుంతలా
తత్రాపి చ చతుర్థోఽఙ్కః తత్ర శ్లోకచతుష్టయమ్. 108

తా. అన్ని కావ్యాలలోకీ రమ్యమైనది నాటకం. నాటకాలలో రమ్యమైనది శాకుంతలం. దానిలో రమ్యమైనది నాల్గవ అంకం. అందులో కూడా ("యాస్యత్యద్య" "పాతుం న ప్రథమమ్" "అస్మాన్ సాధు" "శుశ్రూషస్వ" ఇత్యాది) నాలుగు శ్లోకాలు రమ్యమైనవి

కాలే వాప్యథవాకాలే సంధ్యావందనతత్పరః
అవిద్యో వా సవిద్యో వా బ్రాహ్మణో మామకీ తనుః. 109

తా. విద్యావంతుడైనా విద్యావిహీనుడైనా బ్రాహ్మణుడు కాలంలో అయినా అకాలంలో అయినా సంధ్యావందనం శ్రద్ధగా చేస్తే అతడు నా (మహావిష్ణువు) దేహమే

విజేతవ్యా లఙ్కా చరణతరణీయో జలనిధిః
విపక్షః పౌలస్త్యో రణభువి సహాయాశ్చ కపయః,
తథాప్యేకో రామః సకలమవధీద్రాక్షసకులం
క్రియాసిద్ధిః సత్త్వే వసతి మహతాం నోపకరణే. 110

జయించవలసినది లంక. సముద్రాన్ని కాలినడకచేత దాటాలి. శత్రువా రావణాసురుడు. యుద్ధంలో సహాయంచేసే వాళ్ళు వానరులు. అయినా రాముడు ఒంటరిగా రాక్షససముదాయాన్నంతనీ జయించాడు. మహా

పురుషులు తమ పనులు సాధించడం అనేది వారి సహజ శక్తిమీద ఆధారపడి ఉంటుంది కాని సాధనాలమీద ఆధారపడి ఉండదు.

రథస్యైకం చక్రం భుజగయమితాః సప్త తురగాః
నిరాలమ్బో మార్గశ్చరణవికలః సారథిరపి,
రవిర్యాత్యేవాన్తం ప్రతిదినమపారస్య నభసః
క్రియాసిద్ధిః సత్త్వే వసతి మహతాం నోపకరణే. 111

తా. రథానికి ఒకటే చక్రం. ఏడు గుఱ్ఱాలు సర్పాలచేత కట్టబడ్డాయి. ఆధారం లేని మార్గం. కాళ్ళులేని సారథి. - అయినా సూర్యుడు ప్రతిరోజూ అపారమైన ఆకాశం ఆ చివరి అంచుకు చేరుతూనే ఉన్నాడు. మహా పురుషులు తమ పనులు సాధించడం అనేది వారి సహజశక్తిమీద ఆధారపడి ఉంటుంది కాని సాధనాలమీద ఆధారపడి ఉండదు.

ఘటో జన్మస్థానం మృగపరిజనో భూర్జవసనం
వనే వాసః కన్దైరశనమపి దుఃస్థం వపురిదమ్,
అగస్త్యః పాథోధిం యదకృత కరామ్భోజకుహరే
క్రియాసిద్ధిః సత్త్వే వసతి మహతాం నోపకరణే. 112

తా. పుట్టిన చోటు కుండ. మృగాలు పరివారం. భూర్జచర్మం కట్టుకొనే వస్త్రం. నివాసం వనంలో. భోజనం దుంపలు. శరీరమా పొట్టిది. అయినా అగస్త్యుడు సముద్రాన్ని తన అర చేతి గుంటలో ఇముడ్చుకొన్నాడంటే మహాపురుషులు తమ పనులు సాధించడం అనేది వారి సహజ శక్తిమీద ఆధారపడి ఉంటుంది కాని సాధనాల మీద ఆధారపడి ఉండదు.

ధనుః పౌష్పం,మౌర్వీ మధుకరమయీ, చఞ్చలదృశాం
దృశాం కోణో బాణః సుహృదపి జడాత్మా హిమకరః,
స్వయం చైకోనఙ్గః సకలభువనం వ్యాకులయతి
క్రియాసిద్ధిః సత్త్వే వసతి మహతాం నోపకరణే. 113

తా. ధనస్సు పువ్వులతో తయారుచేసినది. నారి తుమ్మెదల పంక్తి. చపలాక్షుల కంటి చివరి భాగం బాణం. జడాత్ముడైనచంద్రుడు స్నేహితుడు. తానా శరీరం లేనివాడు. అయినా మన్మథుడు ఒంటరిగా ఈ ప్రపంచ కాన్నంతా వ్యాకులం చేసి వేస్తున్నాడు మహాపురుషులు తమ పనులు సాధించడం అనేది వారి సహజశక్తి మీద ఆధారపడి ఉంటుంది కాని సాధనాలమీద కాదు. (జడాత్మ అనగా జడమైన బుద్ధికలవాడు, జలస్వరూపుడు అని రెండర్థాలు)

విపక్షః శ్రీకణ్ఠో జడతనురమాత్యః శశధరో
వసన్తః సామన్తః కుసుమమిషవః సైన్యమబలాః,
తథాపి త్రైలోక్యం జయతి మదనో దేహరహితః
క్రియాసిద్ధిః సత్త్వే వసతి మహతాం నోపకరణే. 1 14

తా. శివుడంతటివాడు శత్రువు జడ (ల) శరీరం గల చంద్రుడు మంత్రి. వసంతుడు సామంతుడు. పుష్పాలు బాణాలు. స్త్రీలు సైన్యం అయినా దేహం లేని మన్మథుడు మూడు లోకాలనీ జయిస్తున్నాడు. మహాపురుషులు తమ పనులు సాధించడం అనేది వారి సహజశక్తిమీద ఆధారపడి ఉంటుంది కాని సాధనాల మీద ఆధారపడదు.

కుణ్డే కాష్ఠే రథే మఞ్చే నౌకాయాం పశువృక్షయోః
తృణేషు జనసంఘాతే స్పర్శదోషో న విద్యతే. 1 15

తా. కాల్చిన కుండ, కట్టె, రథం, మంచం, పడవ, పశువులు, చెట్లు, గడ్డి, జనసమూహము—వీటిలో స్పర్శదోషం లేదు.

కో నిర్దగ్ధస్త్రిపురరిపుణా కశ్చ కర్ణస్య హన్తా
నద్యాః కూలం విఘటయతి కః కః పరస్త్రీరతశ్చ,
కః సంనద్ధో భవతి సమరే, భూషణం కిం కుచానాం
కిం దుఃసంగాద్భవతి మహతాం మానపూజాపహారః. 1 16

తా. (ఇది ఒక ప్రహేళిక. ప్రశ్న లన్నింటికీ సమాధానం "మానపూజాపహారః" అనే దానిలో ఉంది. మొదటి అక్షరాన్ని చివరి అక్షరంతో కలిపితే మొదటి ప్రశ్నకు రెండవ అక్షరాన్ని చివరి అక్షరంతో కలిపితే రెండవ ప్రశ్నకూ, ఈ విధంగా ఆరింటికి సమాధానాలు వస్తాయి. ఏడవ ప్రశ్నకి మొత్తం పదం సమాధానం)

తా. (1) రుద్రునిచేత కాల్చబడిన వాడు ఎవరు ? సమాధానం-మారః=మన్మథుడు (2) కర్ణున్ని చంపినవాడు ఎవడు ? నరః=అర్జునుడు. (3) నదీతీరాన్ని విరగకొట్టేది ఏది ? పూరః=జలప్రవాహం (4) పరస్త్రీ రతుడు ఎవడు ? జారః=జారుడు (5) యుద్ధానికి సిద్ధపడేవాడు ఎవడు ? పరః=శత్రువు (6) కుచభూషణం ఏది ? హారః=ముత్యాలహారం (7) మహాత్ములకు చెడ్డవాళ్ళతో స్నేహం చేస్తే ఏమి వస్తుంది ? మానపూజాపహరః=గౌరవానికి సన్మానానికీ భంగం.

కుగ్రామవాసః కులహీనసేవా కుభోజనం క్రోధముఖీ చ భార్యా
మూర్ఖశ్చ పుత్రో విధవా చ కన్యా వినాగ్నినా సంతపతే శరీరమ్.

తా. కుగ్రామంలో నివాసం,కులహీనుణ్ణి సేవించడం, చెడ్డ ఆహారం, ఎల్లప్పుడూ రుసరుసలాడే భార్య, మూర్ఖుడైన పుత్రుడు, భర్తృవిహీనురాలైన పుత్రిక ఇవన్నీ నిప్పు లేకుండానే శరీరాన్ని కాల్చి వేస్తాయి.

కృతాపకారోఽపి పరైరనావిష్కృతవిక్రియః
అసాధ్యం కురుతే కోపం ప్రాప్తే కాలే గదో యథా. 118

తా. పరులు అపకారం చేసినా తెలివైనవాడు ఆ సమయంలో ఏమాత్రం పైకి తేలడు. అయితే సరియైన సమయం వచ్చినప్పుడు రోగం వలె తిరుగులేని కోపం ప్రదర్శిస్తాడు.

కో నరకః పరవశతా కిం సౌఖ్యం సర్వసఙ్గవిరతిర్యా
కిం సత్యం భూతహితం కిం ప్రేయః ప్రాణినామసవః. 119

తా నరకం అంటే ఏది ? పరాధీనంగా ఉండడమే. సౌఖ్యం ఏది సర్వసంగాలు విడిచిపెట్టడం. సత్యం ఏది ? ప్రాణులందరికీ హితమైనది ప్రాణులకు ఇష్టమైనది ఏది ? ప్రాణాలు

కో ధర్మో భూతదయా కిం సౌఖ్యమరోగితా జగతి జన్తోః
కః స్నేహః సద్భావః కిం పాణ్డిత్యం పరిచ్ఛేదః. 120

తా. దర్మం ఏది ? ప్రాణులమీద దయ. మానవునికి ఈ జగత్తులో సౌఖ్యం ఏది ? రోగం లేకపోవడమే. స్నేహం అంటే ఏమిటి ? మంచిగా ఉండడం. పాండిత్యం అంటే ఏమిటి ? నిశ్చితమైన విషయపరిజ్ఞానం,

కిమద్య మమ సంపన్నం ప్రాతర్వా భవితా పునః
ఇతి చిన్తాజ్వరో నాస్తి తేన జీవామ్యనామయః. 121

తా, నాకు ఇప్పుడు ఏమి సమకూడింది? రేపు ఏమి కాగలదు ?-అనే చింత అనే జ్వరం నాకు లేదు. అందుచేత నేను ఏ రోగమూ లేకుండా జీవిస్తున్నాను.

కరోమీశోఽపి నాక్రాన్తిం పరితాపే న ఖేదవాన్
దరిద్రోఽపి న వాఞ్ఛామి తేన జీవామ్యనామయః 122

తా. సామర్థ్యం ఉన్నా కూడ ఎవరిమీదా ఆక్రమణం చెయ్యను. బాధపడడానికి కారణం ఉన్నా దుఃఖించను. దరిద్రుడనైనా అదీ ఇదీ కావాలని కోరుకోను అందుచేత ఏ రోగాలూ లేకుండా జీవిస్తున్నాను.

కృతే ప్రతికృతిం కుర్యాద్ధింసనే ప్రతిహింసనమ్
తత్ర దోషో న పతతి దుష్టే దుష్టం సమాచరేత్. 123

తా. ఎవరైనా అపకారం చేస్తే దానికి ప్రతిక్రియ చెయ్యాలి. వాడు హింసిస్తే హింసించాలి. అలా చేయడంలో తప్పులేదు. దుష్టుని విషయంలో దుష్టుడుగానే ప్రవర్తించాలి.

హా_స్తం వ_క్తి కపోతికాకులతయా నాథా_స్తకాలో౽ధునా
వ్యాధో౽ధో ధృతచాపసజ్జితశరః శ్యేనః పరిభ్రామ్యతి.
ఇత్థం సత్యహినా స దష్ట ఇషుణా శ్యేనో౽పి తేనాహతః.
తూర్ణం తౌ తు యమాలయం ప్రతి గతౌ దైవీ విచిత్రా గతిః.

తా. ఆడ పావురం భయంతో వ్యాకులురాలై భ_ర్తతో ఇలా అంటున్నది-నాథా ! ఇప్పుడు మనకు మరణసమయం ఆసన్నమైనది. క్రింద బోయవాడు ధనస్సు ఎక్కుపెట్టి గురి చూస్తున్నాడు పైన డేగ ఎగురుతున్నది. ఇలా అంటూండగానే ఒక సర్పం బోయవాణ్ణి కాటేసింది. బాణం గురితప్పి డేగకి తగిలింది. ఈ విధంగా బోయవాడు డేగకూడ చచ్చి నారు దైవగతి విచిత్రంగా ఉంటుంది.

కృపణేన సమో దాతా న భూతో న భవిష్యతి
అస్పృశన్నేవ వి_త్తాని యః పరేభ్యః ప్రయచ్ఛతి. 125

తా. పిసినారితో సమానుడైన దాత ఇంతకు ముందు పుట్ట లేదు. ఇటుపైన పుట్టడు ఎందుచేతననగా అతడు తన దనం ముట్టు కోకుండానే ఇతరులకు ఇచ్చేస్తాడు !

కృష్ణ త్వదీయ పదపఙ్కజపఞ్జరా_న్తే
అద్యైవ మే విశతు మానసరాజహంసః,
ప్రాణప్రయాణసమయే కఫవాతపి_త్తైః
కణ్ఠావరోధనవిధౌ స్మరణం కుత_స్తే. 126

తా. కృష్ణా ! నా మనస్సు అనే రాజహంస నీ పాద పద్మాల నే పంజరం మధ్య ఇప్పుడే ప్రవేశించేటట్లు అనుగ్రహించు. ప్రాణాలు పోయే సమయంలో కఫవాత పిత్తాలు కంఠాన్ని అడ్డుకోనే టప్పుడు నీ స్మరణం ఎలా ఉంటుంది ?

కుటిలా లక్ష్మీర్యత్ర ప్రభవతి న సరస్వతీ వసతి తత్ర
ప్రాయః శ్వశ్రూస్నుషయోర్న దృశ్యతే సౌహృదం లోకే. 127

తా. కుటిల స్వభావం గల లక్ష్మి అధికారం చలాయించే చోట సరస్వతి ఉండదు. సాధారణంగా అత్తాకోడళ్ళ మధ్య సామరస్యం ఉండడం లోకంలో అరుదు.

కర్తవ్యోఽప్యాశ్రయః శ్రేయాన్ ఫలం భాగ్యానుసారతః
నీలకణ్ఠస్య కణ్ఠేఽపి వాసుకిర్వాయుభక్షకః. 128

తా. ఆశ్రయిస్తే గొప్పవారినే ఆశ్రయించాలి అయితే ఫలం అదృష్టాన్ని అనుసరించి ఉంటుంది. శివుని కంఠాన్ని ఆశ్రయించి ఉన్నా వాసుకికి వాయువే ఆహారం.

కిం కరోతి నరః ప్రాజ్ఞః ప్రేర్యమాణః స్వకర్మణా
ప్రాగేవ హి మనుష్యాణాం బుద్ధిః కర్మానుసారిణీ. 129

తా. ఎంత బుద్ధిమంతుడైనా మానవుడు కర్మ ప్రేరేపిస్తున్నప్పుడు మరొక విధంగా ఏమి చేయగలడు ? మానవుల బుద్ధి ముందుగానే కర్మను అనుసరించి ఉంటుంది కదా ?

కర్మాయత్తం ఫలం పుంసాం బుద్ధిః కర్మానుసారిణీ
తథాపి సుధియా భావ్యం సువిచార్యైవ కుర్వతా. 130

తా పురుషులకు కర్మానుసారంగా ఫలం లభిస్తుంది. బుద్ధి కర్మను అనుసరించి ఉంటుంది. అయినా బుద్ధిమంతుడు ఏపనైనా బాగా ఆలోచించే చెయ్యాలి.

కస్య చిత్కిమపి నో హరణీయం
మర్మవాక్యమపి నోచ్చరణీయమ్,
శ్రీపతేః పదయుగం స్మరణీయం
లీలయా భవజలం తరణీయమ్. 131

తా. ఎవరిదీ ఏదీ హరించకూడదు. మనస్సుకు బాధ కలిగించేమాట పలుకకూడదు. శ్రీమహావిష్ణువు పాదద్వయం స్మరించాలి. ఈవిధంగా ఉంటే సంసారాన్ని అనాయాసంగా దాటివేయవచ్చు

కస్తూరీ జాయతే కస్మాత్ కో హన్తి కరిణాం శతమ్
కిం కుర్యాత్కాతరో యుద్ధే మృగాత్సింహః పలాయనమ్. **132**

తా. (నాల్గవ పాదం సమస్య "లేడి నుండి సింహం పారిపోతోంది" అని అర్థం. మూడు పదాలూ వేరు వేరుగా తీసికొని మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలి). కస్తూరి దేని నుండి పుడుతుంది ? (మృగాత్) వంద ఏనుగులను చంపేది ఏది ? (సింహః) పిరికివాడు యుద్ధంలో ఏమి చేస్తాడు ? (పలాయనమ్)

కాకః పద్మవనే రతిం న కురుతే హంసో న కూపోదకే
మూర్ఖః సజ్జనసంగమే న రమతే దాసో న సింహాసనే.
కుస్త్రీ సజ్జనసంగమే న రమతే నీచం జనం సేవతే
యా యస్య ప్రకృతిః స్వభావజనితా కేనాపి న త్యజ్యతే. **133**

తా. కాకికి పద్మవనం అంటే ఇష్టం ఉండదు హంసకు కూపోదకం ఇష్టం ఉండదు. మూర్ఖుడు సత్పురుషుల దగ్గర సుఖంగా ఉండలేడు దాసుడు సింహాసనంమీద సుఖంగా కూర్చొనలేడు. చెడ్డ ఆడదానికి మంచివాళ్ల సహవాసం కిట్టదు; నీచసహవాసానికే ఆమె ఇష్టపడుతుంది. ఎవ్వడు కూడా తన సహజమైన ప్రకృతిని విడవజాలడు.

కాలో వా కారణం రాజ్ఞో రాజా వా కాలకారణమ్
ఇతి తే సంశయో మా భూద్రాజా కాలస్య కారణమ్. **134**

తా. కాలం రాజుకి కారణమా (రాజును మార్చకలుగుతుందా) రాజే కాలానికి కారణమా అన్న సందేహం నీకు అవసరం లేదు. రాజే కాలానికి కారణం. పరిపాలకుడే కాలాన్ని మార్చకలుగుతాడు.

కాకే శౌచం ద్యూతకారే చ సత్యం
క్లీబే ధైర్యం మద్యపే తత్త్వచిన్తా,
సర్పే శాన్తిః స్త్రీషు కామోపశాన్తీ
రాజా మిత్రం కేన దృష్టం శ్రుతం వా. 135

తా. కాకికి పవిత్రత్వము, జూదగానికి సత్యమూ, నపుంసకునికి ధైర్యమూ, త్రాగుబోతుకి తత్త్వచింతా, సర్పానికి శాంతీ, స్త్రీలల్లో కామశాంతీ, రాజు మిత్రుడుగా ఉండడమూ ఏవరైనా చూచినారా, విన్నారా ?

కైవర్తకర్కశకరగ్రహణచ్యుతోఽపి
జాలాన్తరే నిపతితః శఫరో వరాకః,
దైవాత్తతో విగలితో గిలితో బకేన
వక్రే విధౌ వద కథం వ్యవసాయసిద్ధిః. 136

తా. ఒక చేప వలలో పడింది; అయితే పల్లెవాని కఠినహస్తాలనుంచి ఎలాగో తప్పించుకొని క్రిందకి జారింది; కాని, పాపం దాన్ని అక్కడనే ఉన్న కొంగ మింగేసింది. దైవం వక్రంగా ఉన్నప్పుడు ప్రయత్నం ఏం ఫలిస్తుంది ?

కర్మణో హి ప్రధానత్వం కిం కుర్వన్తి శుభా గ్రహాః
వసిష్ఠదత్తలగ్నోఽపి రామః కిం భ్రమతే వనమ్. 137

తా. కర్మే ప్రధానమైనది, శుభగ్రహాలు ఏం చేస్తాయి. సాక్షాత్తు వసిష్ఠుడే రాజ్యాభిషేకలగ్నం నిర్ణయించాడు. అయితేనేం-రాముడికి అరణ్యంలో తిరగడం తప్పలేదు !

కరారవిన్దేన పదారవిన్దం
ముఖారవిన్దే వినివేశయన్తమ్,
వటస్య పత్రస్య పుటే శయానం
బాలం ముకున్దం మనసా స్మరామి. 138

తా. వటపత్రంమీద శయనించి హస్తపద్మంతో పాదపద్మాన్ని ముఖపద్మంలో ఉంచుకొంటూన్న బాలముకుందుణ్ణి మనసా స్మరిస్తాను.

కిం వాసస్తైపం న విచారణీయం
వాసః ప్రధానం ఖలు యోగ్యతాయాః,
పీతామ్బరం వీక్ష్య దదౌ తనూజాం
దిగమ్బరం వీక్ష్య విషం సముద్రః. 139

తా. వస్త్రంలో ఏముంది అని అనుకోకూడదు. యోగ్యతకు వస్త్రమే ప్రధానమైనది. సముద్రుడు పీతాంబరం కట్టుకొన్న విష్ణువును చూచి కూతుర్ని ఇచ్చాడు, దిగంబరుడైన శివుణ్ణి చూచి విషం ఇచ్చాడు.

కాన్తారే ఘనతిమిరే భుజఙ్గమేభ్యో
నో భీతా న చ గణితా మహాపగాపి,
కిం బాలే వహసి భయం మదఙ్గసంగాత్
విక్రీతే కరిణి కిమఙ్కుశే వికారః. 140

తా ఓ! బాలా! దట్టమైన చీకటి ఉన్న అడవిలోనువ్వు పాములకు భయపడలేదు; మహానదిని కూడా లెక్కచేయలేదు, నా శరీరసంగం కాగానే భయపడతావెందుకు ? ఏనుగును అమ్మివేసిన తరవాత అంకుశాన్ని గూర్చి అమ్మాలా వద్దా అని వివాదం ఎందుకు? (నాల్గవపాదం సమస్యగా ఇచ్చిన ( మిగిలినది దాని పూరణం.)

కృతే ప్రతికృతిం కుర్యాద్ధింసనే ప్రతిహింసితమ్
తత్ర దోషం న పశ్యామి శఠే శాఠ్యం సమాచరేత్. 141

తా. ఎవరైనా ఉపకారం చేస్తే ప్రత్యుపకారం చెయ్యాలి. వాడు హింసిస్తే ప్రతిహింస చెయ్యాలి ఇలా చేయడంలో నాకేమీ తప్పు కనబడదంలేదు. రహస్యంగా అపకారంచేసే మోసగాణ్ణి మోసగించాలి.

క్రోధ ఏవ మహాన్ శత్రు స్తృష్ణా వైతరిణీ నదీ
సంతోషో నన్దనవనం శాన్తిరేవ హి కామధుక్. 142

తా. కోపమే మహాశత్రువు. దురాశ వైతరణీనది (ఇది యమలోకానికి వెళ్లే దారిలో ఉండే దాటడానికి కష్టమైన నది) సంతోషం నందనోద్యానం. శాంతి కామధేనువు.

కష్టా వృత్తిః పరాధీనా కష్టో వాసో నిరాశ్రయః
నిర్ధనో వ్యవసాయశ్చ సర్వకష్టా దరిద్రతా. 143

తా పరాధీనమైన బ్రతుకు కష్టం. ఆశ్రయం లేని నివాసం కష్టం. ధనం లేని పరిశ్రమ కష్టం. దారిద్ర్యంలో అంతా కష్టమే.

క్షమా ధనుః కరే యస్య దుర్జనః కిం కరిష్యతి
అతృణే పతితో వహ్నిః స్వయమేవోపశామ్యతి. 144

తా. ఓర్పు అనే ధనస్సు చేతిలో ఉన్నవాణ్ణి దుర్జనుడు ఏం చేయగలడు? గడ్డి లేని ప్రదేశంలో పడిన నిప్పు తనంతట తానే శాంతిస్తుంది.

క్షణే తుష్టాః క్షణే రుష్టాః తుష్టా రుష్టాః క్షణే క్షణే
అవ్యవస్థితచిత్తానాం ప్రసాదోఽపి భయంకరః. 145

తా ఒక క్షణంలో సంతోషిస్తారు (అనుకూలంగా మాటలాడతారు); మరుక్షణంలో కోపిస్తారు. ఈ విధంగా క్షణక్షణానికి సంతోషిస్తూ కోపిస్తూ ఉంటారు మనస్సు నిలకడ లేనివాళ్ల అనుగ్రహం చూపినా మనం భయపడవలసిందే.

క్షణశః కణశశ్చైవ విద్యామర్థం చ సాధయేత్
క్షణత్యాగే కుతో విద్యా కణత్యాగే కుతో ధనమ్ 146

తా. ఒక్కొక్క క్షణం చొప్పునా, ఒక్కొక్క కణం చొప్పునా విద్యనూ ధనాన్నీ సాధించాలి. క్షణం పోతే విద్య ఎక్కడ లభిస్తుంది? కణం పోతే ధనం ఎలా పోగడుతుంది ?

క్షీరేణ దగ్ధజిహ్వ స్తక్రం ఫూత్కృత్య బాలకః పిబతి
దమ్భినమపలోక్య జన స్త్వద్వాన్మాం శఙ్కతే త్వయా త్యక్తమ్.

తా. వేడిపాలు తాగి నాలుక కాల్చుకొన్న బాలుడు మజ్జిగ కూడా ఊదుకొని తాగుతాడు. అదే విధంగా నువ్వు నన్ను విడచిపెట్టటం చూచి అందరూ నన్ను డాంబికు దనుకొంటున్నారు

క్షణం చిత్తం క్షణం విత్తం క్షణం జీవతి మానవః
యమస్య కరుణా నాస్తి ధర్మస్య త్వరితా గతిః 148

తా. చిత్తం క్షణంతో మారిపోతుంది; ధనం క్షణంలో పోతుంది; మానవుడు క్షణకాలంమాత్రమే జీవిస్తాడు, యమునికి జాలిలేదు ధర్మము గమనం చాల వేగంగా ఉంటుంది.

క్షాన్తితుల్యం తపో నాస్తి సంతోషాన్న పరం సుఖమ్
నాస్తి తృష్ణాసమో వ్యాధిర్న చ ధర్మో దయాపరః. 149

తా ఓరిమివంటి తపస్సు లేదు, సంతోషాన్ని మించిన సుఖం లేదు. దురాశవంటి వ్యాధి లేదు. దయను మించిన ధర్మం లేదు.

## ఖ

ఖలసఖ్యం ప్రాఙ్మధురం వయోఽన్తరాళే నిదాఘదినమన్తే
ఏకాదిమధ్యపరిణతిరమణీయా సాధుజనమైత్రీ. 150

తా. దుర్మార్గులతో స్నేహం ప్రారంభంలో మధురంగా ఉంటుంది. వయస్సు మధ్యలో (యౌవనకాలంలో) మధురంగా ఉంటుంది. గ్రీష్మదివనం చివర మధురంగా ఉంటుంది, ప్రారంభంలోనూ, మధ్యా, చివరా కూడా రమణీయంగా ఉండేది సత్పురుషుల స్నేహం ఒక్కటే.

ఖాదన్న గచ్ఛామి హసన్న జల్పే
గతం న శోచామి కృతం న మన్యే,

ద్వాభ్యాం తృతీయో న భవామి రాజన్
కిం కారణం భోజ భవామి మూర్ఖః. 151

తా. నేను తింటూ నడవను; నవ్వుతూ మాటలాడను, గడచిపోయిన దాన్ని గూర్చి విచారించను; చేసిన పనిని గూర్చి తలవను (చెప్పుకోను). ఇద్దరు మాటలాడుకొంటూ ఉంటే మూడవవాడుగా వెళ్లను - భోజమహారాజా! నన్ను మూర్ఖుడనడానికి కారణం ఏమిటి?

ఖరం శ్వానం గజం మత్తం రణ్డాం చ బహుభాషిణీమ్
రాజపుత్రం కుమిత్రం చ దూరతః పరివర్జయేత్. 152

తా. గాడిద, కుక్క, మదించిన ఏనుగు, ఎక్కువగా మాటలాడే కులట, రాజపుత్రుడు, చెడ్డ మిత్రుడు - వీరికి దూరంగా ఉండాలి.

ఖనిత్వా సప్తపాతాలం భ్రమిత్వాకాశమణ్డలే
భ్రమిత్వా సకలాం పృథ్వీం నాదత్తముపతిష్ఠతే. 153

తా. మానవులు ఏడు పాతాళలోకాలు త్రవ్వితే త్రవ్వవచ్చు; ఆకాశంలో తిరుగవచ్చు, భూమండలం అంతటా సంచరించవచ్చు; ఏమైనా ఇవ్వనిది లభించదు.

ఖలః సర్షపమాత్రాణి పరచ్ఛిద్రాణి పశ్యతి
ఆత్మనో బిల్వమాత్రాణి పశ్యన్నపి న పశ్యతి. 154

తా. దుర్మార్గుడు ఇతరులలో ఉన్న ఆవగింజంత లోపాలను కూడా చూస్తూ ఉంటాడు. తనలో మారేడు పండంత లోపాలు ఉన్నా చూచికూడా చూడడు.

ఖల్వాటో దివసేశ్వరస్య కిరణైః సంతాపితే మస్తకే
వాఞ్ఛన్ దేశమనాతపం విధివశాత్తాలస్య మూలం గతః,
తత్రాప్యస్య మహతా ఫలేన మూర్ధ్ని పతతా భగ్నం సశబ్దం శిరః
ప్రాయో గచ్ఛతి యత్ర భాగ్యరహితస్తత్రైవ యాన్త్యాపదః.

తా. ఒక బట్టతలవాడు సూర్యుని కిరణాలకి తల వేడెక్కిపోవడంతో నీడ వెదకికొంటూ తాడిచెట్టు మొదట్లో చేరాడు. అక్కడ కూడా ఒక తాటి పండు పడి వాని తల ఠప్పుమని బద్దలైనది. దౌర్భాగ్యవంతుడు ఎక్కడికి వెడితే అక్కడికే ఆపదలు కూడా వెడుతూ ఉంటాయి.

# గ

గతానుగతికో లోకః కుట్టనీముపదేశినీమ్
ప్రమాణయతి నో ధర్మే యథా గోఘ్నమివ ద్విజమ్. 156

తా. ఒకరు ఎలా వెడితే అల్లాగే వెళ్లే స్వభావం లోకానిది. తార్పుడు కత్తె మంచి విషయం ఉపదేశించినా గోహత్య చేసిన బ్రాహ్మణుని వలె ఆమెను ధర్మం విషయంలో ప్రమాణంగా గ్రహించదు.

గతానుగతికో లోకో న లోకః పారమార్థికః
వేలాసైకతలిఙ్గేన నష్టం మే తామ్రభాజనమ్. 157

తా. (ఒక పర్వదివసంలో అప్పయ్యదీక్షితులు సముద్రస్నానానికి వెళ్లి రాగిచెంబు ఒడ్డుమీద బోర్లించి అది మారిపోకుండా ఉండడంకోసం గుప్పెడు ఇసక ముద్దగా చేసి దానిమీద పెట్టి స్నానానికి వెళ్లారు. అది చూచి మిగిలినవాళ్లందరూ కూడా ''సముద్రస్నానానికి వెళ్లేటప్పుడు ఇలా చేయాలి కాబోలు'' అని అనుకొని తమ రాగి చెంబులమీద కూడా ఆ విధంగా ఇసుక లింగాలు పెట్టారు. అప్పయదీక్షితులు స్నానం చేసి గట్టుమీదికి వచ్చే సరికి చంబు గుర్తించడానికి వీలులేకుండా పోయింది. అప్పు డాయన అన్న మాటలు.

లోకం ఒకరు ముందు వెడుతూంటే వెనక వెళ్లడమే కాని సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించదు. సముద్రతీరంలో ఇసుక లింగం పెట్టడంచేత నా రాగిచెంబు పోయింది.

గతశోకో న కర్తవ్యో భవిష్యం నైవ చిన్తయేత్
వర్తమానేషు కార్యేషు వర్తయన్తి విచక్షణాః. 158

తా తెలివైనవాళ్లు గడచిపోయినదానికి శోకించరు; భవిష్యత్తును గూర్చి ఆలోచించరు; జరుగుతున్న పనులమీదనే దృష్టి నిలుపుతారు.

గృహాసక్తస్య నో విద్యా నో దయా మాంసభోజినః
ద్రవ్యలుబ్ధస్య నో సత్యం స్త్రైణస్య న పవిత్రతా. 159

తా ఇంటికోసం బెంగపెట్టుకొన్నవాడికి చదువు రాదు. మాంసం తినేవానికి దయ ఉండదు. ధనలోభికి సత్యం ఉండదు. స్త్రీలోలునికి పవిత్రత్వం ఉండదు.

గతాస్తే దివసా రాజన్ దేవాః సేవాసువర్తినః
దశాననదశాం పశ్య తరన్తి దృషదోఽమ్బుని. 160

తా. రాజా! దేవతలు సేవలు చేసే ఆ రోజులు గడచిపోయినవి, రావణుని పరిస్థితి చూడు రాళ్లు నీళ్లమీద తేలుతున్నాయి!

గుణాః సర్వత్ర పూజ్యన్తే పితృవంశో నిరర్థకః
వసుదేవం పరిత్యజ్య వాసుదేవముపాసతే. 161

తా. అంతటా గుణాలనే పూజిస్తారు; తండ్రి వంశం వ్యర్థం (తండ్రిని పట్టి కాదు) వసుదేవుణ్ణి ఎవరూ పూజించరు, వాసుదేవుణ్ణే పూజిస్తారు.

గుణాః సర్వత్ర పూజ్యన్తే దూరేఽపి వసతాం సతామ్
కేతకీగన్ధమాఘ్రాతుం స్వయం గచ్ఛన్తి షట్పదాః. 162

తా. సత్పురుషులు దూరంగా ఉన్నా వాళ్ల గుణాలను పూజిస్తారు, మొగలిపువ్వు సుగంధం వాసనచూడడానికై తుమ్మెదలు వాటంతట అవే వెదతాయి.

గుణాః సర్వత్ర పూజ్యన్తే న మహత్యోఽపి సమ్పదః
పూర్ణేన్దుః కిం తథా వన్ద్యో నిష్కలఙ్కో యథా కృశః. 163

తా అంతటా గుణములే పూజింపబడతాయి కానీ ఎంత గొప్పవైనా సంపదలు పూజింపబడవు. కృశించినా కళంకం లేకుండా ఉన్న చంద్రుణ్ణి పూజించినట్లు కళంకం ఉన్న పూర్ణచంద్రుణ్ణి పూజించరు కదా.

గుణిని గుణజ్ఞో రమతే నాగుణశీలస్య గుణిని పరితోషః
అలిరేతి వనాత్కమలం న దర్దురస్త్వేకవాసోఽపి. 164

తా. గుణాలు తెలిసినవాడే సద్గుణవంతుని విషయంలో ఆనందం చూపుతాడు. గుణాలు లేనివానికి గుణవంతుని విషయంలో ఆదరం ఉండదు ఎక్కడో వనంలో ఉన్న తుమ్మెద పద్మం దగ్గరకు వస్తుంది; ఒకే చోట చెరువులో) ఉన్నా కప్ప దానిదగ్గరికి వెళ్లదు.

గురవో బహవః సన్తి శిష్యవిత్తాపహారకాః
దుర్లభః స గురుర్లోకే శిష్యచిత్తాపహారకః. 165

తా. శిష్యుల విత్తం ధనం) అపహరించే గురువులు చాలమంది ఉంటారు. కాని శిష్యుల చిత్తం ఆకర్షించే గురువు లోకంలో చాల అరుదు.

గుణవానపి నోపయాతి పూజాం
పురుషః సత్పురుషైరకథ్యమానః
న హి సౌరమణిః స్వభావకాన్తిం
రవిపాదైరసధిష్ఠితః కరోతి. 166

తా. గుణవంతుడైనా సత్పురుషులు చెప్పేదాకా పూజ పొందడు. సూర్యకిరణస్పర్శ ఉంటేనే కాని సూర్యకాంతమణి తన సహజకాంతిని ప్రదర్శించదు కదా?

గుణైరుత్తుఙ్గతాం యాతి నోచ్చైరాసనసంస్థితః
ప్రాసాదశిఖరస్థోఽపి కాకః కిం గరుడాయతే. 167

తా. గుణాలచేత ఉన్నతత్వాన్ని పొందుతారు గాని ఉన్నతాసన. మీద కూర్చున్నంత మాత్రంచేత కాదు. ప్రాసాదశిఖరంమీద ఉన్నా కాకి గరుత్మంతు డవుతుందా ?

గుణవానపి చిరజీవీ సధనో వినతః సతీ విదగ్ధా స్త్రీ
హరిభక్తోపి ధనాఢ్యః క్షమాతలే న శ్రుతం న వా దృష్టమ్.

తా. సద్గుణవంతుడు దీర్ఘాయుర్దాయవంతుడై ఉండడం, ధనికుడు వినయవంతుడు అవడం, నేర్పు గల స్త్రీ సతిగా ఉండడం, ఐశ్వర్య సంపన్నుడు విష్ణుభక్తు డవడం వినలేదు, చూడలేదు.

గోత్రస్య త్వపరిజ్ఞానే కాశ్యపం గోత్రముచ్యతే
యస్మాదాహ శ్రుతిః పూర్వం ప్రజాః కాశ్యపసంభవాః. 169

తా. ప్రజలంతరూ కశ్యపునివలన పుట్టినట్లుగా శ్రుతి చెపుతూన్నది. అందుచేత ఏ గోత్రమో తెలియకపోతే కాశ్యపగోత్రం చెప్పుకోవాలి.

గురుషు మిలితేషు శిరసా
ప్రణమసి లఘుషూన్నతా సమేషు సమా,
ఉచితజ్ఞాసి తులే! కిం
తులయసి గుఞ్జాఫలైః కనకమ్. 170

తా. ఓ! త్రాసా! గురుపులు (పెద్దలు, బరువైనవి అని రెండు అర్థాలు) వచ్చినప్పుడు శిరస్సు వంచుతావు. లఘువులు (తక్కువవాళ్ల, తేలిక అయినవి) వచ్చినప్పుడుఉన్నతంగా ఉంటావు (పైకి లేస్తావు). సములు వచ్చినప్పుడు సమంగా ఉంటావు; ఈ విధంగా ఔచిత్యం తెలిసినదానవు. కాని బంగారాన్ని గురివిందపూసలతో ఎందుకు తూచుచున్నావో తెలియదు!

గజం మత్తం ద్విజం భ్రష్టం వృషభం కామమోహితమ్
నృపమన్తఃపురగతం దూరతః పరివర్జయేత్. 171

తా. మదించిన ఏనుగుకి భ్రష్టుడైన బ్రాహ్మణునికి, కామంతో ఉన్న ఎద్దుకి, అంతఃపురంలో ఉన్న రాజుకి (అధికారికి) దూరంగా ఉండాలి.

గుణాః ఖలు గుణా ఏవ న గుణా భూతిహేతవః
ధనసంచయకర్తౄణాం భాగ్యాని పృథగేవ హి. 172

తా. సద్గుణాల దారి సద్గుణాలదే. వాటివల్ల ఐశ్వర్యం రాదు, కొంత మంది ధనం పోగుచేసికొంటున్నారంటే వాళ్ల అదృష్టమే వేరుగా ఉంటుంది.

గర్భస్థో హరతే దుగ్ధం జన్మతః స్నేహమాహరేత్
పశ్చాద్ధనవిభాగేన నాస్తి బన్ధుసమో రిపుః. 173

తా. సోదరునివంటి శత్రువు లేడు-గర్భంలో ప్రవేశించగానే పాలు హరించేస్తాడు; పుట్టగానే స్నేహంహరిస్తాడు; తరవాత ధనం పంచుకొంటాడు.

గోవిన్దో మాతులో యస్య పితా యస్య ధనంజయః
అభిమన్యూ రణే శేతే నియతిః కేన వార్యతే. 174

తా. శ్రీకృష్ణుడు మేనమామయై ఉండి అర్జునుడు తండ్రి అయి ఉండి అభిమన్యుడు కూడా యుద్ధరంగంలో చంపబడి శయనించి ఉన్నాడు; దైవాన్ని ఎవరు తప్పించగలరు?

గచ్ఛ సూకర భద్రం తే బ్రూహి సింహో మయా జితః
పణ్డితా ఏవ జానన్తి సింహసూకరయోర్బలమ్. 175

తా. ఓ! సూకరమా! (పందీ) మంచిది; వెళ్లు "నేను సింహాన్ని జయించాను" అని చెప్పుకో. సింహం బలం ఎట్టిదో, సూకరం బలం ఎట్టిదో పండితులకే తెలుసునులే.

గీతజ్ఞో యది యోగేన నాప్నోతి పరమం పదమ్
రుద్రస్యానుచరో భూత్వా తేనైవ సహ మోదతే
(యాజ్ఞవల్క్యస్మృతి) 176

తా సంగీతజ్ఞానం కలవాడు సంగీతజ్ఞానయోగం ద్వారా మోక్షం పొందుతాడు; ఏ కారణంచేత నైనా మోక్షం పొందకపోతే రుద్రుని అనుచరులలో ఒకడుగా అయి ఆ రుద్రునితో ఆనందం అనుభవిస్తాడు.

గ్రాసోద్గలితసిక్థస్య కా హానిః కరిణో భవేత్
పిపీలికా తు తేనైవ సకుటుమ్బోపజీవతి. 177

తా. ఏనుగు తింటూన్న అన్నంకబళంనుంచి ఒక మెతుకు జారిపోయినా దాని కేమీ నష్టం ఉండదు. అయితే ఆ మెతుకుతోనే చీమ సకుటుంబంగా జీవిస్తుంది.

గగనం గగనాకారం సాగరః సాగరోపమః
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ. 178

తా. ఆకాశం ఆకాశంవంటి ఆకారం గలది. ఆకాశానికి ఆకాశమే సాటి సముద్రం సముద్రంవలె ఉంది రామరావణుల యుద్ధం రామరావణుల యుద్ధం వంటిది.

గురురాత్మవతాం శాస్తా రాజా శాస్తా దురాత్మనామ్
అథ ప్రచ్ఛన్నపాపానాం శాస్తా వైవస్వతో యమః. 179

తా బుద్ధిమంతులకు శిక్షకుడు (మంచిచెడ్డలునేర్పేవాడు) గురువు. దురాత్ములకు శిక్షకుడు రాజు. రహస్యంగా పాపాలు చేసేవార్ని శిక్షించేవాడు యముడు.

## చ

చక్షూరోగి కర్ణరోగి రోగి చైవ కఫాదిభిః
కణ్ఠస్నానం ప్రకుర్వీత శిరఃస్నానసమం హి తత్. 180

తా. కంటిజబ్బు ఉన్నవాడు, చెవుల రోగం ఉన్నవాడు, కఫం మొదలైన రోగాలు ఉన్నవాడు కంఠస్నానం చేస్తే చాలు, అది శిరఃస్నానం వంటిదే.

చఞ్చలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్. (భ.గీ)

తా. (అర్జునుడు అన్నమాటలు) కృష్ణా మనస్సు చంచలమైనది; చాల బలం గలది; బాధ కలిగించేది. దానిని నిగ్రహించడం వాయువును నిగ్రహించడం ఎంత కష్టమో అంత కష్టమని అనుకొనుచున్నాను.

చిన్తనీయా హి విపదామాదావేవ ప్రతిక్రియా
న కూపఖననం యుక్తం ప్రదీప్తే వహ్నినా గృహే. 182

తా. రాబోయే ఆపదలకు ముందుగానే ప్రతీకారం (తొలగించుకొనే ఉపాయం) ఏర్పాటుచెసుకోవాలి ఇల్లుకి నిప్పుఅంటుకొన్న తరవాత నుయ్యి త్రవ్వించుకోవడం యుక్తం కాదు.

చారకైర్బన్దిభిర్వైద్యైర్నాపితైర్మాలికైరపి
న మన్త్రం మతిమాన్ కుర్యాత్సార్ధం భిక్షుభిరేవ చ. 183

తా. బుద్ధిమంతుడు వందిమాగధులతోను, నీచులతోను, మంగళ్లతోను, మాలాకారులతోను, సంన్యాసులతోను ఆలోచన చేయకూడదు.

చీయతే బాలిశస్యాపి సుక్షేత్రపతితా కృషిః
న శాలేః స్తమ్బకరితా వప్తుర్గుణమపేక్షతే. 184

తా. ఎంత తెలివితక్కువవాడు చేసిన కృషి (వ్యవసాయం) అయినా మంచి క్షేత్రం (పొలం)లో జరుగుతే బాగా వృద్ధి పొందుతుంది వరిమొక్క మంచి వెన్నులు వేసి బాగా పండడం అనేది నాటేవాని గుణంమీద ఆధార పడి ఉండదు.

చికీర్షితే కర్మణి చక్రపాణేర్నాపేక్ష్యతే తత్ర సహాయసంపత్
పాఞ్చాలజాయాః పటసన్నిధానే మధ్యేసభం యన్న తురీ న వేమా

తా శ్రీమహావిష్ణువు ఏమైనా చేయతలచుకొన్నప్పుడు ఆయనికి ఏ సహాయసంపదతోనూ పనిలేదు. సభామధ్యంలో ద్రౌపదికి చీరలు ఇచ్చేటప్పుడు ఆయనకు నాడె అవసరమైనదా, మగ్గంఅవసరమైనదా!

చతురం తురగం పరినర్తయతః
పథి పౌరజనాన్ పరిమర్దయతః,
న హి తే భుజభాగ్యభవో విభవః
భగినీభగభాగ్యభవో విభవః. 186

తా. (ఒక రాజుగారి బావమరది గుఱ్ఱం ఎక్కి నిర్లక్ష్యంగా స్వారీ చేస్తూండగా చూచి ఆతనిని నిందిస్తూ అన్న మాటలు). గుఱ్ఱాన్ని నేర్పుగా త్రిప్పుతూ మార్గంలో ఉన్న పౌరులను తొక్కిస్తున్నావు. ఇదంతా నీ భుజ బాగ్యంవల్ల (భుజపరాక్రమంవల్ల) వచ్చిన వైభవం కాదు; నీ సోదరి భాగ్యంవల్ల కలిగిన వైభవం.

చతురః సఖి మే భర్తా యల్లిఖతి చ తత్ పరో న వాచయతి
తస్మాదప్యధికో మే స్వయమపి లిఖితం స్వయం న వాచయతి.

తా. "సఖీ! నా భర్త చాలా నేర్పుగలవాడు; అతడు వ్రాసినది మరొకరెవరూ చదువలేరు'' "నా భర్త ఇంకా చతురుడు; తాను వ్రాసింది తానే చదువలేడు''.

చేతోహరా యువతయః సుహృదోఽనుకూలాః
సద్బాన్ధవాః ప్రణతినమ్రగిరశ్చ భృత్యాః,
వల్గన్తి దన్తినివహా స్తరలాస్తురంగాః
సంమీలనే నయనయోర్న హి కించిదస్తి. 188

తా. మనస్సును హరించే యువతులు ఉన్నారు, అనుకూలురైన స్నేహితులు ఉన్నారు మంచి బంధువు లున్నారు. నమస్కరిస్తూ వినయంగా మాటాడే భృత్యులు లున్నారు. ఏనుగులూ, గుఱ్ఱాలు చలాకీగా కదులుతున్నాయి. ఎన్ని ఉంటే నేమి; కళ్లు మూతబడితే ఏమీ లేవు.

చిన్తా చితాసమా హ్యుక్తా బిన్దుమాత్రవిశేషతః
సజీవం దహతే చిన్తా నిర్జీవం దహతే చితా. 189

తా. చింత చిత (శవదహనంచేసేచితి)తో సమానమైనదని అంటారు' 'చింత'కీ 'చిత'కీ సున్నమాత్రమే తేడా చింత బ్రతికిఉన్నవాణ్ణి కాల్చివేస్తుంది, చిత మరణించినవాణ్ణి దహిస్తుంది.

చిత్తాయత్తం ధాతుబద్ధం శరీరం
నష్టే చిత్తే ధాతవో యాన్తి నాశమ్,
తస్మాచ్చిత్తం సర్వదా రక్షణీయం
స్వస్థే చిత్తే బుద్ధయః సంభవన్తి. 190

తా. సప్తధాతువులతో ఏర్పడిన శరీరం చిత్తంమీద ఆధారపడి ఉన్నది. చిత్తం పాడవుతే ధాతువులు నశిస్తాయి. అందుచేత చిత్తాన్ని ఎల్లప్పుడూ రక్షించుకోవాలి చిత్తం స్వస్థంగా ఉంటే సద్బుద్ధులు పుడతాయి.

## జ

జన్మప్రభృతి దారిద్ర్యం దశవర్షాణి బన్ధనమ్
సముద్రతీరే మరణమన్యత్కించిద్భవిష్యతి. 191

తా. పుట్టిననాటినుండే దారిద్ర్యం అనుభవించాడు పది సంవత్సరాలు కారాగారంలో ఉన్నాడు ఏ దిక్కూ లేకుండా సముద్రతీరంలో చావడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంకా ఏం జరగవలసి ఉందో!

జటిలో ముణ్డీ లుఞ్చితకేశః
కాషాయామ్బరబహుకృతవేషః,
పశ్యన్నపి చ న పశ్యతి మూఢః
ఉదరనిమిత్తం బహుకృతవేషః. 192

తా. పొట్టకోసం ఎన్నో వేషాలు వేస్తూ ఉంటారు. ఒకడు జటలు పెంచితే ఒకడు బోడిగుండు చేయించుకుంటాడు. మరొకడు వెంట్రుకలు ఒక్కొక్కటి పీక్కుంటాడు. కాషాయవస్త్రాలతో ఏవేవో వేషాలు వేస్తాడు ఈ విధంగా మూఢాత్ముడు కళ్లున్నా కానీ అసలు సత్యం చూడలేడు.

జగన్మాతర్మాతస్తవ చరణసేవా న రచితా
న వా దత్తం దేవి ద్రవిణమపి భూయస్తవ మయా,
తథాపి త్వం స్నేహం మయి నిరుపమం యత్ప్రకురుషే
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి. 193

తా. జగత్తుకు అంతకీ తల్లివైన ఓ! తల్లీ! నేను నీ పాదసేవ చేయలేదు. నీకు అధికంగా ధనం కూడా (సేవల నిమిత్తం) సమర్పించలేదు. అయినా నువ్వు నామీద అపారమైన ప్రేమ చూపిస్తున్నావు; కొడుకు చెడ్డవాడు కావచ్చు కాని ఎక్కడా కూడా తల్లి చెడ్డది ఉండదు.

జానన్తి పశవో గన్ధాద్వేదాజ్జానన్తి పణ్డితాః
చారాజ్జానన్తి రాజానశ్చక్షుర్భ్యామితరే జనాః. 194

తా. పశువులు వాసనను పట్టి తెలుసుకొంటాయి. పండితులు, వేదం సహాయంతో విషయాలు తెలుసుకొంటారు. రాజులు గూఢచారుల ద్వారా తెలుసుకుంటారు; సామాన్యజనులు నేత్రాలతో మాత్రమే తెలిసికొన కలుగుతారు.

జనావనాయోద్యమినం జనార్దనం
లయే సదోద్యుక్తతలం సదాశివమ్,
వదన్తి లోకాః స్వమనోనురాగా
జ్జనాననే కః కరమర్పయిష్యతి. 195

తా. జనులను రక్షించడానికి ఉద్యుక్తుడైన విష్ణువును, తమ మనస్సుకు తోచినట్లు మాటలాడే లోకులు "జనార్దనుడు" (జనులను పీడించేవాడు) అనీ, ఎల్లప్పుడు ప్రలయంచేసే ఈశ్వరుణ్ణి "సదాశివుడు" (ఎల్లప్పుడు మంగళం చేసేవాడు) అనీ అంటారు. లోకుల నోళ్లు మూయించగలవాడు ఎవడు?

జామాతా కృష్ణసర్పశ్చ పావకో దుర్జనస్తథా
విశ్వాసో నైవ కర్తవ్యః పఞ్చమో భగినీసుతః. 196

తా. అల్లుడు, త్రాచుపాము, నిప్పు, దుర్జనుడు, మేనల్లుడు-వీళ్లని విశ్వసించకూడదు.

జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి. (భ.గీ.) 197

తా. పుట్టినవానికి మృత్యువు తప్పదు; మరణించినవానికి మరల పుట్టుక తప్పదు. అందువలన తప్పించుకోవడానికి శక్యంకానిదానిని గూర్చి నువ్వు విచారించకూడదు.

జిహ్వే ప్రమాణం జానీహి భోజనే భాషణేఽపి చ
అతిభుక్తిరతీవోక్తిః సద్యః ప్రాణాపహారిణీ. 198

తా. ఓ! నాలుకా! ఎంత తినాలో, ఏమి, ఎంత, మాటలాడాలో గుర్తు ఉంచుకో. ఎక్కువగా తిన్నా ఎక్కువగా మాటలాడినా ప్రాణాపాయం తెచ్చి పెడుతుంది

జితా ధనవతా దారా జితా బుద్ధిమతా సభా
జితో హ్యభ్యాగతో గోభిర్దారిద్ర్యం కృషిభిర్జితమ్ 199

తా. ధనవంతుడు భార్యను జయిస్తాడు (భార్య వశంలో (ఉంటుంది). బుద్ధిమంతుడు సభను జయిస్తాడు; అభ్యాగతుడు గోవులచేత (పాలు, పెరుగు మొదలైనవి వడ్డించడంచేత) జయింపబడతాడు, వ్యవసాయంచేత దారిద్ర్యం జయింపబడుతుంది.

జీర్ణమన్నం ప్రశంసన్తి భార్యాం చ గతయౌవనామ్
శూరం విజితసంగ్రామం పారంగతతపస్వినమ్. 200

తా. బాగా జీర్ణించిన అన్నాన్ని, యౌవనం (పొరపాట్లు లేకుండా) గడచిన భార్యను, యుద్ధంలో జయం సంపాదించిన శూరుణ్ణి, సిద్ధిపొందిన తపస్విని (మునిని) ప్రశంసిస్తారు

జ్యోతిషం జలదే మిథ్యా మిథ్యాశ్వాసిని వైద్యకమ్
యోగో బహ్వాశనే మిథ్యా మిథ్యాజ్ఞానం చ మద్యపే. 201

తా. మేఘంవిషయంలో (వర్షం) విషయంలో జ్యోతిషం మిథ్య (పనిచెయ్యదు). శ్వాసరోగంతో బాధపడేవానివిషయంలో వైద్యం మిథ్య. ఎక్కువ తినే వానివిషయంలో యోగం మిథ్య (వాడు యోగాభ్యాసం చెయ్యలేడు). త్రాగుబోతునందు జ్ఞానం మిథ్య.

జరామరణదుఃఖేషు రాజ్యలాభసుఖేషు చ
న బిభేమి న హృష్యామి తేన జీవామ్యనామయః. 201

తా. ముసలితనము మరణము, దుఃఖము- వీటి విషయంలోను, రాజ్యలాభము, సుఖములు వీటివిషయంలోను, నేను భయపడను, సంతోషించను, అందుచేత రోగాలు లేకుండా జీవిస్తున్నాను.

జీవన్తి చ మ్రియన్తే చ మద్విధాః క్షుద్రజన్తవః
అనేన సదృశో లోకే న భూతో న భవిష్యతి. 202

తా. ఎందుకూ పనికిరాని నావంటి అల్పులు జీవిస్తూ ఉంటారు, మరణిస్తూ ఉంటారు. ఈ మహాపురుషుని వంటివాడు లోకంలో ఇదివరకు పుట్టలేదు, ముమ్ముందు పుట్టబోడు,

జనితా చోపనేతా చ యశ్చ విద్యాం ప్రయచ్ఛతి
అన్నదాతా భయత్రాతా పఞ్చైతే పితరః స్మృతాః. 203

తా. కన్న తండ్రి, ఉపనయనం చేసినవాడు, విద్య నేర్పినవాడు, అన్నం పెట్టినవాడు, భయంనుండి రక్షించినవాడు – ఈ ఐదుగురు తండ్రులుగా చెప్పబడుచున్నారు,

జాగర్తి లోకో జ్వలతి ప్రదీపః
సఖీజనః పశ్యతి కౌతుకం మే,
ముహూర్తమాత్రం కురు కాన్త ధైర్యం
బుభుక్షితః కిం ద్వికరేణ భుఙ్క్తే. 204

తా. అందరూ మెలకువగా ఉన్నారు. దీపం వెలుగుతూన్నది. సఖురాండ్రు వేడుక చూస్తూన్నారు, కాంతా! ముహూర్త కాలం ఓపికపట్టు. ఎంత ఆకలిగా ఉంటే మాత్రం రెండు చేతులతో తింటారా?

జయోఽస్తు పాణ్డుపుత్రాణాం యేషాం పక్షే జనార్దనః
యతః కృష్ణస్తతో ధర్మో యతో ధర్మస్తతో జయః. 205

తా. శ్రీకృష్ణుడు తమ పక్షంలో ఉన్న పాండవులకు జయం అగుగాక. శ్రీకృష్ణుడు ఏ పక్షాన ఉంటే అక్కడ ధర్మం ఉంటుంది ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ జయం ఉంటుంది,

జలే విష్ణుః స్థలే విష్ణుర్విష్ణుః పర్వతమస్తకే
జ్వాలామాలాకులే విష్ణుః సర్వం విష్ణుమయం జగత్. 206

తా. జలంలో విష్ణువున్నాడు. స్థలంలో విష్ణువున్నాడు. పర్వత శిఖరం మీద విష్ణువున్నాడు జ్వాలామాలల చేత వ్యాకులమైన స్థలంలో విష్ణువున్నాడు, జగత్తంతా విష్ణుమయం.

# త

త్రిభిర్వర్షైస్త్రిభిర్మాసైస్త్రిభిః పక్షైస్త్రిభిర్దినైః
అత్యుత్కటైః పుణ్యపాపైరిహైవ ఫలమశ్నుతే. 207

తా, చేసిన పుణ్యపాపాల తీవ్రతను పట్టి వాటి ఫలాన్ని మూడు సంవత్సరాలలో, మూడు మాసాలలో, మూడుపక్షాలలో, మూడు దివసాలలో ఈ జన్మలోనే అనుభవిస్తాడు.

తుష్టో హి రాజా యది సేవకేభ్యో
భాగ్యాత్పరం నైవ దదాతి కించిత్,
అహర్నిశం వర్షతి వారివాహ
స్తథాపి పత్రత్రితయః పలాశః. 208

తా. రాజు సంతోషించినా సేవకులకి వాళ్ళ అదృష్టాన్ని మించి ఏమీ ఇవ్వడు. మేఘం రాత్రింబగళ్ళు వర్షం కురిసినా మోదుగుచెట్టుకు మూడే ఆకులు.

త్యజేదేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్. 209

తా కులం కోసం అవసరమైతే ఒక్కణ్ణి విడిచిపెట్టి వెయ్యాలి, గ్రామం క్షేమం కోసం కులాన్ని విడిచిపెట్టివెయ్యాలి. దేశం కోసం గ్రామాన్ని విడిచిపెట్టివెయ్యాలి తనకోసం (తనకు పరలోకంలో మంచి గతులు రావడం కోసం) అవసరమైతే ఈ భూలోకాన్నే విడిచేపెట్టివెయ్యాలి, అధర్మానికి ఒడిగట్ట కూడదు.

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి,
ఏవం త్రయీధర్మమనుప్రపన్నా
గతాగతం కామకామా లభన్తే. (భ.గీ.) 310

తా వాళ్లు విశాలమైన స్వర్గలోకం అనుభవించి పుణ్యం క్షీణించగానే మర్త్యలోకానికి తిరిగి వస్తారు ఆ యా కోరికలతో వేదోక్త కర్మలు చేసే వాళ్లు ఇలాగే వెడుతూ వస్తూ ఉంటారు

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి. (భ.గీ.) 211

తా. అందువలన ఇదిచేయతగినది, ఇదిచేయతగనిది, అని నిర్ణయించుకోవడంలో నీకు శాస్త్రమే ప్రమాణము. శాస్త్రంలో చెప్పిన కర్మ తెలిసి కొని చెయ్యి.

తావన్మహతాం మహతీ యావత్కిమపి హి న యాచతే లోకమ్
బలిమనుయాచనసమయే శ్రీపతిరపి వామనో జాతః 212

తా. గొప్పవాళ్ళ గొప్పతనం అంతా ఇతరులను ఏమీ యాచించనంత వరకే. బలిని యాచించే సమయంలో లక్ష్మీపతియైన మహావిష్ణువు కూడా వామనుడు (పొట్టివాడు) అయిపోయాడు.

తేజీయసాం న దోషాయ అగ్నేః సర్వభుజో యథా
ఈశ్వరాణాం వచః సత్యం తథైవాచరితం క్వచిత్. 213

తా అన్నింటినీ తినగలిగినవాడు అగ్ని; ఆ అగ్నికి ఏ దోషమూ అంటనట్లుగా సహజంగా తేజస్సు ఉన్నవాళ్లు ఏమి చేసినా పాపం అంటదు. మహాత్ముల వచనము నిజమై తీరుతుంది. వారి నడవడిక కూడా(దోషాలున్నా) సత్యంగానే (ఉత్తమంగానే) పరిగణింపబడుతుంది.

తృణం బ్రహ్మవిదః స్వర్గస్తృణం శూరస్య జీవనమ్
జితాక్షస్య తృణం నారీ నిఃస్పృహస్య తృణం జగత్. 204

తా. బ్రహ్మజ్ఞానికి స్వర్గం గడ్డిపరక. శూరునికి ప్రాణాలు తృణం, ఇంద్రియాలు జయించినవానికి స్త్రీ తృణం. ఆశ లేనివానికి జగత్తు తృణం.

తుల్యేఽపి పరోక్షత్వే దోషాన్ విశ్వసితి న తు గుణాన్ లోకః
సీతాహరణం సత్యం న తు తస్యా వహ్నిసంశుద్ధిః.(పు.శ్రీ.రా.)

తా. పరోక్షత్వం (తాము స్వయంగా చూడకపోవడం) సమానమే అయినా లోకులు దోషాలను నమ్ముతారు కాని గుణాలు నమ్మరు. సీతను రావణుడు అపహరించడం నిజమే కాని ఆమె అగ్నిశుద్ధి పొందడం అనేది మాత్రం సత్యం కాదు!

తుష్టే సతి న లాభాయ రుష్టే నాశాయ నైవ చ
ప్రజ్వాలితాని శష్పాణి నాఙ్గారాయ న భస్మనే. 216

తా ఇతడు సంతోషిస్తే లాభం లేదు, కోపిస్తే నష్టం లేదు. కాల్చిన గడ్డిపరకలు బొగ్గులుగానూ ఉపయోగించవు, భస్మగా కూడ ఉపయోగించవు.

తారుణ్యే చ మృతా భార్యా పాతకం కిమతః పరమ్
మనసా చిన్తితం కార్యం దైవమన్యత్తు చిన్తయేత్. 217

తా యావనంలో భార్య మరణించింది. ఇంతకంటె పెద్ద పాపం ఏముంటుంది ? మనస్సులో ఒకటి ఆలోచిస్తే దైవం మరొకవిధంగా ఆలోచిస్తుంది

తావత్సర్వగుణాలయః పటుమతిః సాధుః సతాం వల్లభః
శూరః సచ్చరితః కలఙ్కరహితో మానీ కృతజ్ఞః కవిః,
యావన్నిష్ఠురవజ్రపాతసదృశో దేహీతి నో భాషతే
తస్మాద్వాక్యమిదం మమ శృణు సఖే! మాబ్రూహి దీనం వచః.

తా మానవుడు (నిష్ఠురమైన వజ్రపాతంవంటి) ''దేహి'' అనే మాట ఎంతవరకు ఉచ్చరించకుండా ఉంటాడో అంతవరకూ సమస్తగుణాలకీ నిలయమైనవాడు; సమర్థమైన బుద్ధికలవాడు; సాధువు, సత్పురుషులకు ఇష్టుడు; శూరుడు; మంచి నడవడిక గలవాడు; కళంకా లేపీ లేనివాడు; ఆత్మాభి

మానం కలవాడు; కృతజ్ఞుడు; పండితుడు, అందువలన, ఓ! మిత్రమా! నా మాట విను; దీనమైన మాట పలుకకు.

తైలాద్రక్షేజ్జలాద్రక్షేద్రక్షేచ్ఛిథిలబన్ధనాత్
మూర్ఖహస్తే న దాతవ్యమేవం వదతి పుస్తకమ్. **219**

తా పుస్తకం ఇలా అంటూంటుందిట-నన్ను "నూనె తగలకుండా రక్షించాలి; నీళ్లు తగలకుండా రక్షించాలి; బంధనం ఒదులు కాకుండా చూచుకోవాలి; నన్ను మూర్ఖుడి చేతుల్లో పెట్టకూడదు."

తిమిరారిస్తమో హన్తి శఙ్కాతఙ్కితమానసాః
వయం కాకా వయం కాకా ఇతి జల్పన్తి వాయసాః. **220**

తా. సూర్యుడు చీకటిని నశింపచేస్తున్నాడు; మనం కూడ చీకటే అని అనుకొని ఎక్కడ నశింపచేస్తాడో అని కాకులు "కాకా, కాకా" (మేం కాకులం, మేం కాకులం) అని అరుస్తున్నాయి.

తక్షకస్య విషం దన్తే మక్షికాయాశ్చ మస్తకే
వృశ్చికస్య విషం పుచ్ఛే సర్వాఙ్గే దుర్జనస్య తత్. **221**

తా. తక్షకునికి (ఒక పురాణప్రసిద్ధసర్పం) విషం దంతాలలో ఉంటుంది, తేనెటీగకి తలలో ఉంటుంది; తేలుకు తోకలో ఉంటుంది; దుర్జనుడికి శరీరం అంతా విషమే.

తీర్థే వివాహే యాత్రాయాం సంగ్రామే దేశవిప్లవే
నగరగ్రామదాహే చ స్పృష్టాస్పృష్టిర్న దుష్యతి. **222**

తా. పుణ్యతీర్థంలోను, వివాహంలోను, యాత్రలోను, యుద్ధంలోను, దేశోపద్రవసమయంలోను, నగర-గ్రామాలు దగ్ధం అయిపోతూన్నపుడును స్పృశ్యాస్పృశ్యదోషం లేదు.

# ద

దర్శనం స్పర్శనం క్రీడా శృఙ్గారో గుహ్యభాషణమ్
మృష్టాన్నం ప్రియమేకత్ర శయనం భార్యయా సహ
నిర్వికారం మనః కుర్యాదసిధారావ్రతం త్విదమ్. 223

తా. భార్యతో కూడా దర్శనము, స్పర్శనము, క్రీడ, శృంగారచేష్టలు, రహస్యసంభాషణము, ప్రియమైన మృష్టాన్నం తినడము, ఒక చోట శయనించడము-ఇన్ని చేస్తున్నా మనస్సులో ఎట్టి వికారమూ లేకుండా ఉండగలిగినవాడు అసిధారావ్రతం (కత్తిమీద నడవడం) చేస్తున్నా డన్నమాట.

దుర్జనస్య విశిష్టత్వం పరోపద్రవకారణమ్
ఉపోషితస్య వ్యాఘ్రస్య పారణం పశుమారణమ్. 224

తా. దుర్జనుడు మంచిగా ప్రవర్తిస్తున్నాడంటే ఎవరి కొంపో మునిగినట్టే పెద్దపులి ఉపవాసం చేస్తే తరవాత అది చేసే పారణం (ఉపవాసానంతరభోజనం) పశుమారణమే (మృగాలను చంపడమే).

ద్రవ్యాణి భూమౌ పశవశ్చ గోష్ఠే
భార్యా గృహద్వారి జనః శ్మశానే,
దేహశ్చితాయాం పరలోకమార్గే
కర్మానుగో గచ్ఛతి జీవ ఏకః. 225

తా. ధనం భూమిలో (పాతిపెట్టి) ఉంటుంది పశువులు పశుశాలలో ఉంటాయి. భార్య గృహద్వారం దగ్గర, ఇతరబంధుజనులు శ్మశానందగ్గర ఆగిపోతారు. దేహం చితిమీద ఉంటుంది ఇంకపరలోకయాత్రలో జీవుడు ఒక్కడే కర్మ అనుచరుడుగా వస్తుంటే వెడతాడు.

దేవతారాధనైః శాస్త్రైః కాలో గచ్ఛతి ధీమతామ్.
మూర్ఖాణాం తు దివారాత్రం ద్యూతేన కలహేన వా. 226

తా. ధీమంతులు దేవతారాధనలతోను, శాస్త్రచర్చలతోను కాలం గడుపుతూ ఉంటారు. మూర్ఖులు రాత్రింబగళ్లు జూదం ఆడుతూనో, కలహిస్తూనో గడుపుతూ ఉంటారు.

దదాతి ప్రతిగృహ్ణాతి గుహ్యమాఖ్యాతి పృచ్ఛతి
భుఙ్క్తే భోజయతే చైవ షడ్విధం ప్రీతిలక్షణమ్. 227

తా. ఇస్తాడు, పుచ్చుకుంటాడు, రహస్యవిషయాలు చెపుతాడు, అడుగుతాడు, తింటాడు, తినిపిస్తాడు. ఈ విధంగా స్నేహానికి లక్షణాలు ఆరు విధాలు.

దుర్జన దూషితమనసాం పుంసాం సుజనేఽప్యవిశ్వాసః
బాలః పాయసదగ్ధో దధ్యపి ఫూత్కృత్య భక్షయతి. 228

తా. దుర్జనులను చూచి మనస్సు విరిగిపోయినవారికి సజ్జనులమీద కూడా విశ్వాసం ఉండదు. క్షీరాన్నం తింటూ మూతి కాల్చుకొన్న పిల్లవాడు పెరుగు కూడా ఊదుకొని తాగుతాడు.

దానం ప్రియవాక్సహితం జ్ఞానమగర్వం క్షమాన్వితం శౌర్యమ్
విత్తం త్యాగసమేతం దుర్లభమేతచ్చతుర్విధం భద్రమ్. 229

తా. మంచిమాటలు చెపుతూ దానం చెయ్యడం, జ్ఞానం ఉండి కూడా గర్వం లేకపోవడం, ఓరిమితో కూడిన శౌర్యము, ధనంతో పాటు త్యాగగుణం కూడా ఉండడం-ఈ ఉత్తమలక్షణాలు నాలుగూ ఉండడం చాలా కష్టం.

దివా నిరీక్ష్య వక్తవ్యం రాత్రౌ నైవ చ నైవ చ
సంచరన్తి మహాధూర్తా వటే వరరుచిర్యథా. 230

తా. ఎవరితోనైనా ఏమైనా చేప్పేటప్పుడు పగలు నలుమూలలా చూచుకొని చెప్పాలి. రాత్రి ఏమీ చెప్పనేకూడదు.ఎందుచేతనంటే దయ్యమైన వరరుచి మఱ్ఱిచెట్టుమీద తిరుగుతూన్నట్లు మహాధూర్తులు (మోసగాళ్లు) తిరుగుతూ ఉంటారు

'దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః
తం నిత్యమనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా.(రామా)

తా. (సీత అన్నమాటలు) దీనుడైనా రాజ్యం లేనివాడైనా నాకు ఎవ్వడు భర్తయో అతడే నాకు పూజ్యుడు, సువర్చలకు సూర్యునియందు నిత్యమూ అనురాగం ఉన్నట్టు నాకు అతనిమీదనే అనురాగం ఉన్నది.

దూరస్థాః పర్వతా రమ్యా వేశ్యా చ ముఖమణ్డనే
యుద్ధస్య వార్తా రమ్యా చ త్రీణి రమ్యాణి దూరతః, 232

తా. పర్వతాలు దూరంగా ఉన్నంతవరకూ అందంగా కనబడతాయి. ముఖానికి బాగా అలంకారం చేసికొన్న వేశ్య అందంగా కనబడుతుంది. యుద్ధాన్ని గూర్చిన సమాచారం వినడానికి చాలా బాగుంటుంది. ఈ మూడు దూరం నుంచి రమ్యంగా ఉంటాయి.

దైవం ఫలతి సర్వత్ర న విద్యా న చ పౌరుషమ్
సముద్రమథనాల్లేభే హరిర్లక్ష్మీం హరో విషమ్. 233

తా. అన్ని విషయాలలోను దైవమే ఫలం ఇవ్వాలి. విద్య కాని, పురుషప్రయత్నం కాని ఇవ్వజాలవు. సముద్రం మథిస్తే విష్ణువుకు లక్ష్మి లభించింది; శివునికి విషం దొరికింది.

ద్వావిమౌ పురుషౌ లోకే న భూతౌ న భవిష్యతః
ప్రార్థితం యశ్చ కురుతే యశ్చ నార్థయతే పరాన్. 234

తా. ఇతరులు ప్రార్థించినదానిని చేసేవాడు, ఇతరులను ప్రార్థించని వాడు, ఇలాంటి మనుష్యులు ఇద్దరూ పూర్వం ఉండలేదు, ఇటుపైన ఉండబోరు.

దివసస్యాష్టమే భాగే మన్దీభూతే దివాకరే
నక్తం తత్ర విజానీయాన్న నక్తం నిశి భోజనమ్ 235

తా. 'నక్తం' అనగా పగటి ఎనిమిదవభాగంలో సూర్యుని ప్రకాశ వంతమైన సమయం. అంతేకాని 'నక్తం' అనగా రాత్రి భోజనం కాదు.

దర్శనాద్ధరతే చిత్తం స్పర్శనాద్ధరతే బలమ్
సంభోగాద్ధరతే వీర్యం నారీ ప్రత్యక్షరాక్షసీ 236

తా. (అవసరానుగుణంగా "నరః ప్రత్యక్షరాక్షసః" అని కూడా పాఠం మార్చుకోవచ్చు.

దినాన్తే చ పిబేద్దుగ్ధం నిశాన్తే చ పయః పిబేత్
భోజనాన్తే పిబేత్తక్రం కిం వైద్యస్య ప్రయోజనమ్. 237

తా. సాయంకాలం (రాత్రి) పాలు త్రాగాలి; తెల్లవారుజామున నీళ్ళు త్రాగాలి. భోజనం చివర మజ్జిగ త్రాగాలి. ఇంక వైద్యుని అవసరం ఏముంటుంది.

దోషాకరోఽపి కుటిలోఽపి కలఙ్కితోఽపి
మిత్రావసానసమయే విహితోదయోఽపి,
చన్ద్రస్తథాపి హరవల్లభతాముపైతి
నైవాశ్రితేషు గుణదోష విచారచిన్తా. 238

తా. దోషాకరుడైనా (రాత్రిని చేసేవాడు, దోషాలకు నిలయమైన వాడు అని రెండర్థాలు), వంకరగా ఉన్నా (వక్రస్వభావం కలవాడు అని మరొక అర్థం), కలంకం కలవాడైనా, (అపకీర్తి ఉన్నవాడైనా), మిత్రుని (సూర్యుడు, స్నేహితుడు అని రెండర్థాలు) అపత్సమయంలో ఉదయం (అభివృద్ధి అని మరొక అర్థం) పొందుతున్నా, చంద్రుడు శివునికి ఇష్టుడు అవుతున్నాడు. ఆశ్రయించినవారివిషయంలో గుణదోషవిచారణ ఉండదు కదా!

దుర్బలస్య బలం రాజా బాలానాం రోదనం బలమ్
బలం మూర్ఖస్య మౌనం చ చోరాణామనృతం బలమ్. 239

తా. దుర్బలునికి బలం రాజు. బాలులకు ఏడవడం బలం (పిల్లలు ఏడ్చి నెగ్గుతారు) మూర్ఖుడికి మాటలాడకుండా ఉండడం బలం. దొంగలకు అసత్యం బలం.

దృష్టిపూతం న్యసేత్పాదం వస్త్రపూతం పిబేజ్జలమ్
శాస్త్రపూతం వదేద్వాణీం మనఃపూతం సమాచరేత్ 240

తా. చూపుచేత పరిశుద్ధం చేసి పాదాన్ని ఉంచాలి. (అడుగు వేసే చోటుబాగున్నదో లేదో చూచుకొని అడుగు వెయ్యాలి). వస్త్రంచేత పరిశుద్ధం చేయబడిన నీరు త్రాగాలి. శాస్త్రంచేత పవిత్రంచేయబడిన (శాస్త్రసంమతమైన) మాట పలకాలి. మనస్సుచేత పవిత్రంచేయబడిన దానిని (ఇది ఏమాత్రమూ తప్పు కాదు అని తన మనస్సు చెపుతూన్న పని చెయ్యాలి.

దీపో భక్షయతే ధ్వాన్తం కజ్జలం చ ప్రసూయతే
యథాన్నం భక్షయేన్నిత్యం జాయతే తాదృశీ ప్రజా. 241

తా దీపం చీకటిని తినేస్తుంది; దానినుంచి నల్లటి కాటుక పుడుతుంది. అందుచేత నిత్యమూ ఏ విధమైన అన్నం తింటే అలాంటి సంతానమే కలుగుతుంది.

దృష్ట్వా యతిర్యతిం సద్యో వైద్యో వైద్యం నటం నటః
యాచకో యాచకం దృష్ట్వా శ్వానవద్గుర్గురాయతే. 242

తా ఒక సంన్యాసికి మరొక సంన్యాసి కనబడినా, వైద్యుడికి మరొక వైద్యుడు కనబడినా, నటుడికి మరొక నటుడు కనబడినా, యాచకుడికి మరొక యాచకుడు కనబడినా ఒక కుక్క మరొక కుక్కను చూడగానే గాంౖడించినట్లు గాంౖడిస్తాడు.

దేశాటనం పణ్డితమిత్రతా చ
వారాఙ్గనా రాజసభాప్రవేశః,
అనేకశాస్త్రాణి విలోకితాని
చాతుర్యమూలాని భవన్తి పఞ్చ. 243

తా. దేశసంచారం, పండితులతో స్నేహం, వేశ్యలతో సంబంధం, రాజసభలో ప్రవేశం, అనేకా శాస్త్రాలను పరిశీలించడం - ఈ ఐదూ మనిషికి నేర్పు (చాతుర్యం) కలిగిస్తాయి.

దృష్టిం దేహి పునర్బాలే కమలాయతలోచనే
శ్రూయతే హి పురా లోకే విషస్య విషమౌషధమ్. 244

తా. కమలపత్రములవలె విశాలమైన నేత్రాలు గల ఓ బాలా! మరల ఒకసారి దృష్టిని ప్రసరింపచెయ్యి. విషానికి విషం ఔషధం అనే మాట లోకంలో ప్రసిద్ధం కదా! మొదటి చూపు విషం. ఆ విషాన్ని తొలగించాలంటే రెండవచూపు అనేవిషం కావాలని భావం.

## ధ

ధర్మార్థకామమోక్షాణాం యస్యైకోఽపి న విద్యతే
అజాగలస్తనస్యేవ తస్య జన్మ నిరర్థకమ్. 245

తా. ధర్మ-అర్థ-కామ-మోక్షాలలో ఏ ఒక్కదానినీ సంపాదించలేని వాని జీవితం మేక మెడలోని స్తనం వలె వ్యర్థం

ధనధాన్యప్రయోగేషు విద్యాసంగ్రహణేషు చ
ఆహారే వ్యవహారే చ త్యక్తలజ్జః సుఖీ భవేత్. 246

తా. ధనధాన్యాదివిషయాలలోను, విద్యను సంపాదించడంలోను, ఆహారంలోను, వ్యవహారంలోను సిగ్గు (మోమాటం) లేనివాడు సుఖంగా ఉంటాడు.

ధర్మేణ హన్యతే వ్యాధి ర్హన్యన్తే వై తథా గ్రహాః
ధర్మేణ హన్యతే శత్రు ర్యతో ధర్మస్తతో జయః. 247

తా. ధర్మం వ్యాధిని నశింపచేస్తుంది. ధర్మం గ్రహాలను తొలగదీస్తుంది. ధర్మం శత్రువును సంహరిస్తుంది ధర్మం ఉన్నచోట జయం ఉంటుంది.

ధిక్ గృహం గృహిణీ శూన్యం ధిక్కళత్రమపుత్రకమ్
ధిక్ పుత్రమవినీతం చ ధిగ్ జ్యోతిషమజాతకమ్. 248

తా. ఇల్లాలు లేని ఇల్లు నిందించదగినది. పుత్రులు లేని భార్య నిందించదగినది, వినయము లేని పుత్రుడు నిందింపదగినవాడు. జాతక జ్ఞానం లేని జ్యోతిః శాస్త్రపరిచయం నిందింపదగినది.

ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతామ్
న శక్యం యత్పరిత్యక్తుమాత్మచ్ఛన్దేన జీవితమ్. (రామా॰)

తా. [లంకలో సీత అనుకుంటూన్న మాటలు]. తన ఇష్టం ప్రకారం ప్రాణాలు విడిచి పెట్టడానికి కూడా శక్యం కాకుండా ఉంది. మనుష్యత్వము ఛీ! ఎంత చెడ్డది! ఛీ! పరవశత్వము ఎంత చెడ్డది.

ధనికః శ్రోత్రియో రాజా నదీ వైద్యస్తు పఞ్చమః
పఞ్చ యత్ర న విద్యన్తే న తత్ర దివసం వసేత్. 250

తా. అప్పు ఇచ్చేవాడు, వేదం చదువుకున్నవాడు, రాజు, ప్రభువు, నది, వైద్యుడు ఈ ఐదూ లేనిచోట ఒక్కరోజు కూడ ఉండకూడదు

ధర్మార్థం యస్య విత్తేహా వరం తస్య నిరీహతా
ప్రక్షాళనాద్ధి పఙ్కస్య దూరదస్పర్శనం వరమ్. 251

## న

న చ పశ్యతి జన్మాన్ధః కామాన్ధో నైవ పశ్యతి
న పశ్యతి మదోన్మత్తో హ్యర్థీ దోషాన్న పశ్యతి. 252

తా. పుట్టుగ్రుడ్డివాడు చూడజాలడు. కామాంధుడు చూడడు. మదం చేత ఉన్మత్తుడైనవాడు చూడడు. యాచకుడు దోషాలు చూడడు.

నృపతేః ప్రతిషిద్ధమేవ త
త్కృతవాన్ పఙ్క్తిరథో విలఙ్ఘ్య యత్,

అపథే పదమర్పయన్తి హి
శ్రుతవన్తోఽపి రజోనిమీలితాః. (రఘు). 253

తా. వేటాడడం రాజుకు నిషిద్ధమే అయినా దశరథుడు ఆ పని చేశాడంటే ఏమనాలి ? విద్యావంతులు కూడా రజస్సు కళ్ళు కప్పివేయడంతో చెడ్డ మార్గంలో అడుగు పెడుతూ ఉంటారు.

నిమగ్నస్య పయోరాశౌ పర్వతాత్పతితస్య చ
తక్షకేణాపి దష్టస్య ఆయుర్మర్మాణి రక్షతి. 254

తా. సముద్రంలో మునిగినా, పర్వతంనుంచి పడినా, తక్షకుడు కరిచినా ఆయుర్దాయం ఉంటే అది మర్మాలను రక్షిస్తుంది.

నమస్కారసహస్రేషు శాకపత్రం న లభ్యతే
ఆశీర్వాదసహస్రేషు రోమవృద్ధిర్న జాయతే. 255

తా. వెయ్యిదండాలు పెట్టినా కూరఆకు కూడా లభించదు ! వెయ్యి ఆశీర్వాదాలు చేసినా రోమాలు పెరగవు.

న స్వల్పమప్యధ్యవసాయభీరోః
కరోతి విజ్ఞాననిధిర్గుణం హి,
అన్ధస్య కిం హస్తతలస్థితోఽపి
ప్రకాశయత్యర్థమిహ ప్రదీపః. 256

తా. నిర్ణయం తీసుకోవడానికి భయపడేవానివద్ద విజ్ఞానం అనే నిధి ఎంత ఉన్నా అది అతనికి ఏమాత్రమూ ఉపయోగించదు. గ్రుడ్డివాని చేతిలో దీపం ఉన్నా అది వానికి వస్తువులను చూపజాలదు కదా.

నౌకాం వై భజతే తావద్యావత్పారం న గచ్ఛతి
ఉత్తీర్ణే తు పరే పారే నౌకాయాః కిం ప్రయోజనమ్. 257

తా. అవతలి ఒడ్డు చేరనంతవరకు నావ కావాలి. అవతలి ఒడ్డు చేరిన తరువాత నావ ఎందుకు?

నాటకే భవభూతిర్వా వయం వా వయమేవ వా
ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే. 258

తా. ఇతర నాటకాల విషయంలో భవభూతి గొప్పవాడో మేమూ మేమూ గొప్పవాళ్ళమో చెప్పలేం. ఉత్తరరామచరితంలోమాత్రం భవభూతే గొప్పవాడు.

నిర్విషేణాపి సర్పేణ కర్తవ్యా మహతీ ఫణా
విషం భవతు వా మా వా పటాటోపో భయంకరః. 259

తా. విషం లేకపోయినా పాము పెద్ద పడగ ఎత్తాలి. విషం ఉండనీ లేకపోనీ, పటాటోపం (పడగ ఆడంబరం) భయం కలిగిస్తుంది.

న గృహం గృహమిత్యాహుర్గృహిణీ గృహముచ్యతే
గృహం తు గృహిణీహీనం కాన్తారా దతిరిచ్యతే 260

ఇల్లు ఇల్లు కాదు, ఇల్లాలే ఇల్లు. ఇల్లాలు లేని ఇల్లు అడవికంటె కూడా కనికిష్టం. (సుఖనివాసానర్హమని భావము)

న చ విద్యాసమో బన్ధుర్న చ వ్యాధిసమో రిపుః
న చాపత్యసమః స్నేహీ న చ ధర్మో దయాపరః. 261

తా. విద్యకంటె బంధువు లేదు. వ్యాధివంటి శత్రువు లేదు. సంతానంవంటి స్నేహపాత్రం మరేదీ లేదు. దయను మించిన ధర్మం లేదు.

నాన్నోదకసమం దానం న తిథిర్ద్వాదశీసమా
న గాయత్ర్యాః పరో మన్త్రో న మాతుః పరదైవతమ్. 262

తా. అన్నోదకాల దానంవంటి దానం లేదు. ద్వాదశివంటి తిథి లేదు. గాయత్రికంటె శ్రేష్ఠమైన మంత్రం లేదు. తల్లిని మించిన దైవం లేదు.

న గచ్ఛేతాం పితాపుత్రౌ న గచ్ఛేత్సోదరద్వయమ్
నవ నార్యో న గచ్ఛేయుర్న గచ్ఛేద్బ్రాహ్మణత్రయమ్. 263

తా ఏదైనా పనిమీద వెళ్ళేటప్పుడు తండ్రికొడుకులు, ఇద్దరు సహోదరులు, తొమ్మండుగురు ఆడవాళ్లు ముగ్గురు బ్రాహ్మణులు కలిసి వెళ్లకూడదు.

న గచ్ఛేచ్ఛూద్రచాతుష్కం న గచ్ఛేద్వైశ్యపఞ్చకమ్
న గచ్ఛేద్యుగ్మకిం రాజ్ఞోర్న గచ్ఛేద్బ్రహ్మణత్రయమ్. 264

తా. నలుగురు శూద్రులు ఐదుగురు వైశ్యులు, ఇద్దరు క్షత్రియులు, ముగ్గురు బ్రాహ్మణులు కలిసి వెళ్లకూడదు.

న వృథా శపథం కుర్యాత్స్వల్పేఽప్యర్థే నరో బుధః
వృథా హి శపథం కుర్వన్ ప్రేత్య చేహ చ నశ్యతి. 265

తా. తెలివైనవాడు చిన్న చిన్న విషయాలకి కూడా ఒట్టు పెట్టకూడదు, వృథాగా శపథం చేసేవాడు ఇహలోకంలోను, మరణాంతరమూ కూడ అపాయం పొందుతాడు

న దేవాయ న ధర్మాయ న బన్ధుభ్యో న చార్థినే
దుర్జనే నార్జితం ద్రవ్యం భుజ్యతే రాజతస్కరైః. 266

తా. దుర్జనుడు సంపాదించిన ధనం దేవకార్యానికి ఉపయోగించదు, ధర్మానికి ఉపయోగించదు, బంధువులకు ఉపయోగించదు, యాచకులకు ఉపయోగించదు. దానిని రాజులు, దొంగలు అనుభవిస్తారు.

నరాణాం నాపితో ధూర్తః పక్షిణాం చైవ వాయసః
చతుష్పదాం శృగాలస్తు స్త్రీణాం ధూర్తా చ మాలినీ. 267

తా. మనుష్యులలో మంగలి దూర్తుడు. పక్షులలో కాకి ధూర్తత్వము కలది. చతుష్పాజ్జంతువులలో నక్క ధూర్తత్వము కలది స్త్రీలలో మాలలు అమ్మేది దూర్తురాలు

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్. (భ.గీ.)

తా, ఆత్మజ్ఞానం కలవారికి కర్మలు చేసే అవసరం లేదు, కదా అని కర్మాసక్తులైన అజ్ఞానులకు చిత్త విభ్రాంతి కలిగించకూడదు. వాళ్లు కర్మలు చేయవలసిందే జ్ఞాని కూడా అజ్ఞానులకు మార్గప్రదర్శనం చేయడంకోసం శ్రద్ధగా కర్మలు చేస్తూ ఫలత్యాగం ద్వారా అవి ఫలం ఇవ్వకుండా ఉండే టట్లు చూచుకోవాలి

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే. (మ.భా) 269

తా. కోరికలను(భోగాలను)అనుభవించడంచేత కోరిక ఎపుటికీ శాంతించదు నెయ్యి హోమంచేసిన కొలదీ అగ్ని ప్రజ్వరిల్లినట్లు కామాలు అనుభవించినకొలదీ అవి పెరుగుతూనే ఉంటాయి.

న విషం విషమిత్యాహుర్దేవస్వం విషముచ్యతే
విషమేకాకినం హన్తి దేవస్వం పుత్రపౌత్రకమ్. 270

తా. నిజానికి విషం విషం కాదు, దేవుడి సొమ్ము విషం మామూలు విషం తిన్నవానిని ఒకనినే చంపుతుంది, దేవతల సొమ్ము పుత్రుల్నీ పౌత్రుల్ని కూడ నశింపచేస్తుంది.

నలికాగతమపి కుటిలం న భవతి సరలం శునః పుచ్ఛమ్
తద్వత్ఖలజనహృదయం బోధితమపి నైవ యాతి మాధుర్యమ్.

తా కుక్కతోక గొట్టంలో ఉంచి బంధించినా తిన్నగా అవదు అట్లే ఎంత బోధించినా దుర్మార్గుల హృదయం మంచితనాన్ని పొందదు.

న విషం భక్షయేత్ప్రాజ్ఞో న క్రీడేత్పన్నగైః సహ
న నిన్దేద్యోగిబృన్దాని బ్రహ్మద్వేషం న కారయేత్. 272

తా బుద్ధిమంతుడు విషం భక్షించకూడదు. పాములతో ఆడగూడదు యోగులను నిందించగూడదు వేదాన్ని ద్వేషించకూడదు.

న తథాస్య భవేత్క్లేశో బన్ధశ్చాన్యప్రసంగతః
యోషిత్సంగాద్యథా పుంసో యథా తత్సంగిసంగతః 273

తా. పురుషునికి స్త్రీపై ఆసక్తివల్లా, స్త్రీలయందు ఆసక్తులైన వారితో సంబంధంవల్ల ఎంత క్లేశం కలుగుతుందో అంత క్లేశం మరే సంబంధంవల్లా కలుగదు.

న విశ్వసేత్కుమిత్రం చ మిత్రం చాపి న విశ్వసేత్
కదాచిత్కుపితం మిత్రం సర్వం గుప్తం ప్రకాశయేత్. 274

తా. చెడ్డ స్నేహితుణ్ణి నమ్మకూడదు, మిత్రుణ్ణి కూడా పూర్తిగా నమ్మకూడదు. ఎందుచేతనంటే ఎంత మిత్రుడైనా ఎప్పుడైనా కోపం వస్తే రహస్యాలన్నీ బైటపెట్టవచ్చు.

నా జారజః పితృద్వేషీ నాజారా భర్తృఘాతినీ
నామునిర్గ్రంథకర్తా చ నావిష్ణుః పృథివీపతిః 275

తా. జారునివలన పుట్టినవాడుతప్ప మరొకడు తండ్రిని ద్వేషించడు. కులట కానిది భర్తను చంపదు. ముని కానివాడు గ్రంథరచన చేయజాలడు. విష్ణ్వంశ లేనివాడు రాజ్యపాలకుడు కాజాలడు.

నాఋషిః కురుతే కావ్యం నారుద్రః క్రమపాఠకః
నాదేవాంశో దదాత్యన్నం నావిష్ణుః పృథివీపతిః. 276

తా ఋషికానివాడు కావ్యం రచించజాలడు. రుద్రాంశ లేనివాడు క్రమపాఠకుడు కాజాలడు. దేవాంశ లేనివాడు అన్నదానం చేయజాలడు. విష్ణువు కానివాడు (విష్ణ్వంశ లేనివాడు) రాజ్యపాలకుడు కాజాలడు.

న పుత్రాత్పరమో లాభో న భార్యాయాః పరం సుఖమ్.
న ధర్మాత్పరమం మిత్రం నానృతాత్పాతకం పరమ్. 277

తా. పుత్రుని మించిన లాభం మరొకటి లేదు భార్యను మించిన సుఖం మరొకటి లేదు. ధర్మాన్ని మించిన మిత్రుడు లేదు. అనత్యాన్ని మించిన పాపం మరొకటి లేదు

# న

నానృతాత్పాతకం కించిన్న సత్యాత్సుకృతం పరమ్
వివేకాన్న పరో బన్ధు రితి వేదవిదో విదుః. 278

తా. "అసత్యాన్ని మించిన పాపం లేదు. సత్యాన్ని మించిన పుణ్యం లేదు. వివేకాన్ని మించిన బంధువు లేదు" అని వేదవేత్తలు చెప్పుచున్నారు.

నాస్తి క్షుధాసమం దుఃఖం నాస్తి రోగః క్షుధాసమః
నాస్త్యాహారసమం సౌఖ్యం నాస్తి క్రోధసమో రిపుః. 279

తా. ఆకలివంటి దుఃఖం లేదు ఆకలివంటి రోగం లేదు. ఆహారం వంటి సౌఖ్యం లేదు క్రోధం వంటి శత్రువు లేదు.

నాకాలే మ్రియతే జన్తుర్విద్ధః శరశతైరపి
కుశాగ్రేణైవ సంస్పృష్టః ప్రాప్తకాలో న జీవతి. 280

తా వందల కొలది బాణాలు ప్రయోగించి కొట్టినా మానవుడు (ప్రాణి) అకాలంలో (మరణకాలం రానంతవరకు) మరణించడు. మరణం సమీపించిన వాడు దర్భ చివరి భాగం (ముల్లు) గ్రుచ్చుకున్నా మరణిస్తాడు

నాగుణీ గుణినం వేత్తి గుణీ గుణిషు మత్సరీ
గుణీ చ గుణరాగీ చ విరలః సరలో జనః. 281

తా. గుణాలు లేనివాడు గుణవంతునిలో ఉన్న గుణాలు గ్రహించజాలడు. గుణవంతుడికి గుణవంతుణ్ణి చూస్తే అసూయ. గుణవంతుడై ఉండి (ఇతరుల) గుణాలయందు ఆసక్తి చూపే సరళబుద్ధిగలవారు విరలంగా (అరుదుగా) ఉంటారు.

న సంపత్తిః క్రియాసక్తిర్భేషజం చ న విద్యతే
సర్వరోగవినాశాయ నిశాన్తే చ పయః పిబేత్. 282

తా. డబ్బు ఖర్చు లేదు, ఏ పెద్ద ప్రయత్నమూ చేయనక్కరలేదు, వైద్యం లేదు. సర్వరోగాలు నశించాలంటే తెల్లవారజామున నీళ్లు త్రాగాలి.

నీచాశ్రయో న కర్తవ్యః కర్తవ్యో మహదాశ్రయః
అజః సింహప్రసాదేన ఆరూఢో గజమస్తకే. 283

తా. నీచుల్ని ఆశ్రయించకూడదు, గొప్పవాళ్ళని ఆశ్రయించాలి సింహం అనుగ్రహంచేత మేక కూడ ఏనుగు తలమీదకి ఎక్కగలిగింది.

నిర్వాణదీపే కిము తైలదానం
చోరే గతే వా కిము సావధానమ్,
వయోతిగే కిం వనితావిలాసః
పయోగతే కిం ఖలు సేతుబన్ధః. 284

తా. దీపం ఆరిపోయిన తరవాత నూనె పోసి ఏం ప్రయోజనం? దొంగ పారిపోయిన తరవాత జాగ్రత్తగా ఉండి ఏం ప్రయోజనం? వయస్సు మళ్లిన తరవాత స్త్రీ విలాసాలు ఏమిటి! నీళ్లు వెళ్లిపోయిన తరవాత సేతువు కట్టి ఏమి ప్రయోజనం?

న విద్యా కారణం పుంసాం దైవమేవాత్ర కారణమ్
పాషాణస్య కుతో విద్యా యేన దేవత్వమాప్నుయాత్. 285

తా. పురుషులు ఔన్నత్యం పొందడానికి కారణం విద్య కాదు, దైవమే కారణం. రాయికి ఏమి విద్య ఉన్నదని అది దేవత అయింది?

నాదోపాసనయా దేవా బ్రహ్మా విష్ణు మహేశ్వరాః
భవన్త్యుపాసితా నూనం యస్మాదేతే తదాత్మకాః. 286

తా. బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నాదస్వరూపులు. నాదోపాసన చేస్తే బ్రహ్మవిష్ణుమహేశ్వరుల ఉపాసన చేసినట్లు అవుతుంది.

నిర్వాతే యే గుణాః ప్రోక్తాస్తే గుణాః కర్ణబన్ధనే
యే గుణా లఙ్ఘనే ప్రోక్తాస్తే గుణా లఘుభోజనే. 287

తా. ఈదురుగాలి లేని ప్రదేశంలో ఉండడం వల్ల ఏ లాభాలు చెప్ప బడ్డాయో అవి చెవులకు బంధనం కట్టుకోవడంవల్ల కూడా ఉంటాయి. లంఘనంలో చెప్పిన లాభాలు లఘుభోజనంలో కూడా ఫలిస్తాయి.

న శరన్మేఘవత్కార్యం వృథైవ ఘనగర్జితమ్
పరస్యార్థమనర్థం వా ప్రకాశయతి నో మహాన్. 288

తా. శరత్కాలమేఘంవలె వృథాగా ఘనంగా గర్జించకూడదు. మహాత్ముడు ఇతరుల లాభాన్ని కాని నష్టాన్ని కాని గూర్చి పైకి చెప్పడు.

నారీణాం నాయకం నేత్రం వైశ్యానాం నాయకం ధనమ్
విప్రాణాం నాయకం విద్యా వార్తాకం శాకనాయకమ్. 289

తా. స్త్రీలకు శోభ కూర్చేది నేత్రాలు. వైశ్యులకు గౌరవం ఇచ్చేది ధనం. బ్రాహ్మణులకు గౌరవం తెచ్చేది విద్య. కూరలలో ఉత్తమమైనది వంకాయ.

న భూతపూర్వం న కదాపి వార్తా
హేమ్నః కురఙ్గో న కదాపి దృష్టః,
తథాపి తృష్ణా రఘునన్దనస్య
వినాశకాలే విపరీతబుద్ధిః. 290

తా. బంగారులేడి పూర్వం ఎన్నడూ లేదు; ఉన్నట్లు ఎవరూ చెప్ప లేదు; ఎవరూ చూడలేదు. అయినా రామునికి దురాశ కలిగింది. వినాశకాలం వస్తే బుద్ధి విపరీతంగా ప్రవర్తిస్తుంది (నాల్గవపాదం సమన్వి).

నదీనాం చ నఖీనాం చ శృఙ్గిణాం శస్త్రపాణినామ్
విశ్వాసో నైవ కర్తవ్యః స్త్రీషు రాజకులేషు చ, 291

తా. నదులు, గోళ్ళున్న జంతువులు, కొమ్ములున్న జంతువులు, ఆయుధం చేతిలో ఉన్నవాళ్లు, తరుణులు, రాజాస్థానాలు వీటిని విశ్వసించ కూడదు.

నాపితస్య గృహే క్షౌరం పాషాణే గన్ధలేపనమ్
ఆత్మరూపం జలే దృష్టం శక్రస్యాపి శ్రియం హరేత్. 292

తా. మంగలి ఇంటికి వెళ్లి క్షౌరం చేయించుకోవడం, సానమీది గంధము ను సరాసరిగా పూసికొనుట, నీటిలో తన ప్రతిబింబం చూచుకోవడం-ఇవి ఇంద్రునిఐశ్వర్యాన్ని కూడా పోగొడతాయి.

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. (భ.గీ.)

తా. ఏ కోరికలూ లేనివాడై, దేహేంద్రియాదుల్ని అదుపులో ఉంచుకొని, ధనం కూడబెట్టుకొనకుండా కేవలం శరీరంవల్ల జరిగే పనులు చేస్తూ ఉండేవానికి ఏ పాపాలూ అంటవు

న కాలనియమోఽథవా ఋణధనాదిసంశోధనం
న భూతపరిశుద్ధిరప్యథ న చాత్ర దిగ్బన్ధనమ్,
నా చాఙ్గకరమాతృకాన్యసనవాయుసంశోధనం
"శివాయ గురవే నమః" పరమమన్త్రిసమ్రాజయమ్. 294

తా. "శివాయ గురవే నమః" అనేది మహామంత్రాలలో సమ్రాట్ వంటిది. ఇతరమంత్రాలకి వలె ఈ కాలంలోనే జపించాలనే నియమం లేదు. జపించేవానికి అర్వణం ఉందా? లాభం కలుగుతుందా? నష్టం కలుగుతుందా? అన్న పరీక్ష అవసరం లేదు. భూతపరిశుద్ధి చేయనక్కరలేదు. దిగ్బంధనం కాని, అంగన్యాస-కరన్యాస-మాతృకాన్యాసాలు కాని, ప్రాణాయామం కాని అవసరం లేదు.

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్. 295

తా. దీనిలో ప్రారంభించి నష్టపోవడం అనేది లేదు. ప్రత్యవాయం (చెడుఫలం)లేదు ఈ ధర్మాన్ని (కర్మయోగాన్ని) స్వల్పంగా ఆచరించినా అది గొప్ప భయంనుంచి కాపాడుతుంది

## ప

ప్రజా న రంజయేద్యస్తు రాజా రక్షాదిభిర్గుణైః
అజాగలస్తనస్యేవ తస్య జన్మ నిరర్థకమ్. 296

తా రక్షణాదులచేత ప్రజలకు ఆనందం కలిగించని రాజు (ప్రభువు) జీవితం మేక కంఠంలో ఉన్న చన్నువలె వ్యర్థం.

పథి చ్యుతం తిష్ఠతి దైవరక్షితమ్
గృహేస్థితం దైవహతం వినశ్యతి,
జీవత్యనాథోఽపి వనే విసర్జితః
కృతప్రయత్నోఽపి గృహే న జీవతి. 297

తా. దారిలో పోగొట్టుకున్నది కూడా దైవం రక్షించడంచేత మళ్లీ దొరుకుతుంది. ఇంట్లో దాచినది కూడా దైవం ప్రతికూలంగా ఉంటే పోతుంది. అడవిలో విడిచిపెట్టిన అనాథుడు కూడా బ్రతుకుతాడు; ఇంట్లో ఉన్నవాడు కూడా ఎంత ప్రయత్నం చేసినా జీవించడు.

ప్రాతర్ద్యూతప్రసఙ్గేన మధ్యాహ్నే స్త్రీప్రసంగతః
రాత్రౌ చోరప్రసంగేన కాలో గచ్ఛతి ధీమతామ్. 298

తా. బుద్ధిమంతులు ప్రాతఃకాలంద్యూతప్రసంగంతోను, మధ్యాహ్నం స్త్రీప్రసంగంతోను, రాత్రి చోర ప్రసంగంతోను కాలక్షేపం చేస్తూఉంటారు. (వరుసగా భారత-రామాయణ-శ్రీమద్భాగవత ప్రసంగాలని అర్థం).

పుష్పేషు చమ్పా నగరీషు లఙ్కా-
నదీషు గఙ్గా చ నృపేషు రామః,
యోషిత్సు రమ్భా పురుషేషు విష్ణుః
కావ్యేషు మాఘః కవి కాలిదాసః. 299

తా. పువ్వులలో సంపెంగపువ్వు, నగరాలలో లంక, నదులలో గంగ రాజులలో రాముడు, స్త్రీలలో రంభ, పురుషులలో విష్ణువు, కావ్యాలలో మాఘుడు రచించిన శిశుపాలవధం, కవులలో కాళిదాసు గొప్ప.

పఠతో నాస్తి మూర్ఖత్వం జపతో నాస్తి పాతకమ్
మౌనినః కలహో నాస్తి న భయం చాస్తి జాగ్రతః 300

తా. చదువుతూ ఉండేవాడికి మూర్ఖత్వం ఉండదు. జపం చేసేవానికి పాపాలు ఉండవు. మౌనంగా ఉండేవాడికి కలహం ఉండదు. మెలకువగా ఉన్నవానికి భయం లేదు.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే. 301

తా. సత్పురుషులను రక్షించడంకోసం, దుర్మార్గులను నశింపచేయడం కోసం, ధర్మాన్ని స్థాపించడంకోసం ప్రతియుగంలో (ఆయా కాలాలలో) అవతరిస్తూ ఉంటాను (ఇది శ్రీకృష్ణుడు చేసిన ప్రతిజ్ఞ).

పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్యా పునర్మహీ
ఏతత్సర్వం పునర్లభ్యం న శరీరం పునః పునః. 302

తా. ధనం మళ్లీ సంపాదించవచ్చు మిత్రుడు మళ్లీ లభించవచ్చు. భార్య మళ్లీ దొరకవచ్చు. భూమి మళ్లీ పొందవచ్చు. ఇవన్నీ మళ్లీ దొరకవచ్చు. అయితే శరీరం మళ్లీ మళ్లీ రమ్మంటే రాదు.

పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే
పుత్రో రక్షతి వార్ధక్యే న స్త్రీ స్వాతన్త్ర్యమర్హతి. (మ.స్మృ.)

తా. బాల్యంలో తండ్రి రక్షిస్తాడు. యౌవనంలో భర్త రక్షిస్తాడు వార్ధక్యంలో పుత్రుడు రక్షిస్తాడు; స్త్రీ స్వతంత్రురాలుగా (మగవారి రక్షణ లేకుండగా) ఉండకూడదు.

పదాపి యువతీం భిక్షుర్న స్పృశేద్దారవీమపి
స్పృశన్ కరీవ బధ్యేత కరిణ్యా అఙ్గసంగతః. 304

తా. సంన్యాసి కఱ్ఱతో చేసిన యువతిని కూడా, కాలితో కూడా ముట్టుకొనగూడదు. అలా స్పృశించినవాడు ఆడఏనుగు శరీరాన్ని స్పృశించిన ఏనుగు వలె బంధంలో చిక్కుకుంటాడు.

పితా రత్నాకరో యస్య లక్ష్మీర్యస్య సహోదరీ
శఙ్ఖో భిక్షాటనం కుర్యాన్నాదత్తముపతిష్ఠతే. 305

తా. శంఖానికి తండ్రి రత్నాలతో నిండి ఉన్న సముద్రుడు; లక్ష్మి సోదరి; ఐతే నేమి బిక్షాటనం చేసుకుంటూన్నది పెట్టి పుట్టనిదే ఏదీ దొరకదు.

పిణ్డే పిణ్డే మతిర్భిన్నా తుణ్డే తుణ్డే సరస్వతీ
దేశే దేశే విభాషా స్యాన్నానారత్నా వసున్ధరా. 306

తా. పుట్టికు ఒక బుద్ధి. ఒక్కొక్క నోటికి ఒక్కొక్క సరస్వతి (మాట). ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క విశిష్టభాష. పృథివి అనేక రత్నాలతో నిండి ఉన్నది కదా!

పుణ్యైర్మూలఫలైః ప్రియ ప్రణయినీం వృత్తిం కురుష్వాధునా
భూశయ్యాం నవపల్లవైః కురు త్వముత్తిష్ఠ యామో వనే,
క్షుద్రాణామవివేకమూఢమనసాం యత్రేశ్వరాణాం సదా
విత్తవ్యాధ్యవివేకసంకులగిరాం నామాపి న శ్రూయతే. 307

తా. ఓ! ప్రియుడా! పవిత్రములైన మూలములు, ఫలములు తిని ప్రేమభరితమైన జీవనమును గడుపుము. కొత్త చిగుళ్లు, గడ్డి పరచిన నేలపై శయనించుము. లెమ్ము; నీచులు, వివేకం లేకపోవడంచేత మూఢమైన మనస్సు కలవారు, ధన మనే వ్యాధిచేత, అవివేకంచేత వ్యాకులంగా మాటలాడేవారు అయిన ప్రభువుల పేరు కూడా ఎక్కడ వినబడదో అట్టి వనానికి వెళ్లిపోదాం.

పినాకఫణిబాలేన్దుభస్మమన్దాకినీయుతా
పవర్గరచితా మూర్తి రపవర్గప్రదాయినీ. 308

తా. పినాకము (ధనస్సుపేరు) ఫణి (సర్పము), బాలేందువు (చంద్రరేఖ) భస్మము, మందాకిని (గంగ) అనే పవర్గాక్షరాలున్న వస్తువులతో

అలంకరించబడిన మూర్తి (శివుడు) అపవర్గాన్ని (పవర్గం కానిదాన్ని, మోక్షాన్ని అని రెండు అర్థాలు) ఇస్తుంది!

పరోపదేశే పాణ్డిత్యం సర్వేషాం సుకరం నృణామ్
ధర్మే స్వీయమనుష్ఠానం కస్య చిత్తు మహాత్మనః. 309

తా. ఇతరులకు ఉపదేశం చేసేటప్పుడు పాండిత్యం ప్రదర్శించడం అందరికీ సులభమే అయితే స్వయంగా ధర్మం అనుష్ఠించే మహాత్ములు ఎక్కడో కాని ఉండరు.

పరోపదేశపాణ్డిత్యే శిష్టాః సర్వే భవన్తి వై
విస్మరన్తీహ శిష్టత్వం స్వకార్యే సముపస్థితే. 310

తా. ఇతరులకు ఉపదేశించేటప్పుడు పాండిత్యం ప్రదర్శించడంలో అందరూ శిష్టులే. తమదాకా వచ్చేటప్పటికి మాత్రం ఆ శిష్టత్వాన్ని మరచి పోతారు.

పరోపదేశసమయే జనాః సర్వేఽపి పణ్డితాః
తదనుష్ఠానసమయే మునయోఽపి న పణ్డితాః 311

తా. ఇతరులకు ఉపదేశం చేసేటప్పుడు అందరూ పండితులే. దాన్ని అనుష్ఠించేటప్పుడు మాత్రం మునులు కూడా పండితులు కారు.

పరసేవా సుఖం హన్తి ప్రాణం హన్యుః పరస్త్రియః
పరాన్నం సుకృతం హన్తి బ్రహ్మద్వేషే కులక్షయః. 312

తా. పరులసేవ సుఖాన్ని నశింపచేస్తుంది. పరస్త్రీలు ప్రాణాలు తీస్తారు. పరుల అన్నం పుణ్యాన్ని నశింపచేస్తుంది. వేదద్వేషం కులక్షయం చేస్తుంది.

పఞ్చమేఽహని షష్ఠే వా శాకం పచతి యో గృహే
అనృణీ చాప్రవాసీ చ స వారిచర ! మోదతే. (మ.భా) 313

తా. ఓ! హంసా! ఎవడు తన ఇంట్లో ఐదవ రోజున గాని ఆరవ రోజున గాని కూర వండుకొని తింటాడో, ఋణం లేకుండా, గ్రామం విడిచి

వెళ్లవలసిన పని లేకుండా ఉంటాడో అతడే నిజమైన సంతోషం అనుభ విస్తాడు

పరస్పరాణి మర్మాణి యే వదన్తి నరాధమాః
పరస్పరం క్షయం యాన్తి వల్మీకోదరసర్పవత్. 314

తా. ఏ నరాధములు ఒకరి మర్మాలు (రహస్యాలు) ఒకరు వెళ్ల డిస్తూ ఉంటారో వాళ్లు ఒకే పుట్టలో చేరిన పాముల వలె ఒకరికొకరు అప కారం చేసికొని నశిస్తారు.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః. (భ గీ. 315

ఎవడు నాకు భక్తిపూర్వకంగా ఒక పత్రం కాని, పుష్పం కాని, ఫలం కాని, ఉదకం గాని సమర్పిస్తాడో అలాంటి పవిత్రమనస్సు కలవాడు సమర్పించిన ఆ పత్రం మొదలైనదానిని నేను తీసుకుంటాను

పఞ్చభిః సహ గన్తవ్యం స్థాతవ్యం పఞ్చభిః సహ
పఞ్చభిః సహ వక్తవ్యం న దుఃఖం పఞ్చభిః సహ. 316

తా. ఐదుగురితో కలిసి వెళ్లాలి. ఐదుగురితో కలిసి ఉండాలి. ఐదు గురితో కలిసి మాటలాడుకోవాలి. ఐదుగురితో కలిసి ఉంటే దుఃఖం ఉండదు. (పఞ్చభిః అనగా తెలుగులో "నలుగురితో పాటు" అన్నట్లు)

పిబన్తి నద్యః స్వయమేవ నామ్భః
స్వయం న ఖాదన్తి ఫలాని వృక్షాః,
నాదన్తి సస్యం ఖలు వారివాహాః
పరోపకారాయ సతాం విభూతయః. 317

తా. నదులు తమ నీళ్లు తామే తాగవు చెట్లు తమ పండ్లు తినవు. మేఘాలు సస్యాలను తినవు. సత్పురుషుల ఐశ్వర్యం పరోపకారం కొరకే.

పథ్యే సతి గదార్తస్య కిమౌషధనిషేవణమ్
పథ్యేఽసతి గదార్తస్య కిమౌషధనిషేవణమ్. 318

తా. రోగి పథ్యం సరిగా చేస్తే మందు వేసుకోవడం ఎందుకు? రోగి సరిగా పథ్యం చేయకపోతే మందు వేసికొని ఏమి ప్రయోజనం?

ప్రవాహపతితం కార్యం కుర్వన్నపి న లిప్యసే
బాహ్యే సర్వత్ర కర్తృత్వమావహన్నపి రాఘవ! 319

తా. రామా! బాహ్యప్రపంచానికి సంబంధించిన అన్ని విషయాల లోను కర్తృత్వం వహించినా ప్రవాహంవలె వచ్చి మీదపడిన కర్మలు చేస్తున్నా నీవు లిప్తుడవు కావు; (ఆ ఫలం నీకు అంటదు).

పౌలస్త్యః కథమన్యదారహరణే దోషం న విజ్ఞాతవా
నక్షైశ్చాపి యుధిష్ఠిరేణ రమతా జ్ఞాతో న దోషో ను కిమ్,
రామేణాపి వనే స హేమహరిణస్యాసంభవో లక్షితః
ప్రత్యాసన్న విపత్తి మూఢమనసాం ప్రాయో మతిః క్షీయతే. 320

తా. పరభార్యను హరించడం పాపం అని రావణుడు ఎట్లు గ్రహించ లేకపోయాడు? ద్యూతం ఆడడం మంచిది కాదని ధర్మరాజుకు తెలియదా? అరణ్యంలో ఉన్నప్పుడు రామునికి బంగారు లేడి ఉండ దనే విషయం ఎందుకు తెలియదు? బహుశా ఆపదలు రానున్నప్పుడు మనస్సులు పని చేయక గొప్పవాళ్ల బుద్ధి కూడా క్షీణిస్తుంది.

ప్రత్యక్షే గురవః స్తుత్యాః పరోక్షే మిత్రబాన్ధవాః
కార్యాన్తే దాసభృత్యాశ్చ పుత్రా నైవ తథా స్త్రియః. 321

తా. పెద్దలను వారి ఎదుటనే స్తుతించాలి. మిత్రుల్ని, బంధువుల్ని వాళ్ల పరోక్షంలో స్తుతించాలి. దాసులను, భృత్యులను పని పూర్తి అయిన తరవాత మెచ్చుకోవాలి. పుత్రులను, భార్యలను ఎన్నడూ స్తుతించకూడదు.

ప్రథమే నార్జితా విద్యా ద్వితీయే నార్జితం ధనమ్
తృతీయే న తపస్తప్తం చతుర్థే కిం కరిష్యసి. 322

తా. మొదటి వయస్సులో (బాల్యంలో) చదువుకొనలేదు; రెండవ వయస్సులో (యౌవనంలో) ధనం సంపాదించలేదు. మూడవ వయస్సులో (మధ్యమ వయస్సులో) తపస్సు చేసుకొనలేదు. నాల్గవ వయస్సులో (వార్ధకంలో ఏమి చేస్తావు?

ప్రయోజనమనుద్దిశ్య న మన్దోఽపి ప్రవర్తతే
కరిష్యతి వినా కార్యం కథం యత్నం కృతీ నరః. 323

తా. ఎంత తెలివితక్కువవాడైనా ప్రయోజనాపేక్ష లేకుండా ఏ పనీ చెయ్యడు. అలాంటప్పుడు నేర్పరియైన మానవుడు ఏదో కార్యాన్ని ఉద్దేశించకుండా ప్రయత్నం ఎలా చేస్తాడు?

పాదాభ్యాం న స్పృశేదగ్నిం న గురుం బ్రాహ్మణం తథా
న గాం చ న కుమారీం చ న శిశుం న చ దేవతామ్. 324

తా. అగ్నిని, గురువును (పూజ్యులైన పెద్దవారిని, బ్రాహ్మణుణ్ణి గోవును, కన్యకను, శిశువును, దేవతామూర్తిని పాదాలతో స్పృశించకూడదు.

ప్రాప్తవ్యమర్థం లభతే మనుష్యో
దేవోఽపి తం వారయితుం న శక్తః
తస్మాన్న శోచామి న విస్మయో మే
యదస్మదీయం న హి తత్పరేషామ్. 325

తా. మానవునికి లభించవలసి ఉన్న ధనాదికం ఎలాగైనా లభించి తీరుతుంది. దానిని దేవుడు కూడా ఆపలేడు అందుచేత (నాకు దొరకలేదే అని) విచారించను; (ఎదటివానికి ఎంత దొరికిందో!) అని ఆశ్చర్యపడను. లేదా (నాకు) దొరికితే గర్వపడను. మనకు చెందవలసినది ఏ నాటికీ ఇతరులకు వెళ్లదు.

పాత్రాపాత్రవివేకోఽస్తి ధేనుపన్నగయోరివ
తృణాత్సంజాయతే క్షీరం క్షీరాత్సంజాయతే విషమ్. 326

తా. మంచివాళ్లు, చెడ్డవాళ్లు అనే వివేకం అవసరం. ఆవు, సర్పమూ ఉదాహరణం. ఆవుకు గడ్డి ఇస్తే పాలు ఇస్తూన్నది, పాముకు పాలు పోస్తే విషం ఇస్తూన్నది.

పిణ్డే పిణ్డే మతిర్భిన్నా కుణ్డే కుణ్డే నవం పయః
జాతౌ జాతౌ నవాచారా నవా వాణీ ముఖే ముఖే. 326

తా. ప్రతి దేహంలోను ఆలోచన వేరుగా ఉంటుంది. (పుఱ్ఱెకొక బుద్ధి). ప్రతి కుండలోను (పొదుగులోను) పాలు కొత్తగా ఉంటాయి. ప్రతి జాతికి ఒక క్రొత్త ఆచారం ఉంటుంది. ఒక్కొక్కనోట్లో ఒక్కొక్క కొత్త వాక్కు ఉంటుంది.

పితృపూర్వార్జితా భూమిర్దరిద్రాపి సుఖావహా
అపి స్వర్ణమయీ లఙ్కా న మే లక్ష్మణ రోచతే. 327

తా. లక్ష్మణా! తండ్రులు, తాతలు సంపాదించిన భూమి ధనశూన్యమైనదైనా సుఖకరమైనదే. లంక బంగారంతో నిండినదైనా నాకు ఇష్టం కాదు.

పుస్తకం వనితా విత్తం పరహస్తం గతం గతమ్
యది చేత్పునరాయాతం నష్టం భ్రష్టం చ ఖణ్డితమ్. 328

తా. పుస్తకం, స్త్రీ, ధనం-ఈమూడు ఇతరుల చేతులలోకి వెళ్ళినాయా అవి పోయినట్లే. అథవా అవి తిరిగి వచ్చినా (పుస్తకం) నలిగిపోయి (స్త్రీ) భ్రష్ట అయి, (ధనం) ముక్కలయి వస్తుంది.

పుస్తకేషు చ యా విద్యా పరహస్తేషు యద్ధనమ్
సంగ్రామే చ గృహే సైన్యం త్రయం పుంసాం విడంబనా,
"కార్యకాలే చ సంప్రాప్తే న సా విద్యా న తద్ధనమ్"
అని పాఠాంతరం. 329

తా. పుస్తకాలలో ఉన్న విద్య, ఇతరుల చేతులలో ఉన్న ధనం, యుద్ధ సమయంలో ఇంటివద్దనే ఉన్న సైన్యం, ఈ మూడు మానవులకు హాస్యా

స్పదమైనవి. పుస్తకాలలో ఉన్న విద్య, ఇతరుల చేతులలో ఉన్న ధనం-అవసరం వచ్చినప్పుడు ఆ విద్య విద్య కాదు, ధనం ధనం కాదు.

పునరపి జననం పునరపి మరణం పునరపి జననీజఠరే శయనమ్
ఇహ సంసారే ఖలు దుస్తారే కృపయాపారే పాహి మురారే. 330

మళ్లీ పుట్టడం, మళ్లీ చావడం, మళ్లీ తల్లి కడుపులో శయనించడం-ఈ విధంగా దాటడానికి శక్యంకాకుండా ఉన్న ఈ సంసారంనుంచి, ఓ మహావిష్ణూ! దయతో నన్ను రక్షించు.

పాత్రే త్యాగీ గుణే రాగీ సంవిభాగీ చ బన్ధుషు
శాస్త్రే బోద్ధా రణే యోద్ధా పురుషః పఞ్చలక్షణః. 331

తా. సత్పాత్రులకు దానం చేయాలి, సద్గుణాల విషయంలో ఆసక్తి చూపాలి. బంధువులకు ధనాదులు పంచి ఇస్తూ ఉండాలి. శాస్త్రాలు నేర్చుకోవాలి; యుద్ధంలో ధైర్యంగా పోరాడాలి-ఈ ఐదు లక్షణాలు ఉన్నవాడే పురుషుడు.

పక్షిణాం బలమాకాశో మత్స్యానాముదకం బలమ్
దుర్బలస్య బలం రాజా బాలానాం రోదనం బలమ్. 332

తా. పక్షులకు ఆకాశం బలం. చేపలకు నీళ్లు బలం. దుర్బలునికి బలం రాజు. పిల్లలకి ఏడవడం బలం [వాళ్లు ఏడ్చి నెగ్గుతారు.]

పఠకాః పాఠకాశ్చైవ యే చాన్యే శాస్త్రచిన్తకాః
సర్వే వ్యసనినో మూఢా యః క్రియావాన్ స పణ్డితః. 333

తా. చదివేవాళ్లు, చదువు చెప్పేవాళ్లు, శాస్త్రచర్చలుచేసేవాళ్లు, వీళ్లందరూ విద్యావ్యసనంతో బాధపడుతూన్న మూర్ఖులు; ఆచరణలో చూపించేవాడే పండితుడు.

ప్రియవాక్యప్రదానేన సర్వే తుష్యన్తి జన్తవః
తస్మాత్తదేవ వక్తవ్యం వచనే కా దరిద్రతా. 334

తా. ఒక మంచి మాట ఇస్తే (మాట్లాడితే) అందరూ సంతోషిస్తారు. అందుచేత అలాంటి మంచిమాటే పలకాలి మాటలలో దారిద్ర్యం ఎందుకు?

పరోక్షే కార్యహన్తారం ప్రత్యక్షే ప్రియవాదినమ్
వర్జయేత్తాదృశం మిత్రం విషకుమ్భం పయోముఖమ్. 335

తా. ఎదుట ప్రియంగా మాటలాడుతూ, వెనకాల పనులు చెడగొట్టే, పాలతో నిండిన కుండవలె కనబడే విషకుంభమైన మిత్రుణ్ణి విడచివేయాలి.

పరాన్నం పరవస్త్రం చ పరశయ్యా పరస్త్రియః
పరవేశ్మనివాసశ్చ శక్రస్యాపి శ్రియం హరేత్. 336

తా. పరుల అన్నం, పరులు ధరించిన వస్త్రం, పరులు శయనించిన పక్క, పరస్త్రీలు, పరగృహంలో నివాసం-ఇవి ఇంద్రుని ఐశ్వర్యం కూడా పోగొడతాయి.

ప్రాతఃస్నానం గవాం సేవా ఆరామః పుష్పవాటికా
మాతాపిత్రోశ్చ శుశ్రూషా శాస్త్రీయ చ సుఖాయ చ. 337

తా. ప్రాతఃకాలస్నానం, గోవులను సేవించడం, ఉద్యానంలో పూల తోట పెంచడం, తలిదండ్రులకు శుశ్రూష చేయడం ఇది శాస్త్రానికీ సుఖానికీ కూడా మంచిదే.

ప్రియా న్యాయ్యా వృత్తిర్మలినమసుభఙ్గేఽప్యసుకరం
త్వసన్తో నాభ్యర్థ్యాః సుహృదపి న యాచ్యః కృశధనః,
విపద్యుచ్చైః స్థేయంపదమనువిధేయం చ మహతాం
సతాం కేనోద్దిష్టం విషమమసిధారావ్రతమిదమ్. 338

తా న్యాయసంమతమైన జీవనవిధానమే ఇష్టమైనది. ప్రాణాలు పోయినా పాపం చేసే ప్రసక్తిలేదు. చెడ్డవానిదగ్గరికి వెళ్ళి ప్రార్థించడం అనేది ఉండదు, ధనం తక్కువగా ఉన్న మిత్రుణ్ణైనా యాచించకూడదు.

ఆపత్సమయంలో కూడా తల ఎత్తుకొని తిరగాలి. పెద్దల మార్గాన్నే అను సరించాలి. ఇంత కష్టమైన అసిధారావ్రతం సత్పురుషులకు ఎవరు నేర్పినారో కదా !

పిపీలికార్జితం ధాన్యం మక్షికాసంచితం మధు
లుబ్ధేన సంచితం ద్రవ్యం సమూలం చ వినశ్యతి. 339

తా చీమలు సంపాదించిన దాన్యమూ, తేనెటీగలు కూడబెట్టిన తేనె, లోభి కూడబెట్టిన ధనమూ ఇవి సమూలంగా నశిస్తాయి.

బ

బాలార్కః ప్రేతధూమశ్చ వృద్ధా స్త్రీ పల్వలోదకమ్
ఆయుష్యనాశకం నిత్యం రాత్రౌ దధ్యన్నభోజనమ్. 340

తా. ప్రొద్దుటి ఎండ, శవం కాలుతూన్న ధూమం, వృద్ధస్త్రీ, చిన్న చెరువులోని నీరు, రాత్రి పెరుగన్నం తినడం ఇవి ఆయుస్సును తగ్గి స్తాయి.

బ్రహ్మఘ్నే చ సురాపే చ చోరే భగ్నవ్రతే శవే
నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః. 341

తా. బ్రహ్మహత్య చేసినవానికి, కల్లు తాగినవానికి, దొంగకు, వ్రతభంగం చేసినవానికి, శవం మోసినవానికి పెద్దలు ప్రాయశ్చిత్తం చెప్పారు. అయితే కృతఘ్నుడికి ప్రాయశ్చిత్తం లేదు.

బోద్ధారో మత్సరగ్రస్తాః ప్రభవః స్మయదూషితాః
అబోధోపహతాశ్చాన్యే జీర్ణమఙ్గే సుభాషితమ్. 342

తా. తెలిసినవాళ్లు అసూయతో నిండి ఉంటున్నారు. ప్రభువులకు వల్లమాలిన గర్వం. ఇంక మిగిలినవాళ్లకి విషయం అర్థంకాదు. ఇంక కావ్యం ఎవరికి వినిపించాలి ? కావ్యం (సుభాషితం) మా శరీరంలోనే జీర్ణం అయి పోతూన్నది.

బాలోఽపి చోరః స్థవిరోఽపి చోరః
సమాగతః ప్రాఘుణికోఽపి చోరః,
దిల్లీప్రదేశే మధురాప్రదేశే
చోరం వినా న ప్రసవన్తి నార్యః. 343

తా. బాలుడూ దొంగే; పెద్దవాడూ దొంగే; ఇంటికి వచ్చిన అతిథీ దొంగే. ఢిల్లీ-మధురాప్రాంతాలలోని స్త్రీలు దొంగలను తప్ప మంచివాళ్లని కనరు.

బుద్ధిర్యస్య బలం తస్య నిర్బుద్ధేస్తు కుతో బలమ్
పశ్య సింహో మదోన్మత్తః శశకేన నిపాతితః. 344

తా. బుద్ధి ఉన్నవానికే బలం కాని బుద్ధి లేనివానికి బలం ఎక్కడ? మదించి ఉన్న సింహాన్ని కూడా చెవులపిల్లి చంపివేసింది; చూడు.

బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః
అనేన వేద్యం సచ్ఛాస్త్రమితి వేదాన్తడిణ్డిమః. 345

తా. బ్రహ్మ ఒక్కటే సత్యమైనది, జగత్తు మిథ్య. జీవుడు బ్రహ్మయే కాని మరొకడు కాడు. ఉత్తమమైన శాస్త్రం ఈ రీతిలో తెలుసుకోవాలి. ఇదే వేదాంతడిండిమం (వేదాంతం ఢంకా బ్రమోగించి చెపుతున్న విషయం).

భార్యా జ్యేష్ఠా శిశుః శ్యాలః శ్వశ్రూః స్వాతన్త్ర్యవర్తినీ
శ్వశురస్తు ప్రవాసీ చ జామాతుర్భాగ్యధోరణీ. (కలివి.) 346

తా. భార్య అందరికంటె పెద్దదై ఉండడం, బావమరది బాలుడై ఉండడం, అత్తగారికి ఇంట్లో స్వాతంత్ర్యం, మామగారు ఊళ్లంపటి తిరుగుతూ ఉండడం ఇదంతా అల్లుడికి అదృష్టపరంపర.

భారతం పఞ్చమో వేదః సుపుత్రః సప్తమో రసః
దాతా పఞ్చదశం రత్నం జామాతా దశమో గ్రహః. 347

తా. భారతం ఐదవవేదం, సుపుత్రుడు ఏడవ రసం, దాత పదిహేనవ రత్నం. అల్లుడు పదవ గ్రహం.

భోజనాన్తే చ కిం పేయం జయన్తః కస్య వై సుతః
కథం విష్ణుపదం ప్రోక్తం తక్రం శక్రస్య దుర్లభమ్. 348

తా భోజనాంతంలో త్రాగదగినది ఏది? త.కమ్ మజ్జిగ. జయంతుడు ఎవని కుమారుడు ?శక్రస్య-ఇంద్రుని కుమారుడు. విష్ణుస్థానం ఎలా టి దని చెప్పబడింది? దుర్లభమ్-పొందడానికి చాలా కష్టమైనది

భార్గవేణ హతా మాతా ఏకజాయాశ్చ పాణ్డవాః
పరదారరతః కృష్ణో న దేవచరితం చరేత్. 349

తా పరశురాముడు తల్లిని సంహరించాడు; పాండవు లైదుగురికీ ఒక్కటే భార్య. కృష్ణుడు పరభార్యాసక్తుడు. వాళ్లు అలా ప్రవర్తించారు కదా అని సామాన్యులు ఆ మహాపురుషులు ప్రవర్తించినట్లు ప్రవర్తించ కూడదు

భోజ్యం భోజనశక్తిశ్చ రతిశక్తి ర్వర స్త్రియః
విభవో దానశక్తిశ్చ నాల్పస్య తపసః ఫలమ్. 350

తా తినడానికి సమృద్ధిగా ఉండడం భోజనశక్తి, రతిశక్తి, ఉత్తమ స్త్రీలు, వైభవము దానశక్తి ఇవి ఎంతో తపస్సు చేస్తేనే కాని లభించేవి కావు.

భిక్షో కన్థా శ్లథా తే న హి శఫరవధే జాలమశ్నాసి మత్స్యాన్
తే వై మద్యోపదంశాః, పిబసి మధు సమం వేశ్యయా యాసి వేశ్యామ్,
దత్వాఙ్ఘ్రింమూర్ధ్న్యరీణాం తవ కిము రిపవో భిత్తిభేత్తాస్మి యేషాం
చోరోఽసి ద్యూతహేతో స్త్వయి సకలమిదం నాస్తి నష్టే విచారః.

తా. "సంన్యాసీ! నీ బొంత చిరిగిపోయినదా"? "ఇది బొంత కాదు; చేపలు చంపడానికి ఉపయోగించే వల". "చేపలు కూడా తింటావా?" "అవి మద్యం త్రాగేటప్పుడు నంజుగా ఉపయోగిస్తాను''. "మద్యం త్రాగుతావా?"

వేశ్యతో కూడా కలిసి త్రాగుతాను". "వేశ్యదగ్గరికి వెడతావా?' "శత్రువుల నెత్తిమీద కాలు పెట్టి వెడతాను". "నీకు శత్రువులు ఉన్నారా?" ఎవరి ఇళ్లకి కన్నం వేస్తానో వాళ్లే నా శత్రువులు''. "దొంగవు కూడానా?" "జూదం కోసం దొంగతనం చేస్తాను". ''నీకు ఇవన్నీ ఉన్నాయా?" "భ్రష్టుడికి ఇది ఉంది- అది లేదు అనే మాట ఏమిటి ?"

భేదాభేదౌ సపది గలితౌ పుణ్యపాపే విశీర్ణే
మాయామోహౌ క్షయముపగతౌ నష్టసందేహవృత్తేః,
శబ్దాతీతం త్రిగుణరహితం ప్రాప్య తత్త్వావబోధం
నిస్త్రైగుణ్యే పథి విచరతాం కో విధిః కో నిషేధః. 352

తా. జీవన్ముక్తుడికి జ్ఞానోదయం కలగడానికి పూర్వం ఉన్న భేదాభేదాలు (ఇది వేరు ఇది కాదు అనే భావం; జ్ఞానం కలిగిన వెంటనే తొలగిపోయాయి. పుణ్యపాపాలు నశించాయి మాయామోహాలు క్షీణించాయి. సందేహాలన్నీ తొలగిపోయాయి. మాటలలో చెప్ప శక్యం కాని, త్రిగుణశూన్యమైన తత్త్వ జ్ఞానాన్ని పొంది త్రిగుణాతీతమైన మార్గంలో సంచరించేవారికి విధి ఏమిటి? నిషేధం ఏమిటి?

భగవన్తౌ జగన్నేత్రే సూర్యాచన్ద్రమసావపి
పశ్య గచ్ఛత ఏవాస్తం నియతిః కేన వార్యతే. 353

తా. జగత్తుకి నేత్రాలైన ఆ భగవంతులైన సూర్యచంద్రులు కూడా అస్తమిస్తూ ఉంటారు; దైవాన్ని ఎవరు దాటగలరు ?

భ్రమన్వనాన్తే నవమఞ్జరీషు న షట్పదో గన్ధఫలీమజిఘ్రత్
సా కిం న రమ్యా స చ కిం న రన్తా బలీయసీ కేవలమీశ్వరేచ్ఛా

తా. తుమ్మెద ఉద్యానమధ్యంలో కొత్త పూలగుత్తుల మధ్య సం
రిస్తూ సంపెంగపువ్వును వాసన చూడలేదు. అది రమ్యమైనది కాదనగలమా

ఆ తుమ్మెదకు అస్వాదించడం తెలియదనగలమా? కేవలం ఈశ్వరేచ్ఛ బలవత్తరమైనది.

భవితవ్యం భవత్యేవ నారికేలఫలామ్బువత్
గన్తవ్యం గతమిత్యాహుర్గజభుక్తకపిత్థవత్. 354

తా. కొబ్బరికాయలోనికి నీరు వచ్చినట్టుగా జరగవలసి ఉన్నది ఏదో విధంగా జరిగితీరుతుంది. పురుగు తొలచిన వెలగపండులోని గుంజు హరించి పోయినట్లు పోవలసినది ఏలాగైనా పోతుంది. వెలగపండులో ఉన్న పురుగుకు గజము అని పేరు. అని–"కపిత్థాన్తర్గతః కీటో గజ ఇత్యభిధీయతే" అనే వాక్యం ఉదాహరించి అర్థం చెపుతారు. ఏనుగు వెలగపండు మింగితే దానిలోని గుంజు హరించుకొనిపోయి పై చిప్ప అదే ఆకారంలో బైటకు వచ్చేస్తుందని కొందరు చెపుతారు.

భిక్షో మాంసనిషేవణం కిముచితం కిం తేన మద్యం వినా
మద్యం చాపి తవ ప్రియం ప్రియమహో వారాఙ్గనాభిః సహ,
వారస్త్రీరతయే కుతస్తవధనం ద్యూతేన చౌర్యేణ వా
చౌర్యద్యూతపరిశ్రమోఽస్తి భవతో భ్రష్టస్య కా వా గతిః.355

తా. ఓ! సంన్యాసీ! నీకు మాంసం తినడం అలవాటు ఉందా? మద్యం లేకుండా మాంసం ఎందుకు? నీకు మద్యం కూడా ఇష్టమా? వేశ్యాంగనలతో కలిసి త్రాగడం ఇష్టం. వేశ్యాస్త్రీసంబంధానికి నీకు ధనం ఎక్కడిది? జూదం అది కాని దొంగతనం చేసికాని. నీకు దొంగతనం జూదం కూడా అలవాటున్నాయా? భ్రష్టుడికి గతి ఏమిటి? (లేనిది ఏముంటుంది?)

భగవద్గీతా కించిదధీతా గఙ్గాజలలవకణికా పీతా
సకృదపి యస్య మురారిసమర్చా తస్య కరోతి యమోఽపి
న చర్చామ్. 356

తా. ఎవడు కొంచెమైనా భగవద్గీత చదువుతాడో, గంగాజలం ఒక్క చుక్కైనా త్రాగుతాడో, శ్రీమహావిష్ణువును ఒక్కసారైనా పూజిస్తాడో యముడు కూడా వాని జోలికి వెళ్లడు.

భార్యా రూపవతీ శత్రుః పుత్రః శత్రురపణ్డితః
ఋణకర్తా పితా శత్రుర్మాతా చ వ్యభిచారిణీ. 357

తా. రూపవంతురాలైన భార్య శత్రువు. పాండిత్యం లేని పుత్రుడు శత్రువు. ఋణం చేసే తండ్రి శత్రువు. వ్యభిచారిణియైన తల్లి శత్రువు.

భాగ్యవన్తం ప్రసూయేథా మా శూరం మా చ పణ్డితమ్
శూరాశ్చ కృతవిద్యాశ్చ వనే తిష్ఠన్తి పాణ్డవాః. 358

తా. అదృష్టవంతుడైన పుత్రుణ్ణి కనుము; శూరుణ్ణి, పండితుణ్ణీ కన వద్దు. శూరులూ పండితులూ అయిన పాండవులు అరణ్యంలో నివసిస్తున్నారు.

## మ

మాతృవత్పరదారాంశ్చ పరద్రవ్యాణి లోష్టవత్
ఆత్మవత్సర్వభూతాని యః పశ్యతి స పశ్యతి. 359

తా. పరభార్యలను తల్లివలె, పరుల ద్రవ్యాన్ని మట్టిబెడ్డవలె అన్ని ప్రాణుల్నీ తనవలె ఎవడు చూస్తాడో వాడే మంచి చూపు కలవాడు.

మృత్యుర్జన్మవతాం వీర దేహేన సహ జాయతే
అద్య వాబ్దశతాన్తే వా మృత్యుర్వై ప్రాణినాం ధ్రువః. 360

తా. వీరుడా! ప్రాణుల దేహంతోనే మృత్యువు కూడా పుడుతుంది. ఈనాడైనా, నూరు సంవత్సరాల తరవాతనైనా ప్రాణులకు మృత్యువు తప్పదు.

మణిం వహన్తి పాదాగ్రే కాచః శిరసి ధార్యతే
క్రయవిక్రయవేలాయాం కాచః కాచో మణిర్మణిః. 361

తా. మాణిక్యాన్ని పాదాగ్రందగ్గర ధరిస్తారు. గాజుముక్క తలలో అలంకరించుకొంటారు. అయితే నేమి ? అమ్మడం కొనడం చేయవలసి వచ్చినప్పుడు గాజుముక్క గాజుముక్కే. మాణిక్యం మాణిక్యమే.

మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా
యది సీతాపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః (రామా.)362

తా పెద్దలయందు వినయభావం ఉన్న లక్ష్మణునికి మాన్యురాలు, పెద్దలకు ఇష్టురాలూ అయిన సీత కూడా దుఃఖపీడితురాలైన దంటే కాలాన్ని ఎవరూ దాటలేరు కదా ?

మాతులో యస్య కృష్ణశ్చ పితా యస్య ధనంజయః
అభిమన్యోర్గతః ప్రాణః కాలస్య కుటిలా గతిః. 363

తా. అభిమన్యుని మేనమామ శ్రీకృష్ణుడు; తండ్రి అర్జునుడు. అయినా యుద్ధంలో అతడు మరణించాడు, కాలగమనం వక్రంగా ఉంటుంది !

మాత్రా సమం నాస్తి శరీరపోషణం
విద్యాసమం నాస్తి శరీర భూషణమ్
భార్యా సమం నాస్తి శరీరతోషణం
చిన్తాసమం నాస్తి శరీరశోషణమ్. 364

తా. తల్లివలె శరీరాన్ని పోషించేది మరేదీ లేదు. విద్యతో సమానమైన శరీరాలంకారం లేదు; భార్యవలె శరీరానికి సౌఖ్యం కలిగించేది మరొకటి లేదు. చింతవలె శరీరాన్ని ఎండింపచేసేది మరేదీ లేదు.

మూర్ఖోఽపి శోభతే తావత్సభాయాం వస్త్రవేష్టితః
తావచ్చ శోభతే మూర్ఖో యావత్కిఞ్చిన్న భాషతే. 365

తా. మంచి వస్త్రాలు ధరించి ఉన్న మూర్ఖుడు కూడా సభలో బాగా శోభిస్తాడు. అయితే వాని శోభ అంతా నోరు విప్పనంతవరకే.

ముఖం పద్మదలాకారం వాణీ చన్దనశీతలా
హృదయం కర్తరీతుల్యం త్రివిధం ధూర్తలక్షణమ్. 366

తా. ముఖం పద్మంలాగ ఉంటుంది. మాట మంచిగందం వలె చల్లగా ఉంటుంది. హృదయం మాత్రం కత్తెరవంటిది ఈ విధంగా ధూర్తుని (మోసగాని) లక్షణం మూడు విధాలు.

మనసైవ కృతం పాపం న శరీరకృతం కృతమ్
యేనైవాలిఙ్గితా కాన్తా తేనైవాలిఙ్గితా సుతా. 367

తా. ప్రియురాలిని కౌగలించుకొన్నవాడే కుమార్తెను కూడా కౌగలించుకుంటున్నాడు. అందుచేత మనస్సును పట్టి పాపం అని చెప్పాలికాని శరీరం చేత చేసినదానిని పట్టి కాదు.

మాతా నిన్దతి నాభినన్దతి పితా భ్రాతా న సంభాషతే
భృత్యః కుప్యతి నానుగచ్ఛతి సుతః కన్యా చ నాలిఙ్గతే,
అర్థప్రార్థనశఙ్కయా న కురుతేఽప్యాలాపమాత్రం సుహృ
త్తస్మాద్ద్రవ్యముపార్జయాశు సుమతే ద్రవ్యేణ సర్వే వశాః.

తా. ధనం లేనివాణ్ణి తల్లి నిందిస్తుంది; తండ్రి అభినందించడు. (మెచ్చుకొనడు); సోదరుడు సరిగా మాటలాడడు. భృత్యుడు కోపిస్తాడు. కుమారుడు అనుసరించి రాడు. భార్య కౌగలించుకొనదు. ఎక్కడ అప్పు అడుగుతాడో అని మిత్రుడు కూడా మాటలాడడు. అందుచేత, ఓ! సుమతీ! వెంటనే ధనం సంపాదించు. డబ్బుకి అందరూ వశం అవుతారు.

మహానదీప్రతరణం మహాపురుషవిగ్రహమ్
మహాజనవిరోధం చ దూరతః పరివర్జయేత్. 369

తా. పెద్దనదిని ఈదడం, గొప్పవానితో విరోధం, చాలామందితో విరోధం. ఈ మూడింటినీ ఎన్నడూ చెయ్యకూడదు.

మానే తపసి శౌర్యే వా విజ్ఞానే వినయే నయే
విస్మయో న హి కర్తవ్యో నానారత్నా వసున్ధరా. 37

తా. సన్మానము, తపస్సు, శౌర్యము, విజ్ఞానము, వినయము, నీ కుశలత,-వీటివిషయంలో (ఇవి ఉన్న కొందరిని చూచి) ఆశ్చర్యపడవలసి పని లేదు; ఎందుచేత ననగా ఈ పృథివిలో ఎన్నో రత్నాలు (ఎంద మహానుభావులు) ఉంటారు.

మూలం భుజఙ్గైః శిఖరం విహఙ్గైః
శాఖాః ప్లవఙ్గైః కుసుమాని భృఙ్గైః,
ఆశ్చర్యమేతత్ఖలు చన్దనస్య
పరోపకారాయ సతాం విభూతయః. 371

తా. చందనవృక్షమూలము సర్పాలచేత, అగ్రభాగం పక్షులచేత, కొమ్మలు కోతులచేత, పుష్పాలు తుమ్మెదలచేత సేవింపబడుతున్నాయి. ఏమి ఆశ్చర్యము? సత్పురుషుల ఐశ్వర్యాలు పరోపకారంకోసమే వినియోగింపబడతాయి.

మృతా మోహమయీ మాతా జాతో జ్ఞానమయః సుతః
శౌవసూతకసంబన్ధా దనర్హాః సర్మకర్మసు,
హృదాకాశే చిదాదిత్యః సదా భాతి నిరన్తరమ్
ఉదయాస్తమయౌ న స్తః కథం సన్ధ్యాముపాస్మహే. 372

తా. ("సంధ్యావందనాదికర్మ లేవీ చేయడం లేదేమి" అని ఎవరో ప్రశ్నించగా కేరళదేశీయుడైన ఒక ఆత్మజ్ఞాని చెప్పినాడట). మోహం అనే తల్లి చనిపోయింది; జ్ఞానం అనే పుత్రుడు జనించాడు ఈ విధంగా మృతాశౌచజాతాశౌచాలు రెండూ రావడంచేత మాకు ఏ కర్మ చేయడానికీ అర్హత లేదు.

హృదయాకాశంలో ఎల్లప్పుడూ ఆత్మ అనే సూర్యుడు ప్రకాశిస్తూనే ఉన్నాడు; సూర్యోదయ సూర్యాస్తమయాలు లేనప్పుడు సంధ్యోపాసన ఎట్లు చెయ్యాలి ?

మాత్రా స్వస్రా దుహిత్రా వా నైకశయ్యాసనో భవేత్
బలవానిన్ద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి. 373

తా తల్లితోకాని, సోదరితో, కుమార్తెతో ఒకే ఆసనం, శయనం సేవించకూడదు. ఎందుచేతననగా ఇంద్రియసముదాయం చాలా బలం గలది; విద్వాంసుణ్ణి కూడా లాగివేస్తుంది.

మజ్జత్వమ్భసి యాతు మేరుశిఖరం శత్రూన్ జయత్వాహవే
వాణిజ్యం కృషిసేవనాది సకలం సర్వాః కలాః శిక్షతు,
ఆకాశం విపులం ప్రయాతు ఖగవత్కృత్వా ప్రయత్నం పరం
నాభావ్యం భవతీహ కర్మవశతో భావ్యస్య నాశః కుతః? 374

తా. నీళ్లల్లో మునుగుగాక; మేరుపర్వతశిఖరం ఎక్కుగాక; యుద్ధంలో శత్రువులను జయించుగాక; వర్తకము, వ్యవసాయము, సేవ మొదలైన అన్నికళలూ నేర్చుగాక. బాగా ప్రయత్నంచేసి పక్షివలె విశాలమైన ఆకాశంలోనికి ఎగురుగాక; ఏమైనా జరగడానికి వీలులేనిది జరగదు; జరగబోయేది జరగక మానదు.

మనో మధుకరో మేఘో మానినీ మదనో మరుత్,
మా మదో మర్కటో మత్స్యో మకారా దశ చఞ్చలాః. 375

తా. మనస్సు, మధుకరం (తుమ్మెద), మేఘం, మానిని (పెద్ద పట్టుదల గల స్త్రీ), మదనుడు, మరుత్ (గాలి) మా (లక్ష్మి), మదం, మర్కటం, మత్స్యం - ఈ పదీ చంచలమైనవి.

మనో హి హేతుః సర్వేషామిన్ద్రియాణాం ప్రవర్తనే,
శుభాశుభాస్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్ (రామా.) 376

తా. (రావణాంతఃపురంలో నిద్రిస్తూన్న స్త్రీలను చూడడంవల్ల తనకు పాపం వచ్చినదేమో అని మొదట సందేహించి హనుమంతుడు తనలో తానే సమాధానపడుతున్నాడు) మంచి పరిస్థితులలో అయినా, చెడ్డపరిస్థితులలో అయినా అన్ని ఇంద్రియాల ప్రవృత్తికి కారణం మనస్సే కదా? నా మనస్సు పరిశుద్ధంగానే ఉన్నది.

మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః
బన్ధాయ విషయాసక్తం మోక్షే నిర్విషయం స్మృతమ్. 377

తా. మానవుల బంధానికైనా మోక్షానికైనా మనస్సే కారణం. విష యాల (భోగాల) మీద ఆసక్తి గలదైతే బంధం కలగజేస్తుంది; విషయాలు విడిచిపెట్టినట్లయితే మోక్షానికి దారితీస్తుంది.

మరణాన్తాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్
క్రియతామస్య సంస్కారో మమాప్యేష యథా తవ. (రామా.)

తా. (రావణసంహారానంతరం ఆతనికి సంస్కారం చెయ్యడానికి విభీషణుడు వెనకాడుతూండగా రాముడు అతనితో అన్న మాటలు)

వైరం మరణంతో ఆఖరు. మేము తలపెట్టిన పని పూర్తి అయింది. ఇతనికి తగిన సంస్కారం చెయ్యి. ఇతడు నీ కెంతో నాకూ అంతే.

మర్కటస్య సురాపానం తతో వృశ్చికదంశనమ్
తన్మధ్యే భూతసంచారో యద్వా తద్వా భవిష్యతి. 379

తా. కోతి కల్లు త్రాగింది; అంతే కాకుండా తేలుకూడా కుట్టింది; ఆ మధ్యలో దయ్యం పట్టుకొంది. ఇంక ఏమి జరగాలో అది జరగవలసిందే.

మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్
మనస్యన్యద్వచస్యన్యత్ కార్యే చాన్యద్దురాత్మనామ్. 380

తా. మహాత్ములు మనస్సులోను, మాటల్లోను, చేతలలోనూ ఒకే విధంగా ఉంటారు దురాత్ముల మనస్సులో ఒకటి, మాటలలో ఒకటి, పనిలో మరొకటి.

మమేతి బధ్యతే జన్తుర్న మమేతి చ ముచ్యతే,
బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం మనః. 381

తా. "ఇది నాది" అనుకొనేవాడు బద్ధుడౌతాడు. "ఇది నాది కాదు" అనుకొన్నవాడు ముక్తుడౌతాడు, విషయములమీద ఆసక్తి గల మనస్సు బంధం కలిగిస్తుంది. విషయాలను వదలివేసిన మనస్సు ముక్తిని ఇస్తుంది.

మనః కృతం కృతం రామ న శరీరకృతం కృతమ్
మనో హి జగతాం కర్తృ మనో హి పురుషః స్మృతః. 382

తా. రామా! మనస్సుతో చేస్తేనే చేసినట్లు; శరీరంతో చేసినది చేసినట్లు కాదు. ఎందుచేతననగా – జగత్తులను నిర్మించేది మనస్సే; మనస్సే పురుషుడు.

మనసా చిన్తితం కార్యం వచసా న ప్రకాశయేత్
మన్త్రిరక్షణగూఢాత్మా కార్యసిద్ధిం ప్రకాశయేత్. 383

తా. మనస్సుతో ఆలోచించిన కార్యాన్ని మాటలలో పైకి చెప్ప కూడదు. ఆలోచనను రక్షించడంలో మనస్సును గూఢంగా ఉంచుకొని కార్యం సిద్ధించినతరవాత పైకి చెప్పాలి.

ముఖవర్జం తు గౌః శుద్ధా మార్జారశ్చాశ్రమే శుచిః
శయ్యాభార్యా శిశోర్వస్త్రముపవీతం కమణ్డలుః. 384

తా. ముఖం తప్ప ఆవు శరీరం అంతా పవిత్రమైనది. ఆశ్రమంలో ఉన్న పిల్లి పవిత్రమైనది. శయ్యమీద ఉన్న భార్య, శిశువు ధరించిన వస్త్రం, యజ్ఞోపవీతం, కమండలం పవిత్రమైనవి.

ముఖ్యమేకం పురస్కృత్య శూన్యాత్మానోఽపి సాధకాః
భవన్తి తం వినా నైవ యథాసంఖ్యాఙ్కబిన్దవః. 385

తా. శూన్యాత్ములు కూడా (బుద్ధివిహీనులు, సున్నలు అని రెండు అర్థాలు) ఒక ముఖ్యుణ్ణి ముందు ఉంచుకుంటే పని సాధించకలుగుతారు. ఆ ముఖ్యుడు మొదట లేకపోతే సాధకులు కాలేరు. ఒక అంకె తరవాత వచ్చే సున్నలే ఉదాహరణం.

మూర్ఖత్వం హి సఖే మమాపి రుచిరం తస్మిన్యదష్టౌ గుణా
నిశ్చిన్తో బహుభోజనేష్వభిరుచీ రాత్రౌ దివా సుప్యతే,
కార్యాకార్యవిచారణాన్ధబధిరో మానాపమానౌ సమౌ
కృత్వా సర్వజనస్య మూర్ధ్ని పదం మూర్ఖః సుఖం జీవతి. 386

తా. మిత్రమా! మూర్ఖత్వం అంటే నాకు కూడా చాలా ఇష్టమే. ఎందుచేతనంటే వానిలో ఎనిమిది గుణాలు ఉన్నాయి. ఏ చింతా ఉండదు. మస్తుగా తింటాడు. రాత్రీ పగలూ హాయిగా నిద్రపోతాడు. ఇది చేయవచ్చు ఇది చేయగూడదు అనే విషయంలో వాడు గ్రుడ్డివాడు, చెవిటివాడు. మానావమానాలు రెండూ వానికి సమానములే. మూర్ఖుడు అందరి తలమీద పాదం ఉంచి (ఎవ్వణ్ణీ లెక్కచేయకుండా) సుఖంగా జీవిస్తాడు.

మూర్ఖస్య పఞ్చ చిహ్నాని గర్వీ దుర్వచనీ తథా
హఠీ చాప్రియవాదీ చ పరోక్తం నైవ మన్యతే. 387

తా. మూర్ఖుణ్ణి గుర్తించాలంటే నాలుగు చిహ్నాలు ఉంటాయి (మూర్ఖుడికి నాలుగు లక్షణాలు) – గర్వం ఎక్కువ; చెడ్డమాటలు మాటలాడతాడు; మొండి పట్టు. అప్రియంగా మాటలాడతాడు. ఎదుటివాళ్ల చెప్పినదాన్ని కాదంటాడు.

మౌఖర్యం లాఘవకరం మౌనమున్నతి కారకమ్
ముఖరం నూపురం పాదే కణ్ఠే హారో విరాజతే. 388

తా. అతిగా వాగడంవల్ల తేలిక అయిపోతారు. మౌనం ఔన్నత్యాన్ని కలిగిస్తుంది. చప్పుడు చేసే అందియ పాదంమీద ఉంటుంది; ముత్యాలహారం కంఠంలో ఉంటుంది.

మౌనే మౌనీ గుణిని గుణవాన్ పండితే పణ్డితోఽసౌ
దీనే దీనః సుఖిని సుఖవాన్ భోగిని ప్రాప్తభోగః,
మూర్ఖే మూర్ఖో యువతిషు యువా వాగ్మిషు ప్రౌఢవాగ్మీ
ధన్యః కోఽపి త్రిభువనజయీ యోఽవధూతేఽవధూతః. 389

తా. ఎదుటివాడు మౌనంగా ఉంటే తానూ మౌనంఅవలంబిస్తాడు; గుణవంతుడౌతే గుణవంతుడుగా ప్రవర్తిస్తాడు; పండితుడౌతే పాండిత్యం చూపిస్తాడు; దీనుడైతే దీనంగా ఉంటాడు; సుఖవంతుడైతే సుఖవంతుడుగా ఉంటాడు; భోగాలు అనుభవిస్తే భోగాలు అనుభవిస్తాడు; మూర్ఖుడైతే తాను

మూర్ఖుడులాగ ప్రవర్తిస్తాడు; యువతులదగ్గర ఉన్నప్పుడు యువకుడిలాగ ప్రవర్తిస్తాడు; వాక్చాతుర్యం ఉన్నవాళ్లదగ్గర వాక్చాతుర్యం చూపిస్తాడు, ఎదుటివాడు జ్ఞాని అయితే జ్ఞానిలాగా ప్రవర్తిస్తాడు; ఈ విధంగా ఎదుట ఉన్న మనుష్యులను పట్టి ప్రవర్తిస్తూ మూడులోకాలూ జయించ గల ధన్యాత్ముడు ఎక్కడో ఉంటాడు.

మౌనం కాలవిలమ్బశ్చ ప్రయాణం భూమిదర్శనమ్
భృకుట్యన్యముఖీ వార్తా నకారః షడ్విధః స్మృతః. 390

తా. (ఎవరైనా వచ్చి ఏదైనా కోరినప్పుడు లేదని చెప్పడానికి ఆరు పద్ధతులు) మాటలాడకపోవడం, ఆలస్యం చేయడం, అక్కడినుంచి లేచి వెళ్లిపోవడం, నేలవైపు చూడడం కనుబొమ్మలు విరవడం ముఖం మరొకవైపు త్రిప్పి మాటలాడడం- ఇలా "లేదు. అనడానికి ఆరు పద్ధతులు.

మాసి మాసి సమా జ్యోత్స్నా పక్షయోరుభయోరపి
తత్రైకః శుక్లపక్షోఽభూద్యశః పుణ్యైరవాప్యతే. 391

తా. ప్రతిమాసంలోను రెండు పక్షాలలోనూ కూడా వెన్నెల ఉండే సమయం సమానమే. అయితే వాటిలో ఒకదానికి శుక్లపక్షం అని పేరు వచ్చింది. కీర్తి పుణ్యాన్ని పట్టి వస్తుంది.

మన్త్రే తీర్థే ద్విజే దేవే దైవజ్ఞే భేషజే గురౌ
యాదృశీ భావనా యస్య సిద్ధిర్భవతి తాదృశీ. 392

తా. మంత్రమందైనా, పుణ్యక్షేత్రంవిషయంలోనైనా, బ్రాహ్మణుని యందైనా, దేవునియందైనా, జ్యోతిష్కునియందైనా, ఔషధంవిషయంలోనైనా, గురువువిషయంలోనైనా ఎవనికి ఎలాంటి భావన (భక్తిశ్రద్ధాదికం) ఎంత ఉంటే అలాంటి సిద్ధే లభిస్తుంది.

మృత్యుర్బుద్ధిమతాపోహ్యో యావద్బుద్ధిబలోదయమ్
యద్యసౌ న నివర్తేత నాపరాధోఽస్తి దేహినః. 393

తా. బుద్ధిమంతుడు తన బుద్ధిబలానికి శక్యమైనంతవరకు మృత్యువు రాకుండా చూచుకోవాలి. అంత చేసినా మృత్యువు తప్పకపోతే మానవుని దోషం ఉండదు.

మాతా యది విషం దద్యాత్పితా విక్రీయతే సుతమ్
రాజా హరతి సర్వస్వం శరణం కం వ్రజేత్తదా. 394

తా. తల్లి విషం పెడితే, తండ్రి అమ్మికొంటే, రాజు సర్వస్వమూ లాక్కుంటే ఇంక ఎవరికి చెప్పుకోవాలి ?

మృగా మృగైః సఙ్గమనువ్రజన్తి
గావశ్చ గోభిస్తురగాస్తురంగైః,
మూర్ఖాశ్చ మూర్ఖైః సుధియః సుధీభిః
సమానశీలవ్యసనేషు సఖ్యమ్. 395

తా. లేళ్లు లేళ్లతో కలిసి తిరుగుతాయి గోవులు గోవులతోను, గుఱ్ఱాలు గుఱ్ఱాలతోను కలిసి తిరుగుతాయి. మూర్ఖులు మూర్ఖులతోను, బుద్ధిమంతులు బుద్ధిమంతులతోను స్నేహం చేస్తారు. సమానమైన శీలమూ, వ్యసనమూ ఉన్నవాళ్ల మధ్యనే స్నేహం కుదురుతుంది.

మా మాం స్పృశ్యయ పుష్పవత్యహమహో, పుష్పేణ కిం పాతకమ్
పుష్పిణ్యా సహ సంగమేన పురుషస్యార్ధాయుషం క్షీయతే,
అస్పృష్ట్వా సకలాయుషం క్షయతి చేత్తస్యార్ధనాశో వరః
సర్వస్యాపి వినాశకాలసమయే త్వర్ధం త్యజేత్పణ్డితః. 396

# య

యస్య కించిన్న దాతవ్యం తస్య దేయం కిముత్తరమ్
అద్య సాయం పునః ప్రాతః సాయం ప్రాతః పునః పునః. 397

తా. ఎవడికైతే ఏమీ ఇవ్వదలుచుకోలేదో వాడికి ఏం సమాధానం చెప్పాలి ? "ఈవేళ సాయంకాలం రా," "మళ్లీ రా," "ప్రొద్దుటరా" "సాయంకాలం రా" "ప్రొద్దుట రా, "మళ్లీ రా" "మళ్లీ రా" అంటూ చెప్పుకుంటూ పోవాలి.

యూయమేవాస్య జానీత యోఽయం యద్వా కరిష్యతి
అహిరేవ త్వహేః పాదాన్విజానాతి న సంశయః.(రామా) 398

తా. ఇతడెవడో, ఏమి చేయనున్నాడో మీకే తెలియాలి. పాము పాదాలు పాముకే తెలియాలి. సందేహం లేదు.

యావన్న తపతి భానుస్తావద్భృశంతపతి వాలుకానికరః
అన్యస్మాల్లబ్ధపదః ప్రాయో నీచోఽతిదుఃసహో భవతి. 399

తా. ఎండకి వేడెక్కిన ఇసుక సూర్యుడు కూడా కాల్చనంతగా కాలుస్తుంది. స్వశక్తి లేకపోయినా ఇతరుల ద్వారా పదవి పొందిన దుర్జనుడు సాధారణంగా సహింపశక్యం కాకుండా ప్రవర్తిస్తాడు.

యత్ర విద్వజ్జనో నాస్తి శ్లాఘ్యస్తత్రాల్పధీరపి
నిరస్తపాదపే దేశే ఏరణ్డోఽపి ద్రుమాయతే. 400

తా. పండితులు లేని చోట అల్పబుద్ధిమంతుడు కూడా శ్లాఘించబడతాడు. చెట్లు లేని దేశంలో ఆముదపుమొక్క పెద్దవృక్షంగా పరిగణింపబడుతుంది.

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి.(భ.గీ.)

తా. సాంఖ్యులకు (జ్ఞానులకు) ఏ స్థానం లభిస్తుందో కర్మయోగులకు కూడా అదే స్థానం లభిస్తుంది. సాంఖ్యము, యోగము ఈ రెండూ ఒకటే అని ఎవడు తెలుసుకుంటాడో అతడే సరిగా తెలిసికొన్నవాడు

యత్రాత్మీయో జనో నాస్తి భేదస్తత్ర న విద్యతే
కుఠారైర్దణ్డనిర్ముక్తైర్భిద్యన్తే తరవః కథమ్. 402

తా. ఒకడికి ఏదైనా అపకారం జరగాలంటే అటుప్రక్క ఆతనికి సంబంధించినవాడు ఎవడో ఉండాలి. కఱ్ఱలేని గొడ్డళ్లతో చెట్లు నరకడం కుదరదు కదా ?

యథాకాలముపాయాతావర్థానర్థౌ సమౌ మమ
హస్తావివ శరీరస్థౌ తేన జీవామ్యనామయః. 403

తా. ఆ యా సమయాలలో మంచి విషయాలు ప్రాప్తిస్తూ ఉంటాయి; అనర్థాలు కలుగుతూ ఉంటాయి. ఈ రెండూ నా దృష్టిలో కుడి-ఎడమ చేతులవలె సమానములే; అందుచేత నేను రోగాలు లేకుండా జీవిస్తున్నాను.

యదా యదా మునే కించిద్విజానామి తదా తదా
మతిరాయాతి నౌద్ధత్యం తేన జీవామ్యనామయః. 404

తా. ఓ! మునీ! అప్పుడప్పుడు ఆ యా విషయాలు తెలుసుకొన్న కొలదీ నా మనస్సులోని ఔద్ధత్యం (గర్వం) తగ్గిపోతూన్నది. అందుచేత నేను రోగాలు లేకుండా జీవిస్తున్నాను.

యస్తు సంచరతే దేశాన్ యస్తు సేవేత పణ్డితాన్
తస్య విస్తారితా బుద్ధి స్తైలబిన్దురివామ్భసి. 405

తా. ఎవడు దేశసంచారం చేస్తాడో, పండితులను సేవిస్తాడో వాని బుద్ధి నీటిమీద నూనెచుక్క వ్యాపించినట్లు వ్యాపిస్తుంది.

యస్య నాస్తి వివేకస్తు కేవలం యో బహుశ్రుతః
స న జానాతి శాస్త్రార్థాన్ దర్వీ పాకరసానివ. 406

తా. స్వతః విమర్శనాశక్తి లేనివాడు కేవలం శాస్త్రం ఎంత చదివినా వానికి, గరిటెకు వంటల రుచి తెలియనట్లు, దానిలోని సారం తెలియదు.

యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా (భ.గీ.) 407

తా. అర్జునా! మండుతూన్న అగ్ని కట్టెలను భస్మం చేసినట్లు జ్ఞానం అనే అగ్ని అన్ని కర్మలనూ కూడ భస్మం చేస్తుంది.

యస్మిన్ దేశే న సంమానో న ప్రీతిర్న చ బాన్ధవాః
న చ విద్యాగమః కశ్చిన్న తత్ర దివసం వసేత్. 408

తా. ఏ దేశంలో గౌరవం లేదో, ప్రేమ లేదో, బంధువులు లేరో, ఏదైన విద్య లభించే అవకాశము లేదో, ఆ దేశంలో ఒక్క రోజు కూడా నివసించకూడదు.

యత్ర విద్యాగమో నాస్తి యత్ర నాస్తి ధనాగమః
యత్ర చాత్మసుఖం నాస్తి న తత్ర దివసం వసేత్. 409

తా. ఎక్కడ ఏదైనా విద్య నేర్చుకొనే అవకాశం లేదో, ధనసంపాదన లేదో, మనస్సుకు సుఖం ఉండదో అక్కడ ఒక్క రోజు కూడా నివసించకూడదు.

యది సన్తి గుణాః పుంసాం వికసన్త్యేవ తే స్వయమ్
న హి కస్తూరికామోదః శపథేన నివార్యతే. 410

తా. పురుషులకు మంచి గుణాలు ఉంటూ ఉంటే అవి తమంతట తామే బైటకి వస్తాయి. కస్తూరి సువాసన ఒట్టు పెట్టినా బైటకు వ్యాపించకుండా ఉండదు కదా ?

యేషాం హృదిస్థో భగవాన్ మఙ్గలాయతనం హరిః
నిత్యోత్సవః సదా తేషాం నిత్యశ్రీర్నిత్యమఙ్గలమ్. 411

తా. సర్వమంగళాలకు మూలకారణమైన (నిధియైన) భగవంతుడైన శ్రీమహావిష్ణువు ఎవరి హృదయంలో ఉంటాడో వాళ్లకు నిత్యమూ ఉత్సవమే, నిత్యమూ ఐశ్వర్యమే; నిత్యమూ మంగళమే.

యత్రాస్తి లక్ష్మీర్వినయో న తత్ర
హ్యభ్యాగతో యత్ర న తత్ర లక్ష్మీః,
ఉభౌ చ తౌ యత్ర న తత్ర విద్యా
నైకత్ర సర్వో గుణసంనిపాతః. 412

తా. లక్ష్మి ఉన్నచోట వినయం ఉండదు; వినయం వచ్చిన (ఉన్న) చోట లక్ష్మి ఉండదు. ఆ రెండూ ఉన్నచోట విద్య ఉండదు. అన్ని గుణాలూ ఒక చోట కలిసి ఉండవుకదా!

యేషాం న విద్యా న తపో న దానం
జ్ఞానం న శీలం న గుణో న ధర్మః,
తే మర్త్యలోకే భువి భారభూతా
మనుష్యరూపేణ మృగా శ్చరన్తి. 413

తా. మర్త్యలోకంలో ఎవనికైతే విద్య కాని, తపస్సు కాని, దానం కాని, జ్ఞానం కాని, శీలం కాని, గుణాలు గాని, ధర్మం కాని లేదో, వాళ్లు భూమికి భారమైన, మనుష్యరూపంలో ఉన్న మృగాలు

యస్య కస్య తరోర్మూలం యేన కేనాపి మిశ్రితమ్
యస్మై కస్మై ప్రదాతవ్యం యద్వా తద్వా భవిష్యతి. 414

తా. ఏదో ఒకచెట్టు వేరు తెచ్చి దేనితోనో ఒకదానితో కలిపి ఎవడికైనా ఇవ్వాలి; ఏదో ఒకటి అవుతుంది. (కొంతమంది వైద్యుల వైద్యం ఇలా ఉంటుంది).

యత్ర వైదికా స్తత్ర పణ్డితా
యత్ర పణ్డితా స్తత్ర వైదికాః,
యత్ర నోభయం తత్ర చోభయం
యత్ర చోభయం తత్ర నోభయమ్. 415

తా. వేదం చదువుకొన్నవాళ్లు ఉన్నచోట మేం శాస్త్రపండితులమని చెప్పుకుంటారు. శాస్త్రపండితులున్న చోట మేం వేదం చదువుకున్నాం అని చెప్పుకుంటారు. ఇద్దరూ లేనిచోట మేం వేదశాస్త్రాలు రెండూ చదువుకొన్నాం అని చెప్పుకుంటారు. ఇద్దరూ ఉన్నచోట మేం అంతగా ఏమీ చదువుకోలేదండీ అని చెపుతూంటారు. ఇంచుమించు ఈ శ్లోకం వంటిదే మరొక శ్లోకం—

యత్ర శాబ్దికా స్తత్ర తార్కికా
యత్ర తార్కికా స్తత్ర శాబ్దికాః,
యత్ర నోభయం తత్ర చోభయం
యత్ర చోభయం తత్ర నోభయమ్. 416

శాబ్దికాః=వైయాకరణులు

యథా వ్యాలగలస్థోఽపి భేకో దంశానపేక్షతే
తథా కాలాహినా గ్రస్తో లోకో భోగానశాశ్వతాన్. 417

తా. పాము నోట్లో ఉన్నా కప్ప ఎదట ఉన్న పురుగులకోసం నోరు చాపినట్లు కాలం అనే సర్పంచేత మ్రింగబడుతున్నా జనం అశాశ్వతమైన భోగాలను కోరుతూ ఉంటారు.

యథా దేశ స్తథా భాషా యథా రాజా తథా ప్రజాః
యథా భూమి స్తథా తోయం యథా బీజం తథాఙ్కురః. 418

తా. దేశాన్ని పట్టి భాష మారుతుంది; రాజు ఎలా ఉంటే ప్రజలు అలాగే ఉంటారు. నేలనిపట్టి నీరు ఉంటుంది; బీజం ఎలా ఉంటే అంకురం అలాంటిదే వస్తుంది.

యథా చిత్తే తథా వాచి యథా వాచి తథా క్రియాః
చిత్తే వాచి క్రియాయాం చ సాధూనామేకరూపతా. 419

తా మనస్సులో ఎట్లో మాటలలో కూడా అదే; మాటలలో ఎట్లో పనులు కూడా అంతే. సత్పురుషులు చిత్తంలోను, మాటల్లోను, పనులలోనూ కూడా ఒకే విధంగా ఉంటారు.

యతః సత్యం తతో ధర్మో యతో ధర్మ స్తతో ధనమ్
యతో రూపం తతః శీలం యతో నాగా స్తతో జయః. 420

తా. సత్యం ఉన్నచోట ధర్మం ఉంటుంది; ధర్మం ఉన్నచోట దనం ఉంటుంది; రూపం ఉన్నచోట శీలం ఉంటుంది; ఏనుగులు ఉన్నవారికి జయం లభిస్తుంది.

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః
స యత్ ప్రమాణం కురుతే లోక స్తదనువ ర్తతే(భ.గీ.) 421

తా. గొప్పవాడు ఏది చేస్తే సామాన్యులు కూడా అదే చేస్తారు. అతడు దేనిని ప్రమాణంగా అంగీకరిస్తే ఇతరులు కూడా దానినే అనుసరిస్తారు.

యస్మిన్ దేశే య ఆచారః స్థానే స్థానే యథా స్థితిః
తథైవ వ్యవహ ర్తవ్యం పారమ్పర్యాగతో విధిః. 422

తా. ఏ దేశంలో ఏ ఆచారమో, ఆ యా స్థానాలలో ఏ పద్ధతి ఉంటుందో దాని ప్రకారమే వ్యవహరించాలి ప్రాచీనకాలంనుంచీ ఒక క్రమంలో వస్తూన్నదే అనుసరించవలసిన విధి

యః స్వభావో హి యస్య స్యాత్తస్యాసౌ దురతిక్రమః
శ్వా యది క్రియతే రాజా స కిం నాశ్నాత్యుపానహమ్. 423

తా. ఎవడూ తనసహజగుణాన్ని విడిచిపెట్టజాలడు. కుక్కను రాజును చేస్తేమాత్రం అది చెప్పుకొరకడం మానుతుందా!

యద్భావి తద్భవత్యేవ యన్న భావి న తద్భవేత్
ఇతి నిశ్చితబుద్ధీనాం న చిన్తా బాధతే క్వచిత్. 424

తా. ఏది జరగవలసిఉందో అది జరిగి తీరుతుంది; ఏది జరగదో అది జరగదు. ఈ విధమైన నిశ్చయం ఉన్నవాళ్లని ఏ చింతా బాధించదు.

యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్
తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమాత్మబుద్ధిప్రసాదజమ్. (భ.గీ.)

తా. ఏది ప్రారంభంలో విషంలాగ ఉంటుందో, పరిణామంలో అమృతంవలె ఉంటుందో ఆ సుఖం సాత్త్వికసుఖం. అలాంటి సుఖం మనస్సు నిర్మలంగా ఉంటే కలుగుతుంది.

యదృచ్ఛాలాభసంతుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే. 426

తా. దైవవశంచేత ఏది లభిస్తే దానితో సంతోషించేవాడు, సుఖ-దుఃఖాదిద్వంద్వములకు అతీతుడు (వాటిని పట్టించుకోనివాడు). మాత్సర్యం లేనివాడు, ప్రయత్నం సఫలమైనా విఫలమైనా సమంగానే ఉండేవాడు ఏ పని చేసినా అది అతనికి అంటదు.

యః సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే. 427

తా. మనస్సులో పుట్టిన కోపాన్ని ఎవడైతే, ఓర్పుతో, సర్పం జీర్ణమైన చర్మని (కుబుసాన్ని) విడిచిపెట్టినట్లు విడిచిపెడతాడో అతడే పురుషుడు.

యస్య ఆశిష ఆశాస్తే న స భక్తః స వై వణిక్
ఆశాసానో న వై భృత్యః స్వామిన్యాశిష ఆత్మనః. 428

తా దేవుని దగ్గరికి వెళ్లి 'ఇది కావాలి, అది కావాలి' అని కోరుకొనేవాడు భక్తుడు కాడు; వ్యాపారంచేసేవాడు. ప్రభువుదగ్గరికి వెళ్లి తన కోర్కెలు ఏకరువు పెట్టేవాడు నిజమైన భృత్యుడు కాడు.

యదభావి న తద్భావి భావి చేన్న తదన్యథా
ఇతి మత్వా నరో విద్వాన్ నిశ్చిన్తో భవతి ధ్రువమ్. 429

తా "ఏది జరగడానికి వీలు లేదో అది జరగదు; ఏది జరగవలసి ఉందో అది మరొకవిధంగా కాదు" ఈ విధంగా ఆలోచించే బుద్ధిమంతుడికి ఏ మాత్రమూ చింత ఉండదు.

యథైకేన న హస్తేన తాలికా సంప్రపద్యతే
తథోద్యమపరిత్యక్తం కర్మ నోత్పాదయేత్ఫలమ్. 430

తా. ఒక చేతితో చప్పట్లు కొట్టడం ఎలా కుదరదో అదే విధంగా ప్రయత్నం లేని పని ఫలాన్ని ఇవ్వదు.

యద్దదాతి యదశ్నాతి తదేవ ధనినో ధనమ్
అన్యే మృతస్య క్రీడన్తి దారైరపి ధనైరపి. 431

తా. ధనికుడు ఇతరులకు ఇచ్చినదీ, తాను అనుభవించినదీ మాత్రమే వాని ధనం. అతడు మరణించినతరవాత వాని ధనంతోను, దారలతోను ఇతరులే సుఖిస్తారు.

యావద్విత్తోపార్జనసక్తస్తావన్నిజపరివారో రక్తః
పశ్చాజ్జీవతి జర్జరదేహే వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే.

తా. ధనం సంపాదిస్తూన్నంతవరకు తన వాళ్లందరూ ఆదరం చూపిస్తారు. చివరికి శరీరం జరాజర్జరం అయిపోయి జీవిస్తూన్నప్పుడు ఎవరూ వచ్చి ఎలా ఉన్నావు అనికూడా పలకరించరు.

యుక్తియుక్తముపాదేయం వచనం బాలకాదపి
విదుషాపి సదా గ్రాహ్యం వృద్ధాదపి న దుర్వచః 433

తా. పండితుడుకూడా యుక్తియుక్తమైన మాట బాలుడు చెప్పినా గ్రహించాలి. వృద్ధుడు చెప్పినా చెడ్డ మాట గ్రహించకూడదు.

యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా. (భ గీ.)434

తా ఆహార శరీరవ్యాయామాదులు తగు మోతాదులలో సేవిస్తూ, తన శక్తికి లోబడిన పనులే చేస్తూ తగినంత నిద్రా మెలకువా ఉంటూ జీవించే సాధకునికి దుఃఖాన్ని పోగొట్టే యోగం లభిస్తుంది.

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ (భ.గీ.)

తా. ఏ యే భక్తుడు నా ఏ యే స్వరూపాన్ని శ్రద్ధగా పూజ చడానికి కోరుతాడో వానికి నేను అలాంటి నిశ్చలమైన శ్రద్ధను ప్రసాదిస్తాను.

యో యత్ర కుశలః కార్యే తత్ర తం వినియోజయేత్
కార్యేష్వదృష్టకర్మా యః శాస్త్రజ్ఞోఽపి విముహ్యతి. 436

తా. ఎవనికి ఏ పనిలో నేర్పు ఉంటుందో వానిని ఆ పని చేయడానికి నియమించాలి. ఎంత శాస్త్రజ్ఞుడైనా పనిచేసే అలవాటులేనివాడు (అ శాస్త్ర జ్ఞానాన్ని ప్రయోగంలో చూపలేనివాడు) పొరబడతాడు.

యద్యపి స్యాత్స్వయం బ్రహ్మా త్రైలోక్యాకర్షణక్షమః
తథాపి లౌకికాచారం మనసాపి న లఙ్ఘయేత్. 437

తా సాక్షాత్తు మూడు లోకాలనీ ఆకర్షించగలిగిన బ్రహ్మదేవుడు అయినా లోకంలో ప్రచారంలో ఉన్న ఆచారాన్ని మనసా కూడ అతిక్రమించకూడదు.

యథా విహఙ్గాస్తరుమాశ్రయన్తి
నద్యో యథా సాగరమాశ్రయన్తి,
యథా తరుణ్యః శ్రియమాశ్రయన్తి
సర్వే గుణాః కాఞ్చనమాశ్రయన్తి. 438

తా. పక్షులు వృక్షాలను ఆశ్రయించినట్లుగా, నదులు సముద్రాన్ని ఆశ్రయించినట్లుగా, స్త్రీలు లక్ష్మని ఆశ్రయించినట్లుగా, అన్ని గుణాలూ బంగారాన్ని (ఐశ్వర్యాన్ని) ఆశ్రయించుకొని ఉంటాయి.

యస్యాస్తి విత్తం స నరః కులీనః
స పణ్డితః స శ్రుతవాన్ గుణజ్ఞః,
స ఏవ వక్తా స చ దర్శనీయః
సర్వే గుణాః కాఞ్చనమాశ్రయన్తి. 439

తా. ఎవనివద్ద ధనం ఉంటుందో వాడే సత్కులంలో పుట్టినవాడు; వాడే పండితుడు; వాడే చదువు ఉన్నవాడు, వాడే గుణగ్రహణసమర్థుడు, వాడే వక్త; వాడే చూడదగినవాడు (సుందరుడు); అన్ని గుణాలూ బంగారాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి.

యేన కేన ప్రకారేణ యస్య కస్యాపి దేహినః
సన్తోషం జనయేత్ప్రాజ్ఞస్తదేవేశ్వరపూజనమ్. 440

తా. తెలివైనవాడు ఏదో ఒక రీతిలో, ఏదో ఒక ప్రాణికి సంతోషం కలిగించాలి అదే ఈశ్వరపూజ.

ACC NO. 24766

యతీ చ బ్రహ్మచారీ చ సదా బద్ధశ్చ ఘోటకః
అన్తఃపురమరణ్యం చ సదా మైథునచిన్తకాః. 441

891.24
SRI

తా. స్పష్టము.

యో న యానం న పర్యఙ్కం న పీఠం న రథం గజమ్
ఆరోహేత్సంమతోఽస్మీతి స రాజవసతిం వసేత్. 442

24-200

తా. నేను రాజుగారికి ఇష్టుడనే కదా అనుకొని ఎవడైతే వాహనం కాని, పరుపు కాని, ఆసనం కాని, రథం కాని, ఏనుగు కాని (అతని సమక్షంలో) ఎక్కడో అలాంటివాడే రాజగృహంలో కొలువు చెయ్యాలి.

యో వై గృహేభ్యః ప్రవసన్ ప్రియాణాం నానుసంస్మరేత్
దుఃఖేన సుఖమన్విచ్ఛేత్ స రాజవసతిం వసేత్. 443

తా. ఎవడైతే ఇంటినుండి ప్రవాసం వెళ్లి దూరదేశంలో ఉంటూ తన వాళ్లని స్మరించడో, దుఃఖం అనుభవించడం ద్వారా సుఖాన్ని కోరుతాడో అలాంటివాడే రాజు కొలువు చెయ్యాలి.

యదభావి న తద్భావి భావి చేన్న తదన్యథా
ఇతి నిశ్చిత్య సతతం సర్వం త్యక్త్వా హరిం భజేత్. 444

తా. ఏది జరగడానికి వీలు లేదో అది జరగదు; ఏది జరగ నున్నదో అది జరిగితీరుతుంది. ఈ విధంగా నిశ్చయించుకొని, అన్ని చింతలూ విడచి హరిని సేవించాలి.

యత్ర యత్ర హరేరర్చా స దేశః శ్రేయసాం పదమ్
స వై పుణ్యతమో దేశః సత్పాత్రం యత్ర లభ్యతే. 445

తా. ఎక్కడెక్కడ విష్ణుపు పూజ జరుగుతుందో ఆ దేశం శ్రేయస్సులకు స్థానం ఎక్కడ సత్పాత్రదానం ఇవ్వడానికి తగిన మంచి వ్యక్తి లభిస్తాడో అదే అధికంగా పుణ్యమైన దేశము.

యస్మిన్ కాలే చ యద్దేశే యన్ముహూర్తే చ యద్దినే
హానిర్మృత్యుర్యశోలాభస్తత్తత్కాలే భవిష్యతి. 446

తా. ఏ కాలంలో, ఏ ప్రదేశంలో, ఏ ముహూర్తంలో, ఏ దివసంలో హాని కాని మృత్యువు కాని, యశస్సు కాని, లాభం కాని, లభించవలసి ఉన్నదో అది ఆ కాలంలోనే జరుగుతుంది.

యస్యార్థాస్తస్య మిత్రాణి యస్యార్థాస్తస్య బాన్ధవాః
యస్యార్థాః స పుమాన్ లోకే యస్యార్థాః స చ పణ్డితః (రామా.)

తా. ధనం ఉన్నవాడికే స్నేహితులు; ధనం ఉన్నవాడికే బంధువులు; ధనం ఉన్నవాడే ఈ లోకంలో మగవాడు; ధనం ఉన్నవాడే పండితుడు.

# ర

రాజపత్నీ గురోః పత్నీ మిత్రపత్నీ తథైవ చ
పత్నీమాతా స్వస్య మాతా పఞ్చైతా మాతరః స్మృతాః. 448

తా. రాజభార్య, గురుభార్య, మిత్రుని భార్య, తన భార్య తల్లి, తన తల్లి ఈ ఐదుగురూ తల్లులని చెప్పబడుచున్నారు.

రత్నాకరః కిం కురుతే స్వరత్నై
ర్విన్ధ్యాచలః కిం కరిభిః కరోతి,
శ్రీఖణ్డఖణ్డైర్మలయాచలః కిం
పరోపకారాయ సతాం విభూతయః. 459

తా॥ రత్నాలకి నిధియైన సముద్రం తన రత్నాలు ఏమి చేసికొంటుంది? వింధ్యపర్వతం ఏనుగుల్ని ఏం చేసికొంటుంది? మలయపర్వతం చందనవనాలు ఏం చేసికొంటుంది? సత్పురుషుల ఐశ్వర్యాలు పరోపకారం నిమిత్తమే.

రే రే చాతక సావధానమనసా మిత్ర ! క్షణం శ్రూయతా
మమ్భోదా బహవో వసన్తి గగనే సర్వేఽపి నైతాదృశాః,
కేచిద్వృష్టిభిరార్ద్రయన్తి ధరణీం గర్జన్తి కేచిద్వృథా
యం యం పశ్యసి తస్య తస్య పురతో మా బ్రూహి దీనంవచః.

తా॥ మిత్రమా! ఓ చాతకమా! ఒక్క మాటు నేను చెప్పే మాట సావధానమైన మనస్సుతో విను; ఆకాశంలో చాలా మేఘాలు ఉన్నాయి; అయితే అన్ని మేఘాలు ఇలాంటివి (నీకు ఉపకరించేవి) కాదు. కొన్ని వర్షించి భూమిని తడుపుతాయి. కొన్ని వృథాగా గర్జిస్తూ ఉంటాయి. కనబడిన ప్రతి మేఘం ఎదటా దీనంగా మాటలాడకు.

రాజ్ఞి ధర్మిణి ధర్మిష్ఠాః పాపే పాపాః సమే సమాః
లోకాస్తమనువర్తన్తే యథా రాజా తథా ప్రజాః. 451

తా. రాజు ధర్మాత్ముడైతే ప్రజలు ధర్మాత్ములుగా ఉంటారు. అతడు పాపాత్ముడైతే వీళ్లు పాపాత్ములుగానే ఉంటారు; అతడు మధ్యస్థుడుగా ఉంటే వీళ్లూ అలాగే ఉంటారు. ప్రజలు రాజు పద్ధతినే అనుసరిస్తారు. రాజు ఎట్లో ప్రజలు అట్లు.

రాజా రాక్షసరూపేణ వ్యాఘ్రరూపేణ మన్త్రిణః
సేవకా వృకరూపేణ యథా రాజా తథా ప్రజాః. 452

తా. రాజు రాక్షసుడల్లా ప్రవర్తిస్తే మంత్రులు పెద్దపులులలాగ ప్రవర్తిస్తారు; సేవకులు తోడేళ్లలాగ ప్రవర్తిస్తారు. రాజు ఎట్లో అట్లే ప్రజలూను.

రమణీయః స హి పురుషో రమణీ యత్రైవ రజ్యతి విదగ్ధా
శ్లోకః స ఏవ సుభగశ్చిత్తం సక్తం హి యత్ర రసికస్య. 453

తా నెరజాణల అనురాగాన్ని చూరకొనగలిగినవాడే సుందరుడు. రసికుని చిత్తాన్ని ఆకర్షించకలిగేదే మంచి శ్లోకం (కవిత్వం)

రజ్జుం కరోతి రాజానం రాజానం రజ్జుమేవ చ
ధనినం నిర్ధనం చైవ నిర్ధనం ధనినం తథా. 454

తా. దైవం బిచ్చగాణ్ణి రాజును చేస్తుంది, రాజును బిచ్చగాణ్ణి చేస్తుంది. ధనవంతుణ్ణి దరిద్రుణ్ణి చేస్తుంది. దరిద్రుణ్ణి ధనవంతుణ్ణి చేస్తుంది.

రామో రాజమణిః సదా విజయతే రామం రమేశం భజే
రామేణాభిహతా నిశాచరచమూ రామాయ తస్మై నమః,
రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య దాసోఽస్మ్యహం
రామే చిత్తలయః సదా భవతు మే భో రామ మాముద్ధర. 455

తా రాజులలో మణివంటివాడైన రాముడు ఎల్లప్పుడూ అందరికంటె మిన్నగా ప్రకాశిస్తున్నాడు. లక్ష్మీపతియైన రాముణ్ణి సేవిస్తున్నాను. రాముని చేత రాక్షససేన చంపబడింది. అలాంటి రామునికొరకు (రామునికి) నమస్కారం. రాముణ్ణి మించిన మరొక ఉత్తమగతి లేదు. నేను రామునియొక్క దాసుణ్ణి. నా మనస్సు ఎల్లప్పుడు రామునియందు లీనం అవుగాక. ఓ! రామా! నన్ను ఉద్ధరించుము. (ఈ శ్లోకంలో రామశబ్దం ఎనిమిది విభక్తుల ఏకవచనాలు కూర్చబడి ఉన్నాయి).

రాజా రాష్ట్రకృతం పాపం రాజ్ఞః పాపం పురోహితః
భర్తా చ స్త్రీకృతం పాపం శిష్యపాపం గురుస్తథా. 456

తా. తన రాజ్యంలో జరిగే పాపాన్ని రాజు పొందుతాడు. రాజు చేసిన పాపాన్ని పురోహితుడు (ఈ రోజుల్లో అయితే సలహా ఇచ్చేవాడు) పొందుతాడు. స్త్రీచేసిన పాపాన్ని భర్త పొందుతాడు. శిష్యుడు చేసిన పాపాన్ని గురువు పొందుతాడు.

రాజసేవా మనుష్యాణామసిధారావలేహనమ్
పఞ్చాననపరిష్వఙ్గో వ్యాలీవదనచుమ్బనమ్. 457

తా. మానవులకు రాజసేవ అనేది కత్తి అంచు నాకడమే; సింహాన్ని కౌగలించుకోవడమే. పాము ముట్టెను ముద్దుపెట్టుకోవడమే.

## ల

లులాయే గోమాయౌ మృగపరిషది శ్వాపదకులే
కరిష్యన్ కార్పణ్యం కిమిహ మహిమానం గమయసి,
నిమగ్నః పఙ్కేఽస్మిన్నసభవ కరీన్ద్రాధిప దశామ్
అభద్రం భద్రం వా విధిలిఖితమున్మూలయతి కః. 458

తా. ఓ! గజరాజమా! ఈ బురదలో దిగబడిపోయి ఉన్నప్పుడు ఈ దారిలో పోయే దున్నపోతుతోను, నక్కతోను, లేళ్లగుంపుతోను, ఇతరవన

జంతువులతోను దీనంగా మొరపెట్టుకొని వాటికి లేని గొప్పతనాన్ని ఎందుకు ఆపాదిస్తావు! నీకు వచ్చి పడిన దుర్దశను అనుభవించడం ఒక్కటే మార్గం. బ్రహ్మ రాసిన చెడ్డనైనా మంచినైనా ఎవరు తుడిచివేయగలరు?

లోకప్రవాదః సత్యోఽయం పణ్డితైః సముదాహృతః
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా. (రామా).

తా. "స్త్రీకైనా పురుషునికైనా, ఎంత కోరుకొన్నా, కాలం వస్తేనే కాని మృత్యువు రాదు" అనే పండితులు చెప్పే లోకోక్తి సత్యం.

లుబ్ధానాం యాచకః శత్రుర్మూర్ఖాణాం చోదకో రిపుః
జారిణీనాం పతిః శత్రుశ్చోరాణాం చన్ద్రమా రిపుః. 460

తా. పిసినారులకి యాచకుడు శత్రువు, మూర్ఖులకి ఉపదేశం చేసే వాడు శత్రువు, కులటలకు భర్త శత్రువు, దొంగలకు చంద్రుడు శత్రువు.

లాలనాద్బహవో దోషాస్తాడనాద్బహవో గుణాః
తస్మాత్పుత్రం చ శిష్యం చ తాడయేన్న తు లాలయేత్. 461

తా. లాలన చేయడం చాలా దోషాలకి కారణం; కొట్టడం చాలా గుణాలకు కారణం. అందుచేత పుత్రుణ్ణి శిష్యుణ్ణి కూడా దండించాలికాని గారాబం చేయకూడదు.

లోకయాత్రా నయో లజ్జా దాక్షిణ్యం త్యాగశీలతా
పఞ్చ యత్ర న విద్యన్తే న తత్ర దివసం వసేత్. 462

తా. జీవించడానికి వృత్తి, నీతి, సిగ్గు, మంచితనం, త్యాగస్వభావం— ఈ ఐదూ లేనిచోట ఒక్క రోజుకూడా ఉండకూడదు.

లాలయేత్పఞ్చ వర్షాణి దశవర్షాణి తాడయేత్
ప్రాప్తే తు షోడశే వర్షే పుత్రం మిత్రవదాచరేత్. 463

తా పుత్రుణ్ణి ఐదు సంవత్సరాలు గారాబం చెయ్యాలి తరవాత పది సంవత్సరాలు కొట్టి బుద్ధి చెప్పాలి. పదహారో సంవత్సరం వచ్చిన తరవాత మిత్రుణ్ణి చూచినట్లు చూడాలి.

లుబ్ధమర్థేన గృహ్ణీయాత్ స్తబ్ధమఞ్జలికర్మణా
మూర్ఖం ఛన్దానురోధేన యాథార్థ్యేన చ పణ్డితమ్. 464

తా. డబ్బు ఆశించేవానిని ధనం ఇచ్చి వశంచేసుకోవాలి. మొండి పట్టు పట్టేవానిని చేతులు జోడించి నమస్కరించి లొంగదీసికోవాలి. మూర్ఖుణ్ణి వాడు చెప్పినట్లు విని మంచి చేసుకోవాలి. పండితుణ్ణి ఉన్న యథార్థం ఏమిటో చెప్పి అనుకూలుణ్ణి చేసుకోవాలి

లోభమూలాని పాపాని వ్యాధయో రసమూలకాః
స్నేహమూలాని దుఃఖాని త్రీణి త్యక్త్వా సుఖీ భవ. 465

తా. పాపాలకి మూలం దురాశ. వ్యాధులకు మూలం రుచులు. దుఃఖానికి మూలం స్నేహం ఈ మూడింటిని విడిచిపెట్టి సుఖంగా ఉండు

లోభమూలాని పాపాని లాభాల్లోభో వివర్ధతే
త్రిమాషఘటితం కార్యం త్రికోట్యాపి న పూర్యతే. 466

తా. పాపాలకి మూలం అత్యాశ. లాభం వస్తూన్నకొలదీ దురాశ పెరుగుతూ ఉంటుంది. మూడు మాషాలతో (చిన్న నాణాలు) పూర్తికావలసిన పని (చేసేవాళ్ల, చేయించేవాళ్ల) ఆశ పెరిగినకొలదీ మూడు కోట్ల మాషాలకి కూడా పూర్తికాదు.

లోభావిష్టో నరో విత్తం వీక్షతే నైవ చాపదమ్
దుగ్ధం పశ్యతి మార్జారో యథా న లగుడాహతిమ్. 467

తా. దురాశతో నిండిన మానవుడికి డబ్బే కనిపిస్తుంది కాని తరవాత వచ్చే ఆపద కనబడదు. పిల్లి దృష్టి పాలమీదనే ఉంటుంది. అది కఱ్ఱదెబ్బను చూడదు.

లాభేన హర్షయేద్యస్తు న వ్యథేద్యోఽవమానితః
అసమ్మూఢశ్చ యో నిత్యం స రాజవసతిం వసేత్. 468

తా ఎవడు లాభం వచ్చినప్పుడు సంతోషించడో, అవమానించబడినా వ్యథ చెందడో, ఎల్లప్పుడూ జాగరూకతతో మెలుగుతాడో అలాంటివాడే రాజసేవ చెయ్యాలి

## వ

వ్యవస్థితః ప్రశాన్తాత్మా కుపితోఽప్యభయంకరః
అవ్యవస్థితచిత్తస్య ప్రసాదోఽపి భయంకరః. 469

తా. నిలకడ ఉండి ప్రశాంతమైన మనస్సు ఉన్నవానికి కోపం వచ్చినా భయపడవలసిన పని లేదు. నిలకడలేని మనస్సు కలవానికి అనుగ్రహం కలిగినా భయపడాలి.

విశ్వాసం ప్రతిపన్నానాం వఞ్చనే కా విదగ్ధతా
అఙ్కమారుహ్య సుప్తం హి హత్వా కిం నామ పౌరుషమ్. 470

తా. నమ్మినవాళ్లని మోసం చేయడంలో పెద్ద నేర్పు ఏముంది ? ఒడిలో పండుకొని నిద్రపోతున్నవాణ్ణి చంపడంలో పౌరుషం ఏమున్నది?

వృద్ధార్కో యజ్ఞధూమశ్చ బాలా స్త్రీ నిర్ఝరోదకమ్
ఆయుష్యవర్ధకం నిత్యం రాత్రౌ క్షీరాన్నభోజనమ్. 471

తా. సాయంకాలపు ఎండ, యజ్ఞధూమం, చిన్న వయస్సు గల యువతి. సెలయేటి నీరు, రాత్రి పాలూ అన్నం భుజించడం ఇవి ఆయుస్సును పెంచుతాయి.

వ్యాలాశ్రితాపి విఫలాపి సకణ్టకాపి
వక్రాపి పఙ్కిలభవాపి దురాసదాపి,

గన్ధేన బన్ధురసి కేతకి సర్వజన్తోః
ఏకో గుణః ఖలు నిహన్తి సమస్తదోషాన్. 472

తా. ఓ! మొగలిపువ్వా! నిన్ను సర్పాలు ఆశ్రయించి ఉంటాయి. నువ్వు ఫలాలు ఇవ్వవు. ముళ్లు నిండి ఉంటావు. వంకరగా ఉంటావు, బురదనేలలో పుడతావు. నిన్ను చేరడమే కష్టం. అయినా కూడా నీ సువాసనచేత అందరికీ బంధువు అవుతున్నావు. ఒక్క మంచి గుణం సమస్తదోషాలనూ కప్పివేస్తుంది కదా ?

విపత్తౌ కిం విషాదేన సంపత్తౌ హర్షణేన కిమ్
భవితవ్యం భవత్యేవ కర్మణో గహనా గతిః. 473

తా. ఆపదలలో దుఃఖించడం ఎందుకు, సంపదలలో సంతోషించడం ఎందుకు ? ఏది జరగనున్నదో అది జరిగితీరుతుంది; కర్మగతిని (ఏ కర్మ ఎపుడు ఏ ఫలం ఇస్తుందో) తెలుసుకోవడం కష్టం.

వేదాన్తవాక్యేషు సదా రమన్తో భిక్షాన్నమాత్రేణ చ తుష్టిమన్తః
విశోకమన్తఃకరణే రమన్తః కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః.
(శం అ.) 474

తా. ఎల్లప్పుడూ వేదాంతవాక్యాలు (ఉపనిషత్తులు) చదువుకొంటూ ఆనందిస్తూ, భిక్షాన్నంతోనే సంతృప్తి చెందుతూ, మనస్సులో ఏ బాధలూ లేకుండా సంతోషిస్తూ కౌపీనం మాత్రం ధరించిన వారే నిజమైన భాగ్యవంతులు కదా ?

వినాశే బహవో దోషా జీవన్ ప్రాప్నోతి భద్రకమ్
తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః (రామా.)

తా. (సీత కనబడకపోవడంచేత నిరాశుడైన హనుమంతుడు అనుకొంటున్న మాటలు). మరణిస్తే చాలా నష్టాలు ఉన్నాయి బ్రతికి ఉన్న వాడు ఎప్పటికైనా మంచిని చూస్తాడు; అందుచేత ప్రాణాలు ధరిస్తాను.

(ఆత్మహత్య చేసికొనను). జీవించినవాడు తప్పకుండా కావలసినవారిని ఎప్పటికైనా కలుసుకుంటాడు.

వయోవృద్ధాస్తపోవృద్ధా జ్ఞానవృద్ధా బహుశ్రుతాః
ఇత్యేతే ధనవృద్ధస్య ద్వారే తిష్ఠన్తి కింకరాః 476

తా. వయస్సుచేత వృద్ధులూ, తపస్సుచేత వృద్ధులు, బాగా చదువుకొని జ్ఞానంచేత వృద్ధులైనవారు, ఇలాంటి వారందరూ కూడ ధనంచేత వృద్ధుడైన వాని ద్వారం దగ్గర కింకరులై పడి ఉంటారు.

విద్యతే కలహో యత్ర గృహే నిత్యమకారణః
తద్గృహం జీవితం వాఞ్ఛన్ దూరతః పరివర్జయేత్. 477

తా. నాలుగు కాలాలపాటు జీవించాలని అనుకొన్నవాడు ఏ కారణమూ లేకుండా ఎల్లప్పుడూ కలహం జరిగే గృహాన్ని దూరంగా విడిచిపెట్టాలి.

వేఙ్కటాద్రిసమం స్థానం బ్రహ్మాణ్డే న భవిష్యతి
వేఙ్కటేశసమో దేవో న భూతో న భవిష్యతి. 478

తా. బ్రహ్మాండంలో వేంకటాద్రివంటి (తిరుమలవంటి) స్థానం ఉండదు. వేంకటేశ్వరస్వామితో సమానుడైన దేవుడు పూర్వం లేడు, ఇటుపైన రాబోడు.

వ్యాధేస్తత్త్వపరిజ్ఞానం వేదనాయాశ్చ నిగ్రహః
ఏతద్వైద్యస్య వైద్యత్వం న వైద్యః ప్రభురాయుషః. 479

తా. వ్యాధి స్వరూపాన్ని గుర్తించడం, బాధను ఉపశమింపచేయడం, ఇదే వైద్యుడు చేసే వైద్యం; అంతే కాని ఆయుర్దాయం ఇచ్చే శక్తి వైద్యునికి లేదు.

విపులహృదయైకయోగ్యే
ఖిద్యతి కావ్యే(శాస్త్రే)జడో న మౌర్ఖ్యే స్వే,

నిన్దతి కఞ్చుకకారం
ప్రాయః శుష్కస్తనీ నారీ. 480

తా. మూర్ఖుడు ఎంతో హృదయవైశాల్యం (బుద్ధిబలం) ఉంటేనే కాని అర్థం కాని కావ్యాన్ని (శాస్త్రాన్ని) తిడతాడు కాని తన మూర్ఖత్వాన్ని తిట్టుకొనడు. సాధారణంగా స్తనాలు శుష్కించిపోయిన స్త్రీ రవిక కుట్టినవాణ్ణి తిడుతుంది.

వనేషు దోషాః ప్రభవన్తి రాగిణాం
గృహేషు పఞ్చేన్ద్రియనిగ్రహస్తపః,
అకుత్సితే కర్మణి యః ప్రవర్తతే
నివృత్తరాగస్య గృహం తపోవనమ్. 481

తా. విషయాసక్తి కలవాళ్లు అడవిలో ఉన్నా చెడ్డ పనులు చేయవచ్చు ఇంట్లో ఉన్నవాళ్లు కూడా ఐదు ఇంద్రియాలను నిగ్రహించుకొనడం అనే తపస్సు చేయవచ్చు. ఎవడైతే నింద్యము కాని పనులు మాత్రమే చేస్తాడో, విషయాసక్తి లేని ఆలాంటివానికి గృహమే తపోవనం.

విరలా జానన్తి గుణాన్విరలాః కుర్వన్తి నిర్ధనస్నేహమ్
విరలా రణేషు ధీరాః పరదుఃఖేనాపి దుఃఖితా విరలాః. 482

తా. గుణాలను గ్రహించే వాళ్లు అరుదుగా ఉంటారు. దరిద్రునితో స్నేహం చేసేవాళ్లు అరుదుగా ఉంటారు. యుద్ధాలలో ధైర్యం వహించేవాళ్లు అరుదుగా ఉంటారు. ఇతరుల దుఃఖాన్ని చూచి దుఃఖించే వాళ్లు అరుదుగా ఉంటారు.

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః (భ.గీ.) 483

తా. పండితులు విద్యావినయసంపన్నుడైన బ్రాహ్మణునిలోను, గోవులోను, ఏనుగలోను, కుక్కలోను, కుక్కమాంసం తినేవానిలోనూ కూడా బ్రహ్మను చూస్తారు.

వీణావాదనతత్త్వజ్ఞః శ్రుతిజాతివిశారదః
తాలజ్ఞశ్చాప్రయాసేన మోక్షమార్గం నిగచ్ఛతి.
(యాజ్ఞవల్క్యస్మృతి). 484

తా వీణావాదనంలోని తత్త్వం తెలిసినవాడు, శ్రుతులలోను (సంగీతంలోని) జాతులలోను నేర్పు కలవాడు, తాలజ్ఞానం కలవాడు అనాయాసంగా మోక్షం పొందుతారు.

వహ్నౌ విశుద్ధామపి జానకీం తాం
జహౌ వనాన్తే కిల రామచన్ద్రః,
సా కిం న శుద్ధా స చ కిం న వేత్తా
బలీయసీ కేవల మీశ్వరేచ్ఛా. 485

తా. అగ్నిశుద్ధురాలైనా కూడ జానకిని రాముడు అరణ్యానికి పంపివేశాడు ఆమె పరిశుద్ధురాలు కాదా; ఆయనకి ఆ విషయం తెలియదా? కేవలం ఈశ్వరేచ్ఛ బలవత్తరమైనది.

వృద్ధకాలే మృతా భార్యా బన్ధుహస్తగతం ధనమ్
భోజనం చ పరాధీనం త్రయం పుంసాం విడమ్బనా. 486

తా వార్ధక్యంలో భార్య చనిపోవడం, ధనం బంధువుల చేతులలో ఉండడం, భోజనానికి పరులమీద ఆధారపడడం ఈ మూడూ మానవునికి దుఃఖహేతువులు.

వయమిహ పరితుష్టా వల్కలైస్త్వం దుకూలైః
సమ ఇహ పరితోషో నిర్విశేషో విశేషః,
స తు భవతి దరిద్రో యస్య తృష్ణా విశాలా
మనసి చ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః. (భ.హ) 487

తా. మేము నారచీరలతో సంతోషిస్తున్నాము; నీవు పట్టుబట్టలు కట్టుకొని సంతోషిస్తున్నావు. మన ఇద్దరికీ ఉన్న సంతోషం సమానమే.

విశేషం ఏ మాత్రమూ లేదు. ఎవని ఆశ అనంతమైనదో వాడు దరిద్రుడు కావచ్చును. మనస్సు సంతోషించిన తరవాత దనికుడు ఎవడు, దరిద్రుడెవడు ?

> వివాహోఽర్థశ్చ మరణమన్నం జననమేవ చ
> కణ్ఠే బద్ధ్వా దృఢం సూత్రం యత్రస్థం తత్ర నీయతే. 488

తా వివాహము, దనము, మరణము, అన్నము, జన్మ ఇవి ఎవరికి ఎక్కడ ప్రాప్తి ఉంటే వాడు అక్కడికి కంఠానికి త్రాడువేసి కట్టి లాగి తీసికొని వెళ్లినట్లుగా చెరతాడు.

> వ్యాఘ్రస్తిష్ఠతి కాననే సుగహనాం సింహో గుహాం సేవతే
> హంసోఽప్యాశ్రయ చ పద్మినీం కుసుమితాం గృధ్రః శ్మశాన
> స్థలీమ్,
> సాధుః సత్కృతిసాధుమేవ భజతే నీచోఽపి నీచం జనం
> యా యస్య ప్రకృతిః స్వభావజనితా కేనాపి న త్యజ్యతే. 489

తా పెద్దపులి అడవిలో సంతోషంగా ఉంటుంది; సింహం చాల లోతైన గుహలో ఉంటుంది; హంస శీఘ్రంగా వికసించిన పద్మలత దగ్గరికి చేరుతుంది; గ్రద్ద శ్మశానంలో నివసిస్తుంది; సత్పురుషుడు మంచి పనులు చేసే సత్పురుషుని దగ్గరికి చేరుతాడు. నీచుడు నీచునిదగ్గరకి చేరుతాడు. ఎవ్వరూ కూడా తమ సహజమైన ప్రకృతిని విడవజాలరు.

> విశాఖాన్తా గతా మేఘాః ప్రసవాన్తం హి యౌవనమ్
> ప్రణామాన్తం సతాం కోపో యాచనాన్తం హి గౌరవమ్. 490

తా. విశాఖకార్తి వచ్చిన దంటే దానితో మేఘాలు పోతాయి. యౌవనం ప్రసవంతో ఆఖరు. సత్పురుషుల కోపం నమస్కారం చేస్తే పోతుంది గౌరవం యాచించకుండా ఉన్నంతవరకే.

వయసి గతే కః కామవికారః
శుష్కే నీరే కః కాసారః,
క్షీణే విత్తే కః పరివారో
జ్ఞాతే తత్త్వే కః సంసారః. (మోహముద్గరం) 491

తా. వయస్సు మళ్లిన తరవాత మన్మథవికారా లేమిటి? నీళ్లు ఎండిపోయాక చెరు వేమిటి? ధనం క్షీణించిన తరవాత ఇంక పరివారం ఎవరుంటారు? తత్త్వం తెలిసిన తరవాత ఇంక సంసారం ఎక్కడుంటుంది?

వచస్తత్రైవ వక్తవ్యం యత్రోక్తం సఫలం భవేత్
స్థాయీ భవతి చాత్యన్తం రఙ్గః శుక్లపటే యథా. 492

తా. ఎవరికి సలహా ఇస్తే ఉపయోగిస్తుందో వాళ్లకే ఇవ్వాలి. (లేదా ఎక్కడ ఒక మాట చెపితే బాగుంటుందో అక్కడనే ఆ మాట చెప్పాలి). అది తెల్ల బట్టకి వేసిన రంగులాగ స్థిరంగా ఉండిపోతుంది

విషం కుపఠితా విద్యా విషం వ్యాధిరనౌషధః
విషం వ్యాధిర్దరిద్రస్య వృద్ధస్య తరుణీ విషమ్. 493

తా సరిగా నేర్చుకొనని విద్య విషం. ఔషధం లేని వ్యాధి విషం. దరిద్రునికి వ్యాధి విషం. వృద్ధునికి యువతి విషం.

వృన్తాకం కోమలం పథ్యం కూష్మాణ్డం కోమలం విషమ్
ఆర్ద్రికం చ సదా పథ్యమపథ్యం బదరీఫలమ్. 494

తా. వంగకాయ లేతది పథ్యం, లేతగుమ్మడికాయ విషం. అల్లం ఎల్లప్పుడూ పథ్యం. రేగిపండు పథ్యం కాదు.

మా మా నిర్మలం బ్రహ్మావృన్దం
వృ వృ తత్త్వచిన్తానువాదః,
వా వా జాయతే తత్త్వబోధో
బోధే బోధే భాసతే చన్ద్రచూడః. 495

తా. ప్రతిమార్గంలోనూ పవిత్రమైన బ్రాహ్మణసముదాయం లభిస్తుంది. ప్రతిబ్రాహ్మణవృందంలోను తత్త్వవిచారం జరుగుతూంటుంది. ప్రతివిచారంలోను తత్త్వబోధ కలుగుతుంది. ప్రతితత్త్వబోధలో పరమేశ్వరుడు సాక్షాత్కరిస్తూంటాడు.

విప్రాస్మిన్ నగరే మహాన్ కథయ కస్తాలద్రుమాణాం గణః
కో దాతా రజకో దదాతి వసనం ప్రాతర్గృహీత్వా నిశి,
కో దక్షః పరదారవిత్తహరణే సర్వోఽపి దక్షో జనః
కస్మాజ్జీవసి హే సఖే విషకృమిన్యాయేన జీవామ్యహమ్. 496

తా. "ఓ! బ్రాహ్మణుడా! ఈ నగరంలో మహాన్ (గొప్పవాడు; పెద్దది) ఎవరు?" "తాటిచెట్లు". ''దాత ఎవరు?'' "చాకలి. ఎందుచేతననగా– అతడు బట్టలు ప్రొద్దుట తీసికొని వెళ్లి రాత్రికి ఇచ్చివేస్తాడు''. "సమర్థుడు ఎవరు?''. "పరభార్యలనూ, పరధనాన్నీ హరించడంలో అందరూ నేర్పరులే". "అయితే మిత్రమా! ఈ నగరంలో ఎలా జీవించకలుగుతున్నావయా?" "విషంలో పుట్టిన పురుగు విషంలోనే జీవించి నట్లు జీవిస్తున్నాను."

విషాద ప్యమృతం గ్రాహ్యమమేధ్యాదపి కాంచనమ్
నీచాదప్యుత్తమాం విద్యాం స్త్రీరత్నం దుష్కులాదపి. 497

తా. విషంలో కూడా అమృతం ఉంటే ఆ అమృతాన్ని తీసికోవాలి. అపవిత్రస్థలంనుంచి కూడా బంగారం తీసికోవాలి. నీచుడిదగ్గరనుండి కూడా ఉత్తమవిద్య నేర్చుకోవాలి, చెడ్డ కులంనుంచి కూడా మంచి స్త్రీని తీసికోవాలి

విద్వత్త్వం చ నృపత్వం చ నైవ తుల్యం కదాచన
స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే. 498

తా. పండితుడై ఉండడం, రాజు అవడం ఈ రెండూ ఎన్నడూ సమానమైనవి కావు. రాజుని అతని దేశంలో మాత్రమే పూజిస్తారు. పండితుడు అన్ని దేశాల్లోనూ పూజించబడతాడు.

విద్వానేవ విజానాతి విద్వజ్జనపరిశ్రమమ్
న హి వన్ధ్యా విజానాతి గుర్వీం ప్రసవవేదనామ్. 499

తా. విద్వాంసుల పరిశ్రమను విద్వాంసులే అర్థం చేసుకోకటగుతారు. ప్రసవవేదన ఎంత భరింపశక్యంకాకుండా ఉంటుందో గొడ్రాలికి తెలుస్తుందా ?

విభవాః సర్వతః పూజ్యా న శరీరాణి దేహినామ్
నీచోఽపి హి నరశ్రేష్ఠో యస్యాస్తి విపులం ధనమ్. 500

తా. మానవుల ఐశ్వర్యానికే గౌరవం కాని వాళ్ల శరీరాలకి కాదు. ఎంత నీచుడైనా ధనం ఉంటే నరులలో శ్రేష్ఠుడవుతాడు.

వీణేవ శ్రోత్రహీనస్య లోలాక్షీవ విపక్షుషః,
వ్యసోః కుసుమమాలేవ విద్యా స్తబ్ధస్య నిష్ఫలా. 501

తా చెవిటివానికి వీణ వలె, గ్రుడ్డివానికి సుందరి వలె, శవానికి పుష్పమాల వలె, మూర్ఖునికి విద్య వ్యర్థం.

వ్యసనాని సన్తి బహవో వ్యసనద్వయమేవ కేవలం వ్యసనమ్,
విద్యావ్యసనం వ్యసనం హ్యథవా హరిపాదసేవనం వ్యసనమ్.

తా. ఎన్నో రకాల వ్యసనాలు (తీవ్రమైన అలవాట్లు) ఉన్నాయి. అయితే రెండు వ్యసనాలు మాత్రమే మంచి వ్యసనాలు. విద్యావ్యసనమే మంచి వ్యసనం. విష్ణుపాదసేవే మంచి వ్యసనం.

వివాహో జన్మ మరణం యదా యత్ర చ యేన చ,
త్రయః కాలకృతాః పాశాః శక్యన్తే న నివర్తితుమ్. 503

తా. వివాహమూ, పుట్టుకా, మరణమూ అనేవి ఎప్పుడు, ఎక్కడ, దేనిచేత కలుగుతాయో తెలియని కాలనిర్మితమైన పాశాలు; వాటిని మరల్చడం అసంభవం.

వేషం న విశ్వసేత్ప్రాజ్ఞో వేషో దోషాయ కల్పతే,
రావణో భిక్షురూపేణ జహార జనకాత్మజామ్. 504

తా. బుద్ధిమంతుడు పై పై వేషాన్ని నమ్మకూడదు. వేషం అపాయానికి దారితీయవచ్చు. రావణుడు సంన్యాసివేషంతో వచ్చి సీతను అపహరించాడు.

వైద్యరాజ నమస్తుభ్యం యమరాజసహోదర,
యమస్తు హరతి ప్రాణాన్ వైద్యః ప్రాణాన్ ధనాని చ. 505

తా. యమధర్మరాజుకు సోదరుడవైన వైద్యరాజా! నీకొక నమస్కారం యముడు ప్రాణాలు మాత్రం హరిస్తాడు; వైద్యుడు ప్రాణాలు ధనమూ కూడా హరిస్తాడు.

వైద్యానాం శారదీ మాతా పితా చ కుసుమాకరః,
యమదంష్ట్రా స్వసా ప్రోక్తా హితభుఙ్మితభుగ్రిపుః. 506

తా. వైద్యులకు శరత్కాలపు వెన్నెల (కార్తికపూర్ణిమ) తల్లి. వసంతర్తువు తండ్రి; యమదంష్ట్రాకాలం (ఆశ్వయుజమాసంలోని ఎనిమిది రోజులు, కార్తికమాసము రోగాలు కలిగే కాలం అవడంచేత దానికి యమదంష్ట్ర=యమునికోర, అని పేరు), తోబుట్టువు-హితంగాను మితంగాను భుజించేవాడు శత్రువు.

## శ

శాస్త్రం సుచిన్తితమథో పరిచిన్తనీయ
మారాధితోఽపి నృపతిః పరిసేవనీయః,
అఙ్కే ధృతాపి తరుణీ పరిరక్షణీయా
శాస్త్రే నృపే చ యువతౌ చ కుతో వశిత్వమ్. 507

తా. ఎంత బాగా చదివినా శాస్త్రం ఇంకా చదువుతూనే ఉండాలి. ఎంత సేవించినా ప్రభువును సేవిస్తూనే ఉండాలి. తరుణి ఒడిలోనే ఉన్నా ఆమెను రక్షించుకోవాలి. శాస్త్రము, ప్రభువు, యువతి వశంలోనే ఉన్నట్లు భావించి ఏమరిపాటు చెందగూడదు.

శుకవద్భాషణం కుర్యాద్బకవద్ధ్యానమాచరేత్
అజవచ్చర్వణం కుర్యాద్గజవత్స్నానమాచరేత్. 508

తా. చిలకలాగ తియ్యగా మాటలాడాలి. కొంగలాగ నిశ్చలంగా ధ్యానం చెయ్యాలి. మేకలాగ గబగబా నమలాలి ఏనుగలాగ నీటిలో దిగి చాలసేపు స్నానం చెయ్యాలి.

శరీరే జర్జరీభూతే వ్యాధిగ్రస్తే కళేబరే
ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః. 509

తా. శరీరం వ్యాధిగ్రస్తమై జర్జరం అయిపోయినప్పుడు ఔషధం ఏదైనా గంగాజలమే. వైద్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు.

శిరసా ధార్యమాణోఽపి సోమః సోమేన శమ్భునా,
తథాపి కృశతాం ధత్తే కష్టః ఖలు పరాశ్రయః. 510

తా. సోముడు (చంద్రుడు) సోముడైన (ఉమాదేవితో కూడిన) ఈశ్వరునిచేత శిరస్సుమీద ధరింపబడినా అతడు కృశుడుగానే ఉంటున్నాడు. ఇతరులను ఆశ్రయించి బ్రతకడం కష్టమే కదా!

శ్రేష్ఠతా జన్మనా నైవ గుణైః శ్రేష్ఠత్వముచ్యతే
కేతకీవరపత్రేభ్యో లఘూనామేవ గౌరవమ్. 511

తా. శ్రేష్ఠత్వం అనేది ముందుపుట్టినంతమాత్రాన రాదు; గుణాలచేతనే లభిస్తుంది. మొగలిపువ్వులోని పెద్ద రేకులకంటె చిన్న రేకులకే గౌరవం.

శిశుర్వా శిష్యా వా యదసి మమ తత్తిష్ఠతు తథా
విశుద్ధేరుత్కర్షస్త్వయి తు మమ భక్తిం ద్రఢయతి,
శిశుత్వం స్త్రైణం వా భవతు నను వన్ద్యాసి జగతాం
గుణాః పూజాస్థానం గుణిషు న చ లిఙ్గం న చ వయః.
(ఉ.రా.చ) 512

తా. (సీతను గూర్చి అరుంధతి అంటూన్న మాటలు). నీవు నాకు శిశువో శిష్యురాలివో! ఆ విషయం అలా ఉండనీ. కాని నీలో ఉన్న అత్యధికమైన పవిత్రతత్వం నీ విషయంలో నా కున్న భక్తిని దృఢం చేస్తూన్నది. నీవు శిశువు (వయస్సులో చిన్నదానవు) కావచ్చు, ఆడు దానివి కావచ్చు; జగత్తులో ఉన్నవాళ్లందరూ నీకు నమస్కరించాలి. పూజింపవలసినది గుణవంతులలో ఉన్న గుణాలనే; వాళ్ల లింగము కాని, వయస్సు కాని కాదు.

శమ్భుః శ్వేతార్కపుష్పేణ చన్ద్రమా వస్త్రతన్తునా
అచ్యుతః స్మృతిమాత్రేణ సాధవః కరసంపుటైః. 513

తా. తెల్లజిల్లేడు పువ్వు సమర్పిస్తే ఈశ్వరుడు, వస్త్రం దారం తీసి సమర్పిస్తే చంద్రుడూ, స్మరణమాత్రంచేతనే మహావిష్ణువు, చేతులు జోడించి నమస్కరిస్తే సత్పురుషులూ ప్రసన్ను లవుతారు.

శ్వశ్రూశ్చ మాతృతుల్యా స్యాత్తథా జ్యేష్ఠా స్వసాపి చ
తథా మాతుః సపత్నీ చ జ్యేష్ఠో భ్రాతా పితుః సమః. 514

తా. అత్తగారు, పెద్దసోదరి, తల్లి సవతి-వీళ్లు తల్లితో సమానులు జ్యేష్ఠుడైన సోదరుడు తండ్రివంటివాడు.

శక్తిం కరోతి సంచారే శీతోష్ణే మర్షయత్యపి
దీపయత్యుదరే వహ్నిం దారిద్ర్యం పరమౌషధమ్. (కలివి.54)

తా. దారిద్ర్యం గొప్ప ఔషధం; ఎందుచేతననగా-ఇది తిరగడానికి శక్తిని ఇస్తుంది; చలి, వేడి సహించే సామర్థ్యం కలిగిస్తుంది; జఠరాగ్ని బాగా పనిచేసేటట్లు చేస్తుంది.

శకటం పఞ్చహస్తేన దశహస్తేన వాజినమ్
గజం హస్తసహస్రేణ దేశత్యాగేన దుర్జనమ్. 516

తా. బండికి ఐదు గజాల దూరంలో ఉండాలి. గుఱ్ఱానికి పది గజాల దూరంలోను, ఏనుగకు వంద గజాల దూరంలోను ఉండాలి. దేశం వదలివెళ్లిపోయైనా దుష్టుడికి దూరంగా ఉండాలి
ఈ కాలానికి అనుగుణంగా చెప్పాలంటే బహుశా—

స్కూటరం పఞ్చహస్తేన దశభిస్తైలయానకమ్(కార్, బస్ మొ.)
లహరిం (లారీ) చ సహస్రేణ దేశత్యాగేన దుర్జనమ్. 517
అని మార్చాలి.

శ్రుతిర్విభిన్నా స్మృతయశ్చ భిన్నా
నైకో మునిర్యస్య వచః ప్రమాణమ్,
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం
మహాజనో యేన గతః స పన్థాః. (యక్షప్ర. 71) 518

తా వేదం వేరు వేరు విధంగా చెపుతుంది. స్మృతులు కూడా వేరు వేరుగానే ఉన్నాయి. ఈయన చెప్పినదే ప్రమాణం అని చెప్పడానికి తగిన ఒక ముని లేడు. (అందరు మునులు చెప్పినదీ ప్రమాణమే). ధర్మ తత్త్వం రహస్యంగా దాచబడి ఉంది. అందుచేత పెద్దవాళ్లందరూ ఎలా వెడితే అదే మార్గం.

శక్యో వారయితుం జలేన హుతభుక్ ఛత్రేణ సూర్యాతపో
నాగేన్ద్రో నిశితాఙ్కుశేన సమదో దణ్డేన గోగర్దభః,

వ్యాధిర్భేషజసంగ్రహైశ్చ వివిధైర్మన్త్రప్రయోగైర్విషం
సర్వస్యౌషధమస్తి శాస్త్రవిహితం మూర్ఖస్య నాస్త్యౌషధమ్.
(భర్తృ. నీతిశ.) 519

తా. అగ్నిని నీటితో చల్లార్చవచ్చు. ఎండను గొడుగుతో నివారించుకోవచ్చు. మదపుటేనుగును వాడియైన అంకుశంతో వశం చేసుకోవచ్చు. మదించిన ఎద్దునీ గాడిదనీ కఱ్ఱతో లొంగదీసికోవచ్చు. మందులిచ్చి వ్యాధుల్నీ, మంత్రప్రయోగాలచేత విషాన్నీ తగ్గించుకోవచ్చు. అన్నింటికి శాస్త్రోక్తమైన ఔషధం ఉన్నది కాని మూర్ఖుడికి ఔషధం లేదు.

శైలే శైలే న మాణిక్యం మౌక్తికం న గజే గజే
సాధవో న హి సర్వత్ర చన్దనం న వనే వనే. (చాణక్య 2-9)

తా ప్రతీ పర్వతంమీదా మాణిక్యం దొరకదు; ప్రతీ ఏనుగు కుంభస్థలంలోను ముత్యం ఉండదు. సత్పురుషులు అన్ని చోట్లా ఉండరు. ప్రతీ అరణ్యంలోనూ చందనం లభించదు.

శతేషు జాయతే శూరః సహస్రేషు చ పణ్డితః
వక్తా దశసహస్రేషు దాతా భవతి వా న వా. 521

తా. కొన్ని వందలమందిలో ఒక్క శూరుడు పుట్టవచ్చు. కొన్ని వేలమందిలో ఒక పండితుడు ఉండవచ్చు. కొన్ని పదివేలమందిలో ఒక వక్త ఉండవచ్చు, కొన్ని పదివేలమందిలో కూడా దాతృత్వగుణం ఉన్న వాడు ఉంటాడో ఉండడో సందేహమే.

శనైః పన్థాః శనైః కన్థా శనైః పర్వతలఙ్ఘనమ్
శనైర్విద్యా శనైర్విత్తం పఞ్చైతాని శనైః శనైః. 522

తా. మెల్లిగా నడవగా నడవగా మార్గం పూర్తి అవుతుంది రోజూ కొంచెం కొంచెం కుట్టగా కుట్టగా బొంత తయారవుతుంది. మెల్లిమెల్లిగా ఎక్కి పర్వతం దాటాలి. కొంచెం కొంచెంగా నేర్చుకొంటూ విద్య సంపాదించాలి. కొంచెం కొంచెంగా సంపాదిస్తే ధనం పోగవుతుంది.

శత్రోరపి గుణా వాచ్యా దోషా వాచ్యా గురోరపి
సర్వదా సర్వయత్నేన పుత్రే శిష్యవదాచరేత్. 523

తా. శత్రువులో ఉన్నవైనా సద్గుణాలు చెప్పుకోవాలి. పూజ్యుడే అయినా అతనితో ఉన్న దోషాలు దోషాలుగానే చెప్పాలి. పుత్రుణ్ణి ఎల్లప్పుడూ, అన్ని విధాలా, మంచి బోధించవలసిన శిష్యుణ్ణిగానే చూడాలి.

శఠం ప్రతి శఠం బ్రూయాదాదరం ప్రతి చాదరమ్
తత్ర దోషో న భవతి దుష్టే దుష్టం సమాచరేత్. 524

తా. వంచకుణ్ణి వంచిస్తూనే మాట్లాడాలి. ఆదరం చూపించేవానితో ఆదరంగా మాటలాడాలి. దుష్టుడి విషయంలో దౌష్ట్యమే చూపాలి; ఇందులో తప్పేమీ లేదు.

శతం విహాయ భోక్తవ్యం సహస్రం స్నానమాచరేత్
లక్షం విహాయ దాతవ్యం కోటిం త్యక్త్వా హరిం భజేత్. 525

తా. నూరు పనులున్నా వాటిని విడిచిపెట్టి భోజనం చెయ్యాలి. వెయ్యి పను లున్నా విడిచిపెట్టి స్నానం చెయ్యాలి. లక్ష పనులున్నా విడిచిపెట్టి దానం చెయ్యాలి. కోటి పనులున్నా విడిచిపెట్టి హరిసేవ చెయ్యాలి.

శ్మశానాన్తే పురాణాన్తే మైథునాన్తే చ యా మతిః
సా మతిః సర్వదా చేత్స్యాత్ కో న ముచ్యేత బన్ధనాత్. 526

తా. శ్మశానంనుంచి తిరిగివచ్చినతరవాత, పురాణం విన్నతరవాత, మైధునాంతంలోను ఉన్న బుద్ధి ఎల్లప్పుడూ ఉంటే సంసారబంధంనుంచి ముక్తి చెందనివాడు ఎవడుంటాడు ?

శ్వశురగృహనివాసః స్వర్గతుల్యో నరాణాం
యది భవతి వివేకీ పఞ్చ వా షడ్దినాని,

దధిమధుఘృతలోభాన్మాసమేకం వసేచ్చే
ద్భవతి విగతలజ్జో మానవో మానహీనః. 527

తా. మానవులకి మామగారి ఇంట్లో నివాసం స్వర్గంలాగే ఉంటుంది. వివేకవంతుడై ఐదు లేదా ఆరు రోజులు మాత్రమే ఉండాలి. పెరుగు, తేనె, నెయ్యి దొరకుతున్నాయి కదా అని సిగ్గు విడిచి ఒక మాసం ఉన్నాడా వాని మీద ఉన్న గౌరవం అంతా పోతుంది.

శాలకో గృహనాశాయ విత్తనాశాయ కుఞ్జరః
మహిషీ తోయనాశాయ సర్వనాశాయ మూషకః. 528

తా. బావమరదికి పెత్తనం ఇస్తే ఇంటికే ముప్పు. ఏనుగు ఉంటే ధనం నశిస్తుంది (దాన్ని మేపడానికి ఎంతైనా సరిపోదు). గేదె నీళ్లు పాడు చేస్తుంది. ఎలక అన్నీ పాడుచేస్తుంది.

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే,
శివస్య హృదయం విష్ణుర్విష్ణోశ్చ హృదయం శివః. 529

తా. విష్ణురూపుడైన శివునికి నమస్కారం. శివరూపుడైన విష్ణువుకు నమస్కారం. విష్ణువు శివుని హృదయం, శివుడు విష్ణువు హృదయం. వారిద్దరికీ ఏ మాత్రమూ భేదం లేదు.

శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే
అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్. (భ.గీ.) 530

తా. యోగభ్రష్టుడు (కొంతకాలం యోగాభ్యాసం చేసి పూర్తి సిద్ధి పొందనివాడు) మరణిస్తే పరిశుద్ధులూ శ్రీమంతులూ అయిన వాళ్ల ఇంటో పుడతాడు. లేదా బుద్ధిమంతులైన యోగుల ఇంట్లోనే పుడతాడు.

శుభం బ్రూయాత్ప్రియం బ్రూయాద్భద్రమిత్యేవ వా వదేత్
శుష్కవైరం వివాదం చ న కుర్యాత్కేన చిత్సహ. 531

తా. శుభం పలకాలి; ప్రియంగా పలకాలి. "మంచిది" అని అంటూ పలకాలి. ఎవరితోనూ వ్యర్థంగా వైరం పెట్టుకోకూడదు. వ్యర్థంగా వాదులాడకూడదు.

శుభం బ్రూయాచ్ఛుభం ధ్యాయేచ్ఛుభమిచ్ఛేచ్చ శాశ్వతమ్
జన్తూనాముపకారాయ కుర్యాద్దేహాదిచాలనమ్. 532

తా. శుభం పలకాలి; శుభమే ఆలోచించాలి ఎల్లప్పుడూ శుభమే కోరాలి. ఎవరికైనా ఉపకారం చేయడంకోసమే తన దేహాదుల్ని కదల్చాలి (ఉపయోగించాలి).

శ్రుతిస్మృతీ ఉభే నేత్రే ద్విజస్య పరికీర్తితే
ఏకేన హీనః కాణః స్యాద్ద్వాభ్యామన్ధః ప్రజాయతే. 533

తా. వేదమూ, స్మృతి (ధర్మశాస్త్రం) అనే రెండూ బ్రాహ్మణునికి రెండు కళ్లు. వాటిలో ఒకటి లేనివాడు ఒంటికన్నువాడు; రెండూ లేనివాడు గ్రుడ్డివాడు.

శ్రుతం హరతి పాపాని తథారోగ్యం ప్రయచ్ఛతి
రక్షాం కరోతి భూతేభ్యో జన్మనాం కీర్తనం మమ. 534

తా నా అవతారాల వర్ణనం వింటే పాపాలు తొలగిస్తుంది; ఆరోగ్యాన్ని ఇస్తుంది; సకలభూతాలనుండి (ప్రాణులనుండీ) రక్షణ ఇస్తుంది.

శుచి భూమిగతం తోయం శుచిర్నారీ పతివ్రతా
శుచిః క్షేమకరో రాజా సంతోషీ బ్రాహ్మణః శుచిః. 535

తా భూమిలో ఉన్న నీరు పవిత్రమైనది. పతివ్రతయైన స్త్రీ పవిత్రురాలు. ప్రజాక్షేమంకోసం పాటుబడే ప్రభువు పవిత్రుడు. సంతృప్తి ఉన్న బ్రాహ్మణుడు పవిత్రుడు.

# స

సస్యాని స్వయమత్తి చేద్వసుమతీ మాతా సుతం హన్తి చే
ద్వేలామమ్బునిధిర్విలఙ్ఘయతి చేద్భూమిం దహేత్పావకః,
ఆకాశం జనమస్తకే పతతి చేదన్నం విషం చేద్భవే
దన్యాయం కురుతే యదా క్షితిపతిః కస్తం నిరోద్ధుం క్షమః. 536

తా. నేలయే సస్యాలు తినేస్తే, తల్లే పుత్రుణ్ణి చంపేస్తే, సముద్రం తీరాన్ని దాటేస్తే, అగ్ని భూమినే కాల్చేస్తే, ఆకాశం విరిగి మనుష్యుల నెత్తిమీద పడితే, తినే అన్నం విషం అయితే, రాజే అన్యాయం చేస్తే అడ్డుకోగలిగినవాళ్లు ఎవరు ?

సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః (వి.నీ.) 537

తా. రాజా ! ఎప్పుడు చూచినా ప్రియమైన మాటలు చెప్పేవాళ్లు కోకొల్లలు దొరుకుతారు. ఇష్టం కానిదీ, భవిష్యత్తులో మంచిని చేసేదీ అయిన మాట చెప్పేవాళ్లు తక్కువే; వినేవాళ్లూ తక్కువే.

సత్కులే యోజయేత్కన్యాం పుత్రం విద్యాసు యోజయేత్
వ్యసనే యోజయేచ్ఛత్రుమిష్టం ధర్మేణ యోజయేత్. 538

తా. కన్యను మంచికుటుంబంలో ఇవ్వాలి. పుత్రునికి చదువులో శ్రద్ధ కలిగించాలి. శత్రువు దుర్వ్యసనాలకి లోనయ్యేటట్టు చెయ్యాలి. ఇష్టుడైనవాణ్ణి ధర్మమార్గంలో సంచరించేటట్లు చెయ్యాలి.

సర్వత్ర సంపదస్తస్య సంతుష్టం యస్య మానసమ్
ఉపానద్గూఢపాదస్య నను చర్మావృతైవ భూః. 539

తా. మనఃసంతుష్టి ఉన్నవానికి ప్రతిచోటా సంపదలే. పాదాలకి చెప్పులు తొడిగికొన్నవాడికి భూమి అంతా చర్మ కప్పినట్లే కదా ?

సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్న బ్రూయాత్సత్యమప్రియమ్
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మః సనాతనః. (మ.స్మృ.)

తా. సత్యం పలకాలి ప్రియమైన మాట చెప్పాలి. సత్యమే అయినా అప్రియమైన మాట చెప్పకూడదు. ప్రియం కదా అని అసత్యం చెప్ప గూడదు. ఇది సనాతనధర్మం అనగా ఎల్లప్పుడూ పాటించవలసిన ధర్మం.

స త్వా రామహితే యుక్తం ప్రత్యర్చయతి సాగరః
కృతే చ ప్రతికర్తవ్యమేష ధర్మః సనాతనః. (రామా.) 541

తా. ఈ సముద్రుడు రామునికి హితం చేయడానికి ఉద్యుక్తుడవైన నీకు తిరిగి పూజచేస్తున్నాడు. ఉపకారం చేసినవానికి ప్రత్యుపకారం చెయ్యాలి; ఇది సనాతనధర్మం. (ఇవి హనుమంతునితో మైనాకుడు అన్న మాటలు.)

సమాయాతి యదా లక్ష్మీర్నారికేలఫలాంబువత్
వినిర్యాతి యదా లక్ష్మీర్గజభుక్తకపిత్థవత్. 542

తా. లక్ష్మి వచ్చేటప్పుడు కొబ్బరికాయలోని నీరువలె తెలియకుండానే వసుంది. పోయేటప్పుడు ఏనుగు తిన్న వెలగపండులోని గుంజువలె తెలియ కుండానే హరించిపోతుంది.

సన్త ఏవ సతాం నిత్య మాపదుద్ధరణక్షమాః
గజానాం పఙ్కమగ్నానాం గజా ఏవ ధురంధరాః. 543

తా సత్పురుషులు ఆపదలలో చిక్కుకొన్నప్పుడు సత్పురుషులే వారిని ఉద్ధరించాలి. బురదలో దిగబడిపోయిన ఏనుగుల్ని ఏనుగులే పైకి లాగాలి.

సదా వక్రః సదా రుష్టః సదా పూజామపేక్షతే
కన్యారాశిస్థితో నిత్యం జామాతా దశమో గ్రహః. 544

తా. అల్లుడు పదవగ్రహం. ఈ గ్రహం ఎల్లప్పుడూ వక్రంగానే నడుస్తుంది; ఎల్లప్పుడూ ప్రతికూలంగానే ఉంటుంది; ఎల్లప్పుడూ పూజలు కోరుతూంటుంది. నిత్యమూ కన్యారాశితోనే ఉంటుంది.

స్త్రీ వినశ్యతి గర్వేణ తపః క్రోధేన నశ్యతి
గావో దూరప్రసారేణ హరిణీ గానలిప్సయా. 545

తా. గర్వం ఉంటే స్త్రీ నశిస్తుంది. క్రోధంచేత తపస్సు నశిస్తుంది. దూరంగా తిరగడంచేత గోవులు నశిస్తాయి. గానంమీద ఆసక్తిచేత లేడి నశిస్తుంది.

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ 546

తా. ఉపనిషత్తు లన్నీ ఆవులు. శ్రీకృష్ణుడు పాలు పిదుకువాడు. అర్జునుడు లేగదూడ. బుద్ధిమంతుడు భోక్త. గీత అనే గొప్ప అమృతం పిదుకబడినది

స్వగృహే పూర్ణ ఆచారః పరగేహే తదర్ధకః
తదర్ధకః పరగ్రామే పథి శూద్రవదాచరేత్. 547

తా. తన ఇంట్లో ఉన్నప్పుడు ఆచారం పూర్తిగా పాటించాలి పర గృహంలో ఉన్నప్పుడు దానిలో సగం పాటించాలి. పరగ్రామంలో ఉన్నప్పుడు దానిలో సగం పాటిస్తే చాలు. మార్గమద్యంలో ప్రయాణంలో ఉన్నప్పుడు శూద్రుడు ఎలాంటి ఆచారం పాటిస్తాడో అంత ఆచారం పాటిస్తే చాలు. (స్నానసంధ్యాదులు లేకపోయినా దోషం లేదు. ఆహారం విషయంలో కూడా పట్టింపు ఉండ నవసరం లేదు అని భావం).

సామృతైః పాణిభిర్ఘ్నన్తి గురవో న విషోక్షితైః
లాలనాశ్రయిణో దోషాస్తాడనాశ్రయిణో గుణాః.(మహాభాష్యం)

తా. పెద్దవాళ్లు పిల్లలను కొడతారంటే వాళ్లు చేతులకు అమృతం పూసుకొని కొడతారు; అంతే కాని విషం పూసిన చేతులలో కాదు. దోషాలు గారాబం చేయడాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి తాడనం (కొట్టడం) లో ఎన్నో గుణాలు ఉన్నాయి.

స్వయం మహేశః శ్వశురో నగేశః సఖా ధనేశ స్తనయో గణేశః
తథాపి భిక్షాటనమేవ శమ్భోర్బలీయసీ కేవలమీశ్వరేచ్ఛా. **549**

తా. తాను మహేశ్వరుడు; మామగారు పర్వతేశ్వరుడు; మిత్రుడైన కుబేరుడు ధనేశ్వరుడు; కుమారుడు గణేశ్వరుడు అయినా ఈశ్వరుడు భిక్షాటనం చేసుకోవలసివచ్చింది. కేవలం ఈశ్వరేచ్ఛ బలవత్తరమైనది.

స్వధర్మరూపో రాజేన్ద్రో దయారూపేణ మన్త్రిణః
సేవకాః సాధురూపేణ యథా రాజా తథా ప్రజాః. **550**

తా. రాజు సాక్షాత్తు ధర్మస్వరూపుడైతే మంత్రులు దయాస్వరూపులుగా ఉంటారు; సేవకులు సత్పురుషులుగా ఉంటారు. రాజు ఎట్లో ప్రజలూ అట్లే.

స్యాదత్యన్తనిరక్షరః క్షితిపతిః శ్రీకారమాత్రాశ్రయా
న్మన్త్రీ తత్కథితార్థలేఖనపర స్తత్సేవకో జాయతే,
అధ్యేతా తదగారమేవ భజతే విద్వాంస్తు తం యాచతే
యావాన్యస్య గిరా సమం పరిచయస్తావద్విదూరే శ్రియః. **551**

తా అక్షరం తెలియనివాడు ప్రభువు అవుతాడు. 'శ్రీ' అని మాత్రం వ్రాయగలిగినవాడు మంత్రి అవుతాడు. అతడు చెప్పుతూంటే దానిని వ్రాయగలిగినవాడు ఆ మంత్రికి సేవకుడౌతాడు, చదువుకొంటున్నవాడు వాని ఇంటిచుట్టూ తిరుగుతాడు. విద్వాంసుడు వీణ్ణి యాచిస్తాడు. ఈ విధంగా సరస్వతికి ఎంత దగ్గరగా ఉంటే లక్ష్మికి అంత దూరం అవుతూ ఉంటాడు.

సజ్వరో విజ్వరో వాపి పిత్తలః పరిభుఞ్జయేత్
యే గుణా లఙ్ఘనే ప్రోక్తాస్తే గుణా లఘుభోజనే. 552

తా. పిత్తప్రకృతి కలవాడు జ్వరం వచ్చినప్పుడైనా, జ్వరం లేనప్పుడైనా భోజనం చెయ్యడమే మంచిది. లంఘనం చేయడంలో ఉన్న లాభాలు లఘుభోజనంలో కూడా ఉన్నాయి.

సౌమిత్రిర్వదతి విభీషణాయ లఙ్కాం
దేహి త్వం భువనపతే వినైవ కోశమ్,
ఏతస్మిన్ రఘుపతిరాహ వాక్యమేతత్
విక్రీతే కరిణి కిమఙ్కుశే వివాదః. 553

తా. లక్ష్మణుడన్నాడు—"మహారాజా! ధనకోశం మినహాయించుకొని లంకను విభీషణునికి ఇమ్ము". దానికి రాముడు ఇలా అన్నాడు—"ఏనుగును అమ్మివేసిన తరవాత అంకుశం అమ్మాలా వద్దా అని వివాదం ఎందుకు' (ఇది కేవలం సమస్యాపూరణంకోసం చెప్పినది. లక్ష్మణుని స్వభావానికి విరుద్ధమైనది).

సంపీతేఽధరమధుని స్తనే గృహీతే
సంజాతే గతవసనే తథోరుయుగ్మే,
కిం నీవీగతమబలే రుణత్సి పాణిం
విక్రీతే కరిణి కిమఙ్కుశే వివాదః. 554

తా. సుగమం.

సముపాగతవతి నాథే గేహే కృష్ణే కరోమి కిం త్వద్య
స్మర సఖి పాణినిసూత్రం విప్రతిషేధే పరం కార్యమ్. 555

తా. భర్త ఇంటికి వస్తే, అప్పటికే కృష్ణుడు ఇంట్లో ఉంటే ఇప్పుడేమి చెయ్యాలి? సఖీ! "విప్రతిషేధే పరం కార్యమ్" అనే పాణినిసూత్రాన్ని

జ్ఞాపకం తెచ్చుకో. సమానబలం కల రెండింటికి పోటీ వచ్చినప్పుడు పర మైనదాన్ని స్వీకరించాలి" అని ఆ సూత్రానికి అర్థం. ఇక్కడ పరుడు శ్రీకృష్ణుడు; ఆతనికి ప్రాధాన్యం ఇవ్వాలి అని చమత్కారం.

సద్భావో నా౽స్తి వేశ్యానాం స్థిరతా నాస్తి సంపదామ్
వివేకో నాస్తి మూర్ఖాణాం వినాశో నాస్తి కర్మణామ్. 556

తా వేశ్యలలో మంచితనం ఉండదు. సంపదలు స్థిరంగా ఉండవు. మూర్ఖులకు వివేకం ఉండదు. చేసిన కర్మలకి వినాశం లేదు.

స్వహస్తగ్రథితా మాలా స్వయం ఘృష్టం చ చన్దనమ్
స్వహస్తలిఖితం స్తోత్రం శక్రస్యాపి శ్రియం హరేత్. 557

తా స్వయంగా అల్లుకొన్న పుష్పమాల ధరించడం, స్వయంగా తీసిన మంచిగంధం పూసుకోవడం, స్వహస్తంతో వ్రాసిన స్తోత్రం చదవడం-ఇవి ఇంద్రుని ఐశ్వర్యాన్ని కూడా పోగొడతాయి.

సద్భిస్తు లీలయా ప్రోక్తం శిలాలిఖితమక్షరమ్
అసద్భిః శపథేనాపి జలే లిఖితమక్షరమ్. 558

తా. సత్పురుషులు మామూలుగా పలికిన మాట కూడా శిలాలిఖితమైన అక్షరం వంటిది. అసత్పురుషులు ఒట్టు పెట్టి చెప్పిన మాటకూడా నీటిపైన వ్రాతయే

సంధ్యాముపాసతే విప్రా నిత్యమేవ ద్విజోత్తమాః
శుచిర్వాప్యశుచిర్వాపి సంధ్యా కాలే విధీయతే. 559

తా. బ్రాహ్మణులు, ద్విజులలో ఉత్తములైనవారూ, నిత్యమూ సంధ్యను ఉపాసిస్తారు. శుచిగా ఉన్నా, అశుచిగా ఉన్నా సరిగా సంధ్యా సమయంలో సంధ్యావందనం చెయ్యాలని శాస్త్రం.

సర్వేషాం బ్రాహ్మణానాం తు త్రిషు కాలేష్వయం విధిః
శుచిర్వాప్యశుచిర్వాపి సంధ్యా కాలే విధీయతే. 560

తా. మూడు సంధ్యాకాలాలలోను ఇది బ్రాహ్మణులు అందరూ చేయవలసినది. శుచిగా ఉన్నా అశుచిగా ఉన్నా సంధ్యాసమయంలో సంధ్యావందనం చెయ్యాలని విధి.

సువర్ణపుష్పాం పృథివీం చిన్వన్తి పురుషాస్త్రయః
శూరశ్చ కృతవిద్యశ్చ యశ్చ జానాతి సేవితుమ్. 561

తా. శూరుడూ, ఏదో ఒక విద్య చక్కగా నేర్చినవాడూ, ఎలా సేవ చెయ్యాలో తెలిసినవాడూ-వీళ్లు ముగ్గురూ భూమి మీద బంగారు పువ్వులు కోసుకుంటారు.

సర్వః సర్వం న జానాతి సర్వజ్ఞో నాస్తి కశ్చన
నైకత్ర పరినిష్ఠాస్తి జ్ఞానస్య పురుషే క్వచిత్. 562

తా. ప్రతివాడికే ప్రతీదీ తెలియదు. సర్వజ్ఞుడు (అన్నీ తెలిసినవాడు) ఎవడూ లేడు. జ్ఞానం ఏ ఒక్క పురుషునిలోను పరిపూర్ణం కాదు.

స్వదత్తాం పరదత్తాం వా యో హరేచ్చ వసుంధరామ్
షష్టివర్షసహస్రాణి విష్ఠాయాం జాయతే కృమిః. 563

తా. తాను ఇచ్చిన భూమిని గాని, ఇతరులు ఇచ్చిన భూమిని గాని హరించినవాడు అరవైవేల సంవత్సరాలు మలంలో కృమి అయి పుడతాడు.

సత్యం జనవిరోధాయ అసత్యం జనరఞ్జనమ్
సురా విక్రీయతే స్థానే దధి క్షీరం గృహే గృహే. 564

తా. సత్యం జనానికి ఇష్టం కాదు. అసత్యం జనులకు ఆకర్షకంగా ఉంటుంది. కల్లు ఒక చోట పెట్టి అమ్ముతారు. పాలు, పెరుగూ ఇంటింటా అమ్ముతారు. ఒకచోట పెట్టుకొని కల్లు అమ్మినా జనం అక్కడికే వెళ్లి కొనుక్కుంటారు. ఇంటింటికి తిరిగి అమ్మితేనేకాని పాలు పెరుగు అమ్ముడుకావు.

సమః శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః
శీతోష్ణసుఖదుఃఖేషు సమః సంగవివర్జితః. (భ.గీ.) 565

తా. శత్రువునూ, మిత్రుణ్ణి సమంగా చూచేవాడు, మానావమానాలు రెండింటినీ ఒకే విధంగా తీసికొనేవాడూ, శీతోష్ణాలలోను, సుఖదుఃఖాలలోను సమంగా ప్రవర్తించేవాడు, సంగం (దేనియందూ ఆత్యాసక్తి) లేనివాడూ నిజమైన స్థితప్రజ్ఞుడు (జ్ఞాని).

సర్వే బ్రహ్మ వదిష్యన్తి సంప్రాప్తే తు కలౌ యుగే
నైవ తిష్ఠన్తి మైత్రేయ శిశ్నోదరపరాయణాః. 566

తా. మైత్రేయా! కలియుగం వచ్చేసరికి అందరూ బ్రహ్మను గూర్చే మాటలాడతారు. అయితే సర్వదా భోగపారాయణులై ఆ బ్రహ్మను గూర్చి చింతనమాత్రం చెయ్యరు.

సకృజ్జల్పన్తి రాజానః సకృజ్జల్పన్తి పణ్డితాః
సకృత్ప్రదీయతే కన్యా త్రీణ్యేతాని సకృత్సకృత్. 567

తా రాజులు (ప్రభువులు) ఒక్కమారే మాటలాడతారు. పండితులు ఒక్కమారే మాట్లాడతారు. కన్యను ఇవ్వడం ఒక్కమారే జరుగుతుంది. ఈ మూడూ ఒక్కమారే జరుగుతాయి.

సర్వం కాలకృతం మన్యే భవతాం చ యదప్రియమ్
స కాలో యద్వశే లోకో వాయోరివ ఘనావలిః. 568

తా అన్నింటికి కాలమే కారణమని అనుకొంటున్నాను. మీకు జరిగిన అప్రియానికికూడా కాలమే కారణం మేఘాలు వాయువు వశంలో ఉన్నట్లు ఈ లోకం దేని వశంలో ఉన్నదో అదే కాలం.

సర్వం చ ఖల్విదం బ్రహ్మ సర్వమాత్మేతి భావయేత్
అహమన్యదిదం చాన్యదిత్యేషా ఖణ్డఖణ్డధీః. 569

తా. ఇదంతా బ్రహ్మస్వరూపమే, ఇదంతా ఆత్మయే అని భావించాలి. 'నేను వేరు; ఇది వేరు' అనే భావన ఖండబుద్ధి (చిన్నబుద్ధి).

సత్యానృతం తు వాణిజ్యం శ్వవృత్తిర్నీచ సేవనమ్
వర్జయేత సదా విప్రో రాజన్యశ్చ జుగుప్సితమ్. 570

తా. వాణిజ్యంలో (వర్తకంలో) సత్యము, అనత్యమూ రెండూ కలిసి ఉంటాయి నీచుల సేవ కుక్క వృత్తి. బ్రాహ్మణుడు క్షత్రియుడూ కూడా జుగుప్సితమైన ఈ వృత్తిని వర్జించాలి.

సత్యానృతే తు వాణిజ్యం తేనాపది చ జీవనమ్
సేవా శ్వవృత్తిరాఖ్యాతా బ్రాహ్మణానాం విగర్హితా. 571

తా. వర్తకంలో సత్యమూ అనత్యమూ కలిసి ఉంటాయి. ఆపత్కాలంలో (రోజు గడవని పరిస్థితిలో) ఆ వాణిజ్యం చేయవచ్చును. సేవ అనేది కుక్క వృత్తి. అది బ్రాహ్మణులకు నింద్యమైనది.

సర్వం పరవశే దుఃఖం సర్వమాత్మవశే సుఖమ్
ఇతి మత్వా తు రాజేన్ద్ర స్వయం దాసా స్తపస్వినః. 572

తా. మహారాజా! పరులమీద ఆధారపడితే ప్రతీదీ దుఃఖకరమే. తన చేతులలోనే ఉన్న ప్రతీదీ సుఖకరం. ఈ విషయం తెలుసుకొనే మునులు స్వయందాసులుగా ఉంటారు. (ఎవరి పనులు వాళ్లు చేసుకొంటారు. ఇతరుల మీద ఆధారపడరు.)

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః.(భ,గీ.)

తా. సమస్తధర్మాలు విడచి నన్ను ఒక్కణ్ణే శరణు పొందుము. నేను నిన్ను అన్ని పాపాలనుండీ విడిపింపచేస్తాను. విచారించకుము. (ఇది పైకి గోచరించే అర్థం).

తా. అన్ని ధర్మాలను కూడా పరిత్యజించి అనగా సర్వకర్మ సంన్యాసం చేసి, నన్నొక్కనినీ స్వస్వరూపంగా ధ్యానిస్తూ శరణుపొందుము.

నీకు పాపబంధం కాని పుణ్యబంధం కాని లేకుండా చేస్తాను. విచారించకుము. (ఇది శ్రీ శంకరాచార్యులు చెప్పిన అర్థం).

స రాఘవేన్ద్రో౽హృతరాజ్యదారః
స వానరేన్ద్రో౽హృతరాజ్యదారః,
ఏవం తయోరధ్వని దైవయోగాత్
సమాసశీలవ్యసనేషు సఖ్యమ్. **574**

తా. రాముని రాజ్యం పోయింది, భార్యను అపహరించారు. సుగ్రీవుని రాజ్యాన్నీ, భార్యనీ అపహరించారు. వీళ్లిద్దరూ దైవయోగంవల్ల మార్గంలో కలుసుకుని మిత్రులైనారు. సమానమైన శీలమూ, వ్యసనమూ ఉన్నవాళ్ల మధ్యనే స్నేహం కుదురుతుంది.

సర్వౌషధానామమృతం ప్రధానం
సర్వేషు సౌఖ్యేష్వశనం ప్రధానమ్,
సర్వేన్ద్రియాణాం నయనం ప్రధానం
సర్వేషు గాత్రేషు శిరః ప్రధానమ్. **575**

తా. ఔషధాలన్నింటిలోకీ అమృతం ప్రధానం. అన్ని సౌఖ్యాలలోకీ భోజనసుఖం ప్రధానం. అన్ని ఇంద్రియాలలోకీ నేత్రం ప్రధానం. అన్ని అవయవాలలోకీ శిరస్సు ప్రధానం.

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః. **576**

తా. అంతటా సమదృష్టిగల యోగి తాను అన్ని ప్రాణులలోను ఉన్నట్లు. తనలో అన్ని ప్రాణులూ ఉన్నట్లూ చూస్తాడు.

సద్యః ప్రజ్ఞాహరా తుణ్డీ సద్యః పజ్ఞాకరీ వచా
సద్యః శక్తిహరా నారీ సద్యః శుక్రకరం పయః. **577**

తా. దొండ వెంటనే బుద్ధిమాద్యం కలిగిస్తుంది. వస వెంటనే బుద్ధి పెంచుతుంది నారి వెంటనే బలాన్ని హరిస్తుంది. క్షీరం వెంటనే శుక్రాలి వృద్ధి చేస్తుంది.

సర్వత్ర జయమన్విచ్ఛేత్ పుత్రాదిచ్ఛేత్పరాజయమ్
వాసుదేవం నమస్యన్తి వసుదేవం న తే జనాః. 578

తా. అందరినుండీ జయంకోరాలి పుత్రునినుండి పరాజయం కోరాలి. జనులు వాసుదేవునికి (వసుదేవుని కుమారుడైన కృష్ణునికి) నమస్కారం చేస్తారు. కాని వసుదేవుడి కెవరూ నమస్కరించరు.

సర్వదా స్వహితమాచరణీయం
కిం కరిష్యతి జనో బహుజల్పః,
సర్వలోకపరితోషకారకో
నాస్తి తత్ర ఖలు కశ్చిదుపాయః. 579

తా. ఎల్లప్పుడూ తన కేది హితమో అది చేసుకొంటూ ఉండాలి. ఏమేమో మాటలాడుతూనే ఉండే జనం ఏం చేస్తారు? అందరికీ సంతోషం కలిగించే ఉపాయం లోకంలో లేదు కదా?

సర్వనాశే సముత్పన్నే హ్యర్ధం త్యజతి పణ్డితః
అర్ధేన కురుతే కార్యం సర్వనాశో న జాయతే. 580

తా. అంతా పోయే పరిస్థితి వచ్చినప్పుడు తెలివైనవాడు సగం విడిచి పెట్టడానికి వెనుకాడకూడదు. మిగిలిన సగంతో పనిచేసుకోవచ్చు. మొత్తం పోతే ఏ పనీ జరగదు కదా?

సహతే శరశతపాతానాజానేయః కశాం న వా సహతే
సహతే విపత్సహస్రం మానీ నైవాపమానలేశమపి. 581

మంచిజాతిగుఱ్ఱం వందలకొలది బాణాలు మీద పడినా సహిస్తుంది. కాని కొరడా దెబ్బ మాత్రం సహించదు. అభిమానం కలవాడు వేలకొలది ఆపదలను సహిస్తాడు కాని చిన్న అవమానాన్ని కూడా సహించజాలడు.

సహ పరిజనేన విలసతి ధీరో గహనాని తరతి పునరేకః
విషమేకేన నిపీతం త్రిపురజితా సహ సురైరమృతమ్. 582

తా. ధీరుడు సుఖసమయంలో తనవాళ్లం దరితోను కలిసి ఆనందిస్తాడు; కష్టాలు మాత్రం ఒంటరిగానే భరించి వాటిని దాటుతాడు శివుడు తాను ఒక్కడే విషం త్రాగాడు; అమృతంమాత్రం దేవత లందరితోను కలిసి అరగించాడు.

సామయాచారికో ధర్మో జాతిదేశకులోద్భవః
గ్రామాచారః పరిగ్రాహ్యస్తత్ర తత్ర యథోదితః. 583

తా. ఆ యా జాతులలోను, దేశాల (ప్రాంతాల)లోను, కులాలలోను ప్రచారంలో ఉన్న సామయికాచారాన్నీ, అక్కడక్కడ గ్రామాలలో ఉండే ఆచారాన్నీ పాటించాలి.

సర్వం పరవశే దుఃఖం సర్వమాత్మవశే సుఖమ్
ఏతద్విద్యాత్సమాసేన లక్షణం సుఖదుఃఖయోః. 584

తా. పరుల ఆధీనంలో ఉన్నది అంతా దుఃఖమే; తన వశంలో ఉన్నది అంతా సుఖమే. సుఖదుఃఖాలకి సంగ్రహంగా లక్షణం చెప్పాలంటే ఇదే.

సభా జితా వస్త్రవతా మిష్టాశా గోమతా జితా
అధ్వా జితో యానవతా సర్వం శీలవతా జితమ్. 585

తా. మంచివస్త్రాలు ఉన్నవాడు సభను జయిస్తాడు. ఆవుల పాడి ఉన్నవాడు మధురభక్ష్యాల ఆశను జయిస్తాడు. వాహనం ఉన్నవాడు మార్గాన్ని జయిస్తాడు. సచ్ఛీలం ఉన్నవాడు అన్నీ జయిస్తాడు.

సంగః సర్వాత్మనా త్యాజ్యః స చేత్త్యక్తుం న శక్యతే
స సద్భిః సహ కర్తవ్యః సన్తః సర్వస్య భేషజమ్. 586

తా. అన్ని విధాలా సంగం విడిచిపెట్టడం మంచిది. అది విడిచి పెట్టడం శక్యం కాకపోతే ఆ సంగం సత్పురుషులతో చేయడం మంచిది. సత్పురుషులు అన్నింటికీ మంచి మందు.

సహవాసీ విజానాతి సహవాసివిచేష్టితమ్
బకం కిం వర్ణ్యసే రామ యేనాహం నిష్కులీకృతః. 587

తా. సహవాసి చేష్టలన్నీ సహవాసికే (కూడా ఉండేవానికే) తెలుస్తాయి. రామా! నన్ను కులం లేకుండా చేసిన కొంగను ఎందుకు వర్ణిస్తావు (దీనికి సంబంధించి ఏదో కథ ఉండి ఉంటుంది).

సారం భాగీరథీతోయం సారం జాప్యం చ వైదికమ్
బ్రహ్మచర్యం తపఃసారం సారం మాధవసేవనమ్. 588

తా. గంగాజలం శ్రేష్ఠమైనది. వైదికజపం శ్రేష్ఠమైనది. తపస్సులలో బ్రహ్మచర్యం శ్రేష్ఠమైనది. మాధవసేవ శ్రేష్ఠమైనది.

స్థానభ్రష్టా న శోభన్తే దన్తాః కేశా నఖా నరాః
స్థానభ్రష్టాస్తు శోభన్తే సింహాః సత్పురుషా గజాః. 589

తా. దంతాలు, జుట్టు, గోళ్లు, మానవులు ఉన్న స్థానంనుంచి దూరం అవుతే శోభించవు (రు). సింహాలు, సత్పురుషులు, ఏనుగులుఉన్న స్థానంనుండి దూరంగా వెళ్లినా శోభిస్తారు

"సర్వస్యర్వే" సుమతికుమతీ సంపదాపత్తిహేతూ
"ఏకో గోత్రే" ప్రభవతి పుమాన్ యః కుటుమ్బం బిభర్తి,
"వృద్ధో యూనా" సహ పరిచయాత్త్యజ్యతే కామినీభిః
"స్త్రీ పుంవచ్చ" ప్రభవతి యదా తద్ధి గేహం వినష్టమ్. 590

తా. (ఒక ఇంట్లో ప్రవేశించి ఉన్న బ్రహ్మరాక్షసుడు పాణిని సూత్రాలు సమస్యగా ఇచ్చి వాటితో శ్లోకం పూర్తిచేయగలిగిన వారెవరైనా వస్తే ఈ ఇల్లు వదులుతానని అన్నాడట. వీటిని కాళిదాసు పూర్తిచేశా దని కథ. కొటేషన్ మార్కులో ఉన్న మూడు పాణిని సూత్రాలు, మూడవ పాదంలోది సూత్రభాగం).

మంచి బుద్ధి, చెడ్డ బుద్ధి అనే ఈ రెండూ అందరి సంపదకు ఆప దకూ హేతువులు. కుటుంబాన్ని పోషించ గలిగిన ఒక్క పురుషుడే ఆ గోత్రంలో సమర్థుడుగా ఎంచబడతాడు. యువకునితో పరిచయం ఏర్పడిన కామిని వృద్ధుణ్ణి విడిచిపెట్టివేస్తుంది ఏ ఇంట్లో స్త్రీ పురుషుడు వలె అధికారం చలాయిస్తుందో ఆ ఇల్లు నష్టాల పాలవుతుంది.

సుఖస్యానన్తరం దుఃఖం దుఃఖస్యానన్తరం సుఖమ్
న నిత్యం లభతే దుఃఖం న నిత్యం లభతే సుఖమ్. 591

తా సుఖం తరవాత దుఃఖం వస్తుంది, దుఃఖం తరవాత సుఖం కలుగుతుంది. ఏ ఒక్కడూ ఎల్లప్పుడూ దుఃఖమే పొందడు; ఎల్లప్పుడూ సుఖం పొందడు.

సుఖమధ్యే స్థితం దుఃఖం దుఃఖమధ్యే స్థితం సుఖమ్
ద్వయమన్యోన్యసంయుక్తం ప్రోచ్యతే జలపఙ్కవత్. 592

తా. సుఖం మధ్య దుఃఖం ఉంది; దుఃఖం మధ్య సుఖం ఉంది. ఈ రెండూ నీరూ బురదా లాగ ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి.

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి. (భ.గీ.)

తా. అర్జునా ! సుఖదుఃఖాలనీ, లాభాలాభాలనీ, జయాపజయాలనీ సమంగా చేసికొని (భావించి) యుద్ధానికి సన్నద్ధుడవు కావాలి. అలా చేస్తే నీకు పాపం ఉండదు.

సుఖార్థీ చేత్త్యజేద్విద్యాం విద్యార్థీ చ త్యజేత్సుఖమ్
సుఖార్థినః కుతో విద్యా కుతో విద్యార్థినః సుఖమ్. 594

తా. సుఖం కావాలని అనుకుంటే విద్య విడిచిపెట్టివేయాలి. విద్య కావాలని అనుకుంటే సుఖం విడిచిపెట్టాలి. సుఖం కావాలని అనుకొనే వానికి విద్య ఎక్కడ; విద్యార్థికి సుఖం ఎక్కడ?

సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా
పరో దదాతీతి కుబుద్ధిరేషా,
అహం కరోమీతి వృథాభిమానః
స్వకర్మసూత్రగ్రథితో హి లోకః. 595

సుఖం కలిగించేవాడు గాని దుఃఖం కలిగించేవాడు గాని ఎవడూ లేడు. ఈ సుఖదుఃఖాలు ఎవరో పరులు కలిగిస్తున్నారని అనుకోవడం వెఱ్ఱి. "నేను ఈ పనిచేస్తున్నాను" అని అనుకోవడం వ్యర్థమైన అభిమానం (అహంకారం మాత్రమే). ఈ లోకంలో ప్రతివాడూ తాను చేసిన కర్మ అనే త్రాడుచేత బంధింపబడి ఉన్నాడు.

సిద్ధమన్నం ఫలం పక్వం నారీప్రథమయౌవనమ్
సుభాషితం చ తామ్బూలం సద్యో గృహ్ణాతి బుద్ధిమాన్. 596

తా. సిద్ధమైన అన్నమూ, పండిన ఫలమూ నారీప్రథమయౌవనమూ, మంచిమాటా, తాంబూలమూ వీటిని తెలివైనవాడు లభించిన వెంటనే తీసికోవాలి.

## హ

హీనసేవా న కర్తవ్యా కర్తవ్యో మహదాశ్రయః
పయోఽపి శౌణ్డికీహస్తే వారుణీత్యభిధీయతే. 597

తా ఎల్లప్పుడూ గొప్పవాణ్ణే సేవించాలి కాని నీచుల్ని సేవించకూడదు. కల్లు అమ్ముకొనేదాని చేతుల్లో పాలు ఉన్నా దాన్ని కల్లు అనుకొంటారు.

హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి
లలాటలిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే. 598

తా. నుదుటిమీద వ్రాసిన వ్రాతను విష్ణువైనా, శివుడైనా, బ్రహ్మైనా, దేవతలైనా తుడిచివేయజాలరు.

హసన్తీం వా హసన్తీం వా హసన్తీం వామలోచనామ్
హేమన్తే యే న సేవన్తే తే నరాః శీతవఞ్చితాః. 599

తా. హేమంతఋతువులో కుంపటిని గాని, కంబళీని కాని నవ్వుతూన్న యువతిని గాని సేవించని నరులు శీతబాధతో శ్రమపడవలసిందే.

హస్తాదపి న దాతవ్యం గృహాదపి న దీయతే
పరోపకరణార్థాయ వచనే కా దరిద్రతా. 600

తా. చేతిమంచి ఏమీ ఇవ్వడంలేదు. ఇంట్లోనుంచి కూడా తీసికొనివచ్చి ఇచ్చేదేమీ లేదు. పరోపకారంకోసం నాలుగు మంచిమాటలు చెప్పడంలో దారిద్ర్యం ఏమున్నది ?

హరిః కరీ వృశ్చికవేణురమ్భా
వినాశకాలే ఫలముద్వహన్తి,
యథా తథా సజ్జనదుర్జనానాం
వినాశకాలే విపరీతబుద్ధిః. 601

తా. సింహము, ఏనుగు, తేలు, వెదురు, అరటిచెట్టు ఇవి వినాశకాలం వచ్చినపుడు ఫలించినట్లుగా (గర్భం ధరించడం, కాయలుకాయడం) సజ్జనులైనా దుర్జనులైనా వాళ్లకి వినాశకాలం వచ్చినదంటే విపరీతబుద్ధి పుడుతుంది. (అరటిచెట్టు విషయంలో ఇది నిజమైనా మిగిలినవాటి విషయంలో ఇది ఎంతవరకూ నిజమో తెలియదు .

హసతా లభ్యతే నారీ రుదతా లభ్యతే ధనమ్
పఠతా లభ్యతే విద్యా త్యజతా లభ్యతే యశః. 602

తా. నవ్వుతూ ఉండేవాడు స్త్రీని పొందకలుగుతాడు. ఎప్పుడూ ఏడ్చేవాడు (శ్రమపడేవాడు) ధనం పొందుతాడు. చదివేవాడు విద్య పొందుతాడు. త్యాగం (దానం) చేసేవాడు కీర్తి పొందుతాడు

హసద్భిః క్రియతే కర్మ రుదద్భిరనుభూయతే
అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్. 603

తా. నవ్వుతూ పాపకర్మలు చేస్తారు. ఏడుస్తూ వాటి ఫలం అనుభవిస్తారు, చేసిన కర్మ మంచిదైనా చెడ్డదైనా అనుభవించి తీరాలి.

— o —